

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 189 పేజీలు: 8+16 వెల: 6.50


**గాజా స్వాధీనానికి ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం** 5లో

**తమిళనాడుకు ఇక సొంత విద్యా విధానం**

# అంతా అప్రమత్తం

## హైదరాబాద్‌లో వరద నిర్వహణకు మూసీ పునరుజ్జీవమే ప్రత్యామ్నాయం

### చెరువులు, కుంటలు, నాలాలు, ఎస్టీపీల ద్వారా మూసీకి అనుసంధానం

### నీటి ప్రవాహానికి వీలుగా డ్రైనేజీల నిర్వహణ

### వర్షాల ఇబ్బందులను అధిగమించేందుకు పటిష్ట చర్యలు: సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం హైదరాబాద్‌లో వర్షాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** హైదరాబాద్ మహానగరంలో భారీవర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను అధిగమించటంతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే అభివృద్ధికి వీలుగా పనులు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే, అత్యవసరంగానే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు.

ఢిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి గురువారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన వర్షం, తలెత్తిన ఇబ్బందులు, అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి అత్యధికంగా 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ట్రాఫిక్ స్తంభించటంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వరద నీటితో ముంపు పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. భారీవర్షం ఒకే సారి కురవటంతో విపత్కర పరిస్థితులు >>2




# ఇసికి రాహుల్ 5 ప్రశ్నలు


## ఓటు హక్కుపై మీరు దాడిచేస్తే మీపై మేం చేస్తాం

### ఒక వ్యక్తి.. ఒక ఓటు మీకు లెక్కలేదా?

### తీవ్ర ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత

**బెంగళూరు, ఆగస్టు 8:** బీహార్ ఓటర్ల జాబితా సవరణ 'సర్'పై తీవ్ర ఆరోపణలుచేసిన ఎఐసిసి నాయకుడు రాహుల్‌గాంధీ ఆధారాలుచూపించాలని లేదంటే దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని సంజాయిషీ కోరిన భారత ఎన్నికల సంఘానికి రాహుల్‌గాంధీ కూడా ధీటుగా అల్టిమేటమ్ ఇచ్చారు. అంతేకాకుండా తాము సంధించిన ఐదు ఆరోపణలకు సమాధానాలు ఇవ్వాలని ఆరోపించారు. భారత ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుపై మీరు దాడిచేస్తే, మీపై మేం దాడి చేస్తామని రాహుల్. కేంద్ర ఎన్నికల >>2


**ఆరోపణలు రుజువు చేయకుంటే క్షమాపణ చెప్పాల్సిందే: సవాల్ విసిరిన ఇసి** 2లో



# భారత్‌కు రండి

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోడీ ఫోన్‌కాల్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండడంతో భారత్‌పై అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. తన మాట వినడం లేదంటూ భారత్‌పై ఆయన ప్రతీకార సుంకాలను అంతకంతకు పెంచుకుంటూ పోతున్నారు. అలాంటి వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కి భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్ చేశారు. భారత్‌లో పర్యటించాలని పుతిన్‌ను ఆహ్వానించారు. ఈ ఏడాది చివరిలో 23వ భారత్, రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు హాజరు కావాలని రష్యా దేశాధ్యక్షుడు పుతిన్‌ను మోడీ కోరారు. దీంతో భారత్, రష్యా మధ్య భాగ స్వామ్యం మరింత బలోపేతం కావ డంపై వీరిరువురు చర్చించారు. ఉక్రెయిన్‌తో >>2



# మోడీజీ! మీరు చైనా రండి

## ఆహ్వానించిన జిన్‌పింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** భారత్‌తో వాణిజ్య చర్చలు నిలిపివేసినట్లు ట్రంప్ ప్రకటించడం అంతేకాకుండా 50శాతానికి సుంకాలు పెంచడం వంటి అంశాలపై విభేదించిన భారత్‌తో కటీఫ్ చెపుతున్న ట్రంప్ వైఖరి ఇలా ఉంటే మరోపక్క భారత్‌తో దౌత్యబంధాలు మరింతపెంచుకునేందుకు ప్రపంచదేశాలు తహతహలాడుతున్నాయి. ఇందులోభాగంగానే ఆగస్టు చివరిలో తియాంజిన్ నగరంలోజరిగే >>2

# తయారీలో దిక్సూచి

## తొషిబా నుంచి మరో రూ. 347 కోట్ల పెట్టుబడులు

### రూ.177 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ

### సంగారెడ్డిలో యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



శుక్రవారం సంగారెడ్డిలో తొషిబా యూనిట్‌కు భూమిపూజచేసిన పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు, సంస్థ ప్రతినిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** తెలంగాణను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు మా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో రూ.347 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఇహెచ్‌వీ పవర్ ట్రాన్స్ ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ పనులకు భూమి పూజ, స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ సీఆర్జీవో కోర్ ప్రాసెసింగ్ సెంటర్,సర్జ్ అరెస్టర్ యూనిట్లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనతి కాలంలోనే తెలంగాణ తయారీ రంగంలో దేశానికి దిక్సూచిగా మారింది. 2024-25లో ఇండస్ట్రియల్ అవుట్ పుట్ రూ.2.77 లక్షల కోట్లు. ఇందులో 48శాతం వాటా తయారీ రంగానిదే. 9 నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన మార్చండైజ్ ఎక్స్ పోర్ట్స్ రాష్ట్రం నుంచి జరిగాయని చెప్పారు.. జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం. ఇది జాతీయ సగటుకంటే ఎక్కువని ఆయన వివరించారు.

2040 నాటికి దేశీయ విద్యుత్ డిమాండ్ రెట్టింపు అవుతుందని ఆర్థికసర్వే(2024-25)లెక్క తేల్చింది. ఈ డిమాండ్‌ను అందిపుచ్చుకొని రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణను రెన్యువబుల్స్ ఇంజిన్ ఆఫ్ ఇండియాగామార్చాలనే సంకల్పంతో క్లీన్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ను >>2




శుక్రవారం సచివాలయంలో నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి ఉత్తమ్

# ఎస్ఎల్‌బిసి పనుల పునరుద్ధరణకు చర్యలు

## ఎన్‌జిఆర్ఐ ఆధ్వర్యంలో ఎలక్ట్రో మేగ్నటిక్ సర్వే

### సింగూర్ డ్యాం భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్,ఆగస్టు 8,ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ పనుల పునరుద్ధరణకు ప్రణాళికా బద్దంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయన వెల్లడించారు శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో నీటిపారుదల రాష్ట్ర సలహాదారుడు ఆదిత్యాదాస్ నాథ్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇఎన్‌సిలు అంజద్ హుస్సేన్, రమేష్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, సి.ఇ అజయ్ కుమార్‌లతో అనేక అంశాలను మంత్రి సమీక్షించారు. ఉత్తమ్ మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి పను >>2



# భర్తల పేరుతో చెట్లకు రాఖీలు

## గోండు మహిళల వింత ఆచారం

**చింద్వారా(ఎంపి), ఆగస్టు 8:** రక్షా బంధన్ అంటే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా రాఖీలు కట్టి ఒకరినొకరు తమ అప్యాయతలను తెలుపుకునే రోజుగా భావిస్తారు. అయితే మధ్యప్రదేశ్‌లోని కొన్ని గ్రామాల్లో మహిళలు నేటికీకూడా తమ సోదరుడిని తమ రక్షకుడిగా భావించరు. అందుకే వారు వారి సోదరులకు రాఖీలు కట్టరు. ఈగిరిజనతెగ మహిళలు తమ >>2

# కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిటిషన్ కొట్టివేత

## రమేష్ పదవీకాలం ముగియడంతో జోక్యం చేసుకోలేమన్న సుప్రీం ధర్మాసనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి పదిహేనేళ్లుగా కొనసాగుతున్న పౌరసత్వ వివాదానికి సుప్రీంకోర్టు శుక్రవారం ముగింపు పలికింది. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రమేశ్ పోటీ చేసిన ఎన్నికల పదవీకాలంఇప్పటికే ముగిసిపోయినందున, ఆ విషయాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈపిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టుతీర్పులో జోక్యంచేసుకోవడానికి నిరాకరిం >>2

# అమెరికాకు భారత్ షాక్

## పి8ఐ విమానాల కొనుగోలు నిలిపివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** భారత్, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించడంతో దానికి ప్రతిగా భారత్ తీవ్రమైన నిర్ణయం తీసుకుంది. అమెరికాకు చెందిన విమాన తయారీ దిగ్గజం బోయింగ్‌తో దాదాపు తుది దశలో ఉన్న 3.6 బిలియన్ డాలర్ల సుమారు రూ. 30,000 కోట్లు కీలక రక్షణ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాల్లో ఇది ఒక పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.

భారత నౌకాదళం కోసం ఆరు అధునాతన పీ8ఐ పొసైడాన్ విమానాలను బోయింగ్ నుంచి కొనుగోలు చేసేందుకు ఈ ఒప్పందం కుదిరింది. సముద్రంపై సుదూర నిఘా, జలాంతర్గాములను గుర్తించి ధ్వంసం చేయగల సామర్థ్యం ఈ విమానాల ప్రత్యేకత. వాస్తవానికి 2014లో ఈ ఒప్పందం విలువ 2.42 బిలియన్ డాలర్లుగా ఉండేది. కానీ ద్రవ్యోల్బణం, సరఫరా గొలుసులో అంతరాయాలు, తాజాగా విడిభాగాలపై అమెరికా విధించిన 25 శాతం సుంకాల కారణంగా దీని ధర 3.6 బిలియన్ డాలర్లకు పెరిగిపోయింది. ప్రాజెక్టు వ్యయం దాదాపు 50 శాతం పెరగడంతో భారత్ ఈ కొనుగోలుపై పునరాలోచనలో పడింది. రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేస్తుండటం, తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి పరోక్షంగా ఆజ్యం పోస్తోందని ఆరోపిస్తూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై భారీ టారిఫ్‌లను విధించింది.

ఈ టారిఫ్‌ల కారణంగానే పి8ఐ విమానాల ధర విపరీతంగా పెరిగిపోయింది. పెరిగిన ఖర్చుతో పాటు, అమెరికా వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న భారత రక్షణమంత్రిత్వశాఖ ఈ ఒప్పందాన్ని ప్రస్తుతానికి నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం బోయింగ్ సంస్థకు భారీ నష్టాన్ని కలిగించనుంది. భారత్‌లో బోయింగ్ సంస్థకు సుమారు 5000 మంది ఉద్యోగులు ఉండటంతో పాటు, ఏటా 1.7బిలియన్ డాలర్లమేర భారత ఆర్థికవ్యవస్థకు తోడ్పాటు >>2



# 'సురక్షితం'లో ఇండియా.. 67

## దేశంలో టాప్ మంగళూరు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** నంబియో సేఫ్టీ ఇండెక్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సురక్షిత నగరాలు, దేశాలు2025 జాబితాను విడుదల చేసింది. అందులో భారత్‌లోని 10 నగరాలు కూడా ఉన్నాయి. భారతదేశానికి చెందిన సురక్షిత నగరాల్లో కర్ణాటకలోని మంగళూరు తొలి స్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీ అట్టడుగున ఉంది. గుజరాత్‌లోని వడోదర, అహ్మదాబాద్, సూరత్ నగరాలకు కూడా టాప్ 10 ఈ జాబితాలో స్థానం దక్కింది. కానీ హైదరాబాద్ నగరానికి టాప్10 >>2



# ముంచేస్తున్న వాన

## తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షపాతం

### ఆసిఫాబాద్‌లో పిడుగుపాటుకు 7 ఆవులు మృతి

### ఎత్తిపోతల పథకం దిమ్మెలు నేలమట్టం

### ఎస్సారెస్పీ కాలువపై కుంగిన బ్రిడ్జి

### మరో 4 రోజులు అధిక వర్షపాతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నాలుగు రోజులు భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. హైదరాబాద్ మహానగరం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం తెలిక పాటి నుంచి మోస్తరు వానలు పడ్డాయి. నల్గొండ, యాదాద్రి, నాగర్ కర్నూలు, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు జోరు వానలు కురిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కుండపోత వాన కురవగా, ములుగు జిల్లాలో ఓ వంతెన కుప్పకూలింది. సూర్యాపేటలో పంట పొలాల్లో నీరు నిల్వగా, కుమురం భీం ఆసిఫాబాద్‌లో పిడుగుపాటుకు 7 ఆవులు మృతి చెందాయి. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని ఆగమాగం చేసింది. వరంగల్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. హనుమకొండ, వరంగల్, కాజీపేటల్లో ఉరుములు మెరుపులతో >>2


శుక్రవారం సితామర్హిలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న బీహార్ సిఎం నితీష్ కుమార్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో
# వినూత్న కార్యక్రమాలు
## రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగాజరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటిశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహాజ్యోతి, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరా క్యాంటీన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. మహిళల రక్షణ, విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేదిలేదనిఅన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.


శుక్రవారం బెంగళూరులో జరిగిన 'ఓట్ అధికార్ ర్యాలీ'లో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఖర్గే, సిఎం సిద్ధరామయ్య, డికె తదితరులు

## రాఖీ పండుగ శుభాకాంక్షలు
### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 8,ప్రభాతవార్త:** పవిత్ర రాఖీ పండుగ సందర్భంగా ప్రజలందరికీ టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ అన్నచెల్లెళ్ల బంధానికి ప్రతీక. రాఖీ పండుగ అనేది ప్రేమ, స్నేహం, రక్షణ విలువలను గుర్తు చేసే పర్వదినం అని అన్నారు. ఈ రాఖీ పండుగ ప్రతి ఇంట్లో ఆనందాన్ని, సంతోషాన్ని నింపాలి అని టిపిసిసి చీఫ్‌కోరారు.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని, అందరికీ సమాన అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు.

## 'సురక్షితం'లో ఇండియా..67

>> జాబితాలో చోటు దక్కకపోవడం గమనార్హం. ఇక ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన దేశాల జాబితాలో భారత్ 67వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్స్ లో భారత్ 55.8 స్కోర్‌ను సాధించింది. దేశంలో టాప్10నగరాలు వరుసగా మంగళూరు టాప్‌వన్ ప్రపంచ స్థాయిలో 49 ర్యాంక్ వచ్చింది. వడోదర రెండో ర్యాంకులోను, అహ్మదాబాద్, సూరత్, జైపూర్, నవీముంబయి, తిరువనంతపురం, చెన్నై, పూణె, చండీ గఢ్‌నగరాలు వరుసగా పదిర్యాంకులు సాధించుకున్నాయి. అయితే ఈజాబితాలో హైదరాబాద్ నగరా నికి స్థానం లేకపోవడాన్నిచూస్తే మనభాగ్యనగరం సురక్షితనగరం కాదన్నట్లుగా సంకేతాలు పంపిస్తోంది.

## అమెరికాకు భారత్ షాక్

>> అందిస్తోంది. మరోవైపు, హిందూ మహాసముద్రంలో చైనా కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ విమానాల అవసరం భారత నౌకాదళానికి ఎంతో ఉంది. ఇప్పటికే భారత్ వద్ద 12 పీ8ఐ విమానాలు ఉన్నాయి. వాటికి అదనంగా మరో ఆరింటిని సమకూర్చుకోవాలని భావించినా, తాజా పరిణామాలతో దేశీయంగా డీఆర్‌డీఓ, హెచ్‌ఏఎల్ వంటి సంస్థల ద్వారా ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ ఒప్పందం రద్దు కానప్పటికీ, టారిఫ్ వివాదం పరిష్కారమయ్యే వరకు నిరవధికంగా నిలిచిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

**విమానాల కొనుగోలు డీల్ నిలిపివేత అవాస్తవం: రక్షణ శాఖ**

అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా ఆదేశంనుంచి ఆయుధాలు, విమానాలకొనుగోళ్ల ప్రణాళికను భారత్ తాత్కాలికంగా నిలిపివేసిందంటూ వచ్చిన వార్తలపై రక్షణశాఖ స్పందించింది. ఈ అంశంపై అంతర్జాతీయ వార్తాసంస్థ ప్రచురించిన కథనం తప్పని కొట్టిపారేసింది. ఆదేశంనుంచి ఆయుధాలు, యుద్ధ విమానాలుకొనుగోళ్లకు నిలిపివేయాలని భారత్ నిర్ణయించినట్లు ఆ సంస్థ వెలువరించిన వివరాలు పూర్తిగా అవాస్తవమని వెల్లడించింది. ఆయుధాల కొనుగోళ్లకు సంబంధించి త్వరలో అమెరికా వెళ్లేందుకు సిద్ధమైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా పర్యటనను రద్దుచేసుకున్నట్లు తెలిపింది. అయితే అలాంటిదేమీ లేదంటూ తాజాగా రక్షణ శాఖ క్లారిటీ ఇచ్చింది.

## పిటిషన్ కొట్టివేత

>> చింది. ఆది శ్రీనివాస్ తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, రమేశ్ దేశాన్ని మోసం చేసినట్లు హైకోర్టు గుర్తించినప్పటికీ ఆయన ఇప్పటికీ పింఛనుతో సహా ఇతర శాసనసభ ప్రయోజనాలను పొందుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, సుప్రీంకోర్టు ఈ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరసత్వం కలిగి ఉండి, ఆ విషయాన్ని దాచిపెట్టి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ ఆది శ్రీనివాస్ 2019లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం మంత్రిత్వశాఖ, నిబంధనలు పాటించలేదన్న కారణంతో 2019 నవంబరులో రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ రమేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2024 నవంబర్ 6న కీలక తీర్పు వెలువరించింది.

# ఇసికి రాహుల్ 5 ప్రశ్నలు

సంఘాన్ని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రధానంగా ఐదు విధాలుగా అక్రమాలు జరిగాయని తాము లేవనెత్తిన ప్రశ్నలకు ఇసి సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్‌చేసారు.

1. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచిపెడుతున్నారు?
2. సిసి ఫుటేజిని ఎందుకు ఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు?
3. నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు?
4. విపక్షాలను ఇసి ఎందుకు భయపెడుతోంది?
5. బిజెపి ఏజెంట్‌గా ఇసి మారిపోయిందా? అని ప్రశ్నలు సంధించారు.

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేసారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ప్రజలకు ఉన్న ఓటుహక్కుపై ఇసి దాడిచేస్తోందని మండిపడ్డారు. ఇది కేవలం తన గొంతుక కాదని, యావత్ హిందుస్థాన్ గొంతుక అని స్పష్టం చేశారు. ఎన్నికల మోసం ఫిర్యాదుపై తన నుంచి ఇసి అఫిడవిట్ కోరిందని, కానీ తాను ఇప్పటికే లోక్‌సభలో రాజ్యాంగంపై ప్రమాణం చేశానని రాహుల్ గుర్తుచేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రం 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అని, ఇసి అధికారులు దానిపైనే దాడి చేస్తున్నారని విమర్శించారు. మీరు పేదలపై దాడి చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఎన్నికల్లో మోసం చేసి సులభంగా తప్పించుకోవచ్చని అనుకుంటే పొరపాటని, సమయం పట్టినా మిమ్మల్ని ఒక్కొక్కరిగా పట్టుకుంటామని రాహుల్ వార్నింగ్ ఇచ్చారు. బెంగళూరు సెంట్రల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఒక్క మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌పై మాత్రమే తాము దృష్టి సారించామని, అక్కడ బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసానికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రతి ఆరుగురిలో ఒక ఓటును తారుమారు చేశారని రాహుల్‌గాంధీ చెప్పారు. ఈ మోసం ఐదు ప్రధాన పద్ధతుల్లో జరిగిందని ఆరోపించారు.

## ఆరోపణలు రుజువు చేయకుంటే క్షమాపణ చెప్పాల్సిందే: సవాల్ విసిరిన ఇసి

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఓటర్ల జాబితా అక్రమాల ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. రాహుల్ విశ్లేషణను అర్థం పర్థం లేనిదిగా అభివర్ణించిన ఇసి, ఆయన తన ఆరోపణలకు కట్టుబడి ఉంటే ప్రమాణ పూర్వకంగా ఫిర్యాదు చేయాలని, లేనిపక్షంలో దేశానికి క్షమాపణ చెప్పాలని శుక్రవారం సవాల్ విసిరింది. గురువారం సాయంత్రం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ గాంధీ, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కర్ణాటకలోని ఓ అసెంబ్లీ సెగ్మెంట్‌లో భారీగా ఓట్ల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. తమ సర్వేలో ఒకే ఓటరుపేరు పలుమార్లు నమోదు కావడం, ఇతర రాష్ట్రాల ఓటర్ల జాబితాలోనూ అదే వ్యక్తిపేరు ఉండటం, ఉనికిలోలేని చిరునామాలు, ఒకే ఇంటి నంబర్‌పై వందలాది ఓట్లు, ఫొటోలు సరిగా లేని గుర్తింపు కార్డులు, కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారం6 దుర్వినియోగం వంటి అనేక అవకతవకలను గుర్తించినట్లు ఆయన వివరించారు. అంతేకాకుండా, అధికార బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను రూపొందించిందని, డిజిటల్‌ఓటర్ల జాబితాను తమకు ఇవ్వడానికి నిరాకరించిందని రాహుల్ ఆరోపించారు. ఈ ఆరోపణలను ఇసి తీవ్రంగా ఖండించింది. "రాహుల్ గాంధీ తన విశ్లేషణను, ఈసీపై చేసిన ఆరోపణలను నిజమని నమ్మితే, ప్రమాణ పత్రంపై సంతకం చేయడానికి ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. ఒకవేళ ఆయన సంతకం చేయకపోతే, ఆయన తన విశ్లేషణను నమ్మడం లేదని స్పష్టమవుతుంది. ఆ పక్షంలో ఆయన దేశానికి క్షమాపణ చెప్పాలి. ఆయన ముందు ఈ రెండే మార్గాలున్నాయి" అని ఇసి వర్గాలు స్పష్టం చేశాయి. ఈ వ్యవహారంపై బీజేపీ కూడా స్పందించింది. రాహుల్ గాంధీ తన ఆరోపణలకు సంబంధించిన అనర్హుల జాబితాను ఎందుకు సమర్పించడం లేదని బీజేపీ మీడియా సెల్ చీఫ్ అమిత్‌మాలవీయ ప్రశ్నించారు. ఆయన ఆధారాలు సమర్పించడంలో విఫలమైతే, ఇదంతా కేవలం రాజకీయ నాటకమని స్పష్టమవుతుంది. ప్రజల మనసుల్లో సందేహాలు రేకెత్తించి, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే రాజ్యాంగబద్ధ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడానికే ఆయన ప్రయత్నిస్తున్నారని మాలవీయ విమర్శించారు.

# తయారీలో దిక్సూచి

>> తీసుకొచ్చాం. ఇప్పటికే క్లీన్ ఎనర్జీలో రూ.29వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామన్నారు. 2030 నాటికి న్యూ రెన్యువబుల్ కెపాసిటీని 20వేల మెగా వాట్లకు పెంచేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామనిచెప్పారు. బ్యాటరీలు, పవర్ కాంపోనెంట్స్, స్మార్ట్ గ్రిడ్స్ తదితర రంగాల్లో తోషిబాలాంటి దిగ్గజ సంస్థలను తెలంగాణకు ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా గ్రీన్ ఎనర్జీ ఎక్విప్ మెంట్ జోన్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. స్మార్ట్ ఎనర్జీ సొల్యూషన్స్ కోసం తోషిబా తెలంగాణ ఆర్ అండ్ డీ హబ్‌కు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. క్లీన్ టెక్, సెమీ కండక్టర్స్, రోబోటిక్స్, అడ్వాన్స్ మాన్యుఫాక్చరింగ్‌లో పెట్టుబడులకు తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.కొత్త పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొచ్చి మన యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే అంతర్జాతీయ, జాతీయ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు.కొందరు కావాలని పని గట్టుకొని వాటిని ఉత్తుత్తి ఎంవోయూలు అంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విమర్శలకు మేం కాదు, తోషిబా కంపెనీనే మీకు ధీటైన సమాధానం ఇస్తుందన్నారు.ఈ ఏప్రిల్‌లో జపాన్ పర్యటనలో రూ.562 కోట్ల పెట్టుబడులకు సంబంధించి తోషిబాకంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకుందన్నారు. బుల్లెట్ ట్రైన్ స్పీడ్‌తో ఈరోజు రూ.177కోట్లతో ఏర్పాటు చేయబోయే ఇహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ పనులకు భూమి పూజ నిర్వహించుకున్నామన్నారు.

## భారత్‌కు రండి

>> యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలను ప్రధాని మోడీకి ఈ సందర్భంగా పుతిన్ వివరించారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఈ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పుతిన్‌కు ప్రధాని మోడీ సూచించారు. అలాగే ఈ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ట్రంప్ పాలనపగ్గాలు చేపట్టిన ప్పటినుంచి భారత్‌పై నిప్పులు చెరుగుతూనే ఉన్నారు. పాక్‌పై యుద్ధాన్ని తానే నివారించానని 30 సార్లు చెప్పినా భారత్ సమర్థించకపోవడం, ట్రంప్‌నకు నోబెల్ శాంతిపురస్కారం ఇవ్వాలన్న ప్రతిపాదనలు ఎండార్స్ చేయకపోవడం వంటి వాటితోపాటు రష్యా ముడి చమురు కొనుగోళ్లవల్లనే ఉక్రెయిన్ యుద్ధానికి పరోక్షంగా సాయం చేస్తున్నదంటూ ట్రంప్ అనుచిత వ్యాఖ్యలుచేస్తున్న సంగతితెలిసిందే. ఈక్రమంలోనే ఇక భారత్‌తో వాణిజ్య చర్చలుండవని కూడా ట్రంప్ స్పష్టంచేసారు. ఈతరుణంలో ప్రధాని మోడీ పుతిన్‌కు ఫోన్‌చేసి భారత్‌పర్యటనకు రావాలని ఆహ్వానించడం సంచలన అంశంగా మారింది.

## మీరు చైనా రండి

>> షాంఘై సహకారసంస్థ (ఎస్సీవో) సదస్సుకు రావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రధాని నరేంద్రమోడీకి ఆహ్వానం పలికారు. 2020లో గల్వాన్‌లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణలు తర్వాతప్రధానిమోడీ ఇపుడు తొలిసారిగా చైనాలో పర్యటిస్తున్నారు. ఈనెల 31, సెప్టెంబరు ఒకటితేదీల్లో తియాంజిన్‌లో ఎస్సీఓ సదస్సు జరగనున్నదని ఆ సదస్సుకు రావాలని చైనా విదేశాంగప్రతినిధి గువోజియాకున్ బీజింగ్‌లో ధృవీకరించారు. గల్వాన్ సంఘర్షణల తర్వాత ఇరుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం దెబ్బతిన్న సంగతి తెలిసిందే. సుమారు నాలుగేళ్లపాటు సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వాస్తవాధీనరేఖ వెంబడిగస్తీ పరంగా కూడా ఇరుదేశాలుమధ్య ఒక అంగీకారం కుదరడంతోప్రతిష్టంభన వీడింది. ఈక్రమంలోనే 2019 తర్వాత మోడీ తొలిసారి చైనా పర్యటనకు వెళుతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. విదేశాంగ మంత్రి జైశంకర్, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్; జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవ్ ఇటీవలేచైనాలోపర్యటించారు. ఉగ్రవాదంపై ద్వంద్వవైఖరి వీడాలని, లష్కరే తోయిబా, జైషేమహ్మద్ వంటిసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్‌దోవల్ ఎస్సీఓ భద్రతా సలహాదారుల సమావేశంలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

9-08-2025, శనివారం (రక్షాబంధన్)
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
○ పౌర్ణమి మ.1.21
శ్రవణ మ.2.20
వర్జ్యం : సా.6.15-7.49
దు.తె.5.51-7.30
శుభసమయం:ఉ.7.45-8.25, సా.6.30-7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** జీవితభాగస్వామితో విభేదాలు రాకుండా సామరస్యంగా ఉండేటట్లు మెలగడం చెప్పదగిన సూచన.

**వృషభం:** కొత్త పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. పాతబాకీలు వసూలవుతాయి.

**మిథునం:** వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** వివాదాలకు దూరంగా ఉండండి. మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** ఆర్థికపరమైన లావాదేవీలలో మధ్యవర్తి వ్యవహారాలు లాభించవు.

**కన్య :** సన్నిహితులకు మీవంతు సహాయాన్ని అందిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

**తుల :** దూరప్రాంతాలనుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థికప్రగతిని సాధిస్తారు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. వస్తు లాభం పొందుతారు.

**ధనుస్సు:** భూములు, ఇళ్లకు సంబంధించిన అగ్రిమెంట్లు చేసు కుంటారు, సోదరులనుండి శుభవార్తలు.

**మకరం:** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**కుంభం:** బాధ్యతలు సమర్థవంతంగా నెరవేర్చి పలువురి ప్రశంసలు పొందుతారు.

**మీనం :** ఆస్తి వివాదాలు తీరి లాభం పొందుతారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అనుమతి లేకుండా నో షూటింగ్స్
## ఫిల్మ్ ఛాంబర్ సంచలన నిర్ణయం

**హైదరాబాద్, అగస్టు 8, ప్రభాతవార్త :** తెలుగు చలన చిత్ర పరిశ్రమకు చెందిన ఉద్యోగులు, కార్మికులు వేతనాల పెంపు తదితర డిమాండ్లను పరిష్కరించాలని ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చేపట్టిన షూటింగ్‌ల బంద్ కొనసాగుతోంది. ఈ సమ్మె ఒక కొలిక్కి వచ్చేటట్లు కనిపించకపోగా, రానురాను ఇది మరింత బిగుసుకుంటోంది. కార్మికుల సమ్మె కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు, ఇతర రాష్ట్రాల్లో సైతం సినిమా షూటింగ్స్, ఇతర లఘు, వెబ్ సిరీస్‌లు నిలిచిపోయాయి. ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమ్మెపై నిర్మాతలు, యూనియన్లు, కలిసి ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపాయి. అయినా ఫలితం లేకపోవడంతో ఈ క్రమంలో తాజాగా 24 క్రాఫ్ట్ యూనియన్ నేతలు బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో మరోసారి నేడు చర్చల జరిగినా సమ్మె ఒక కొలిక్కి రాలేదు. దీంతో ఈ చర్చల అనంతరం ఫిల్మ్ ఛాంబర్ సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్ ఛాంబర్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా సినిమా షూటింగ్‌లను చేయవద్దని ఆదేశించింది. అవుట్ డోర్ యూనిట్లు, స్టూడియోలలో షూటింగ్‌లకు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నట్లు చాంబర్ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ హెచ్చరించారు.

# ముంచేస్తున్న వాన

>> కూడిన వాన కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ద్విచక్ర వాహనదారులు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని నర్సంపేట, పాకాలలోనూ భారీ వాన పడింది. మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు, కురవి మండలాల్లో భారీ వర్షం కురవగా గంగారం, కొత్తగూడ, గూడూరు, కేసముద్రం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 4 రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు వాన ఉపశమనం కలిగించింది. ములుగు జిల్లాలోని మల్లంపల్లి సమీపంలోని 163వ జాతీయ రహదారిపై ఎస్సారెస్పీ కెనాల్‌పై ఉన్న పురాతన వంతెన కుంగింది. వాహనాలు వెళుతున్న క్రమంలో వంతెన క్రమక్రమంగా తెగుతున్నట్లు గమనించిన అధికారులు, గురువారం రాత్రి నుంచి వాహనాలు వెళ్లడానికి అనుమతిని నిరాకరించారు. వంతెన ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నేతాజీ రోడ్, సిగ్నల్ గడ్డ, ఏరియా వెంకటరమణ థియేటర్ ఏరియాలో భారీగా వర్షం కురవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం నమోదైంది. విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడిగూడెం, మోతే, చిలుకూరు, మునగాల, కోదాడ, అనంతగిరి మండలాల్లో పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని లక్ష్మీపూర్ అటవీ ప్రాంతంలోకి మేతకు వెళ్లిన 7 ఆవులపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి.తమకు జీవనాధారమైన ఆవులను కోల్పోయమంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో అత్యధికంగా 14.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడ్డగూడూరులో 12.1 సెంటీమీటర్లు, వలిగొండలో 10.4 సెంటీమీటర్లు, నల్గొండలోని శాలిగౌరారంలో 13.6 సెంటీమీటర్లు, జనగామ జిల్లా దేవరుప్పులలో 10.2 వర్షపాతం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గం, పెంట్లవెల్లి మండల పరిధిలోని మెరుపులు ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. పిడుగుపాటుకు ఎంగంపల్లి తండా గ్రామ సమీపంలో కృష్ణానది తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం పైపులైన్ దిమ్మెలు నేలమట్టం అయ్యాయి. ఈ మినీ ఎత్తిపోతల పథకాన్ని 1994లో నిర్మించారు. దీని ద్వారా ఎంగంపల్లి తండా మల్లేశ్వరం మంచాలకట్ట కొన్ని గ్రామాలకు దాదాపుగా 650 ఎకరాలకు సాగునీరు సరఫరా జరిగేది. ఎత్తిపోతల పథకం నిర్మించిన మొదలు కొన్నేళ్లపాటు ఉపయోగంలో ఉన్నా చాలాకాలం నుంచి మోటార్లు రిపేరు అయ్యాయనే నెపంతో నిరుపయోగంగా మారి శిథిలావ్యవస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేపట్టి, మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు ఎంతో కాలం నుంచి కోరుతున్నారు. కృష్ణానది చెంతన ఉన్న సాగుకు నీరు అందక రైతులు మాజీ ఎంఎల్‌లకు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావుకి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతలపై రైతన్నలు ఆశలు వదులుకున్నారు.

# పునరుద్ధరణకు చర్యలు

>> లను పునఃప్రారంభించేందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడంతో పాటు పాలనా పరమైన అనుమతులు పొందేందుకు త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతో సమావేశం కానున్నట్లు ఆయన తెలిపారు.శ్రీశైలం దిగువ నుంచి వచ్చే వరద కాలువ మిగిలిన 9 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకానికి ఆటంకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఫలితంగా ప్రతి సంవత్సరం ఆ నీటిని ఎత్తిపోసేందుకే 750 కోట్లు కేవలము విద్యుత్ చార్జీలను చెల్లించాల్సి వస్తుందన్నారు.అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు సాగు నీరు,ఫ్లోరోసిస్ రహిత సాగు నీటిని అందించేందుకుద్దేశించబడిన ఈ ప్రాజెక్ట్ మరో తొమ్మిది కిలోమీటర్లు సొరంగ మార్గం పూర్తి అయ్యే సమయంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమన్నారు.

**- సింగూర్ డ్యామ్‌కు కట్టుదిట్టమైన చర్యలు**

సింగూర్ డ్యామ్ ను పరిశీలించి అత్యవసర భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో ఉపేక్షిస్తే సహించేది లేదన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్యామ్ లు,రిజర్వాయర్ లతో పాటు ఇతర జలాశయాలను నిత్యం పర్యవేక్షి ంచాలని ఆయన సూచించారు. ప్రమాదం అని భావించి ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**సమ్మక్క సారక్క బ్యారేజ్ పై ఐఐటి ఖరగ్‌పూర్ నివేదిక**

తెలంగాణ రాష్ట్రంలో నిర్మిస్తున్న సమ్మక్క బ్యారేజ్ తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుల బ్యాక్ వాటర్‌తో ఛత్తీస్‌ఘడ్ పై చూపే ప్రభావాల పై ఐఐటి ఖరగ్ పూర్ జరిపిన అధ్యయనం నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది.ములుగు జిల్లా ఏటూరునాగరం మండలంలోని తుపాకులగూడెం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సమ్మక్క బ్యారేజ్ నిర్మాణం తెలంగాణా ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అటువంటి బ్యారేజ్ నిర్మాణంతో ఛత్తీస్ ఘడ్‌లో సుమారు 40 హెక్టార్లు ముంపు కు గురవుతుందని ఐ ఐ టి ఖరగ్ పూర్ ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. దీని ప్రభావం ఛత్తీస్ ఘడ్ లోని కోటూర్,తార్లగూడ,గంగారాం,కంబల్పేటలతో 10.9 చ.కి.మీ భూభాగం ముంపుకు గురౌతుందని అధ్యయనంలో తేలిందన్నారు. అయితే అదే సమయంలో ఈ బ్యారేజ్‌ని పూర్తి చేసేందుకు గాను ఛత్తీస్‌ఘడ్‌తో సంప్రదించి అవసరమైన అనుమతులు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6.94 టి.యం.సిల నీటితో 16.40 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు.

**మూడు దశాబ్దాల తరువాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు**

మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం అనంతరం నీటిపారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేశామన్నారు.అదీ కుడా పారదర్శకంగా నిర్వహించామని ఎఇఇ ల నుండి సిఇ ల వరకు 47 మంది అసిస్టెంట్ ఇంజినీర్ల నుండి డిప్యూటీ ఇంజినీర్ల వరకు 127 మంది,ఎస్.ఇ ల నుండి సి.ఇ ల వరకు 13 మంది ఉన్నారన్నారు.

# భర్తల పేరుతో చెట్లకు రాఖీలు

>> సోదరులను కాకుండా తమ భర్తలను రక్షకులుగా భావిస్తారు. మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలోని గ్రామాల్లో గోండ్ తెగకు చెందిన మహిళలు ఇప్పటికీ తమ సోదరులకు కాకుండా తమ భర్తలను మాత్రమే తమ సంరక్షకులుగా భావించి పొలాలను పూజించి చెట్లకు, ఇతరత్రా తమ భర్తలు సంరక్షించేవాటికి రాఖీలు కడతారు. ఎందుకంటే తమ భర్తలే తమ సంరక్షకులుగా భావిస్తారు. తమను రక్షించే వ్యక్తికే రాఖీ కట్టాలని వారు విశ్వసిస్తారు. ఈ గోండు మహిళలు తమ భర్తలే తమకు జీవితాంతం తోడుగా ఉంటారని అందుకే సోదరులకు బదులు వారు పొలాలకువెళ్లి వాటిని పూజించిన తర్వాత పంటలకు రాఖీలు కడతారు. మహిళలు తమ జీవనోపాధికి మార్గంగా ఉన్న చెట్లు మొక్కలకు కూడా రాఖీలు కడతారు. గిరిజనుల్లోని గోండు తెగ సాధారణంగా అడవులపైనే ఆధారపడి ఉంటారు. రక్షాబంధన్ సందర్భంగా వారి పండగ మొత్తం పొలాల్లో పంటలు, అడవుల్లోని చెట్లతో జరుపుకుంటారు. ఇక్కడి మహిళలు పొలాలకువెళ్లి పూజలుచేసాక పంటలకు రాఖీలు కడతారు. వీరి రాఖీలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. మణికట్టుపై కట్టుకోడానికి అనేక రంగుల రాఖీలు వస్తాయి. మరోరాఖీని దేవ్‌రాఖీ అంటారు పసుపుదారంలో దూదిని ఉంచి రాఖీని తయారుచేస్తారు. ఈ రాఖీలను పూజించి వాటిని పొలాలు, పశువుల దొడ్లు, అడవుల్లో దేవుళ్లకు కడుతుంటారు. దేశంలోని అతిపెద్ద గిరిజన తెగల్లో గోండ్ తెగ ఒకటి. సుమారు 1.3 కోట్లు జనాభా ఉంది. భారత్‌లోని దక్కన్ ద్వీపకల్పంలో ఎక్కువ ఉంటారు.మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌ఘర్, ఒడిశా, జార్ఖండ్‌లలో వీరంతా విస్తరించారు.

# అంతా అప్రమత్తం?

>> తలెత్తుతున్నాయి. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. సాధారణంగా మూడు నాలుగు నెలల్లో కురిసే వర్షపాతం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో నగరం అతలాకుతలమవుతోందని సమావేశంలో చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునీకరించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు అయిదు సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదని, ఒక్కోసారి 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోందని అన్నారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీ మీటర్ల వర్షపాతం కురిసింది.జూన్ నుంచి ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణంతో పోలిస్తే 16శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది.అందుకే వాతావరణ మార్పులు, భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థవంతంగా అనుసరించాలని సిఎం ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంత వర్షం పడినా గ్రేటర్ హైదరాబాద్ సిటీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా,వరద నీటితో ముంపు గురవకుండా,లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా అత్యంత పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని,అందుకు వీలుగా రూపొందిస్తున్న మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో 55కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటంద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉండటంతో పాటు లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురవకుండా ఉంటాయన్నారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఔటర్‌రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నగరంలోని అన్ని వైపుల నుంచి వరద నీరు మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న హుస్సేన్ సాగర్, దుర్గం చెర్వు, మీర్ అలం చెర్వులతో పాటు ప్రతీచెరువు, కుంటలను నాలాలద్వారా మూసీకి అనుసంధానం చేయాలని సూచించారు.చెరువుల పునరుద్ధరణ,నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల)ద్వారా శుద్ధి చేసి మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.నగరంలో ఎక్కడ వర్షంపడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలన్నారు. మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో హైదరాబాద్‌లో నీటి కష్టాలు తీరుతాయని సిఎం అన్నారు. కలుషితమైన నీటితో మూసీ పరివాహక ప్రాంతంలో రైతులు పంటలు పండిస్తున్నారని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఇకపై ఈ పరిస్థితి తలెత్తకుండా మూసీలో నిరంతరం శుద్ధి చేసిన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలని సిఎం సూచించారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుందని అన్నారు.భవిష్యత్‌లో వందేళ్ల పాటు మహానగరంలో వరద నీటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనమే అవసరమని సిఎం అభిప్రాయపడ్డారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని, ఆదిశగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.వర్షాలు,వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రత మరింత పెరుగుతుండటంతో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాతనగరంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెడిస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సీఎం సూచించారు. చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.




# 30 యేళ్ల క్రితం అదృశ్యం..

## మంచులో మమ్మీగా లభ్యం!

**ముజఫరాబాద్(పాక్), ఆగస్టు 8:** 28 ఏళ్ల క్రితం కనిపించకుండా పోయిన ఓ వ్యక్తి మంచులో మమ్మీగా కనిపించాడు. చనిపోయి 28 ఏళ్లు అయినా మంచు కారణంగా ఆ శవం పాడవకుండా ఉంది. ఈ సంఘటన పాకిస్తాన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. 1997లో పాకిస్తాన్, ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌కు చెందిన నజీరుద్దీన్ కుటుంబం గొడవల కారణంగా ఊరు విడిచిపెట్టింది. కోహిస్తాన్ ప్రాంతంలోకి వచ్చేసింది. ఓ రోజు నజీరుద్దీన్ తన సోదరుడు కాతిరుద్దీన్‌తో కలిసి హిమనీనదం దగ్గర గుర్రంపై వెళుతూ ఉన్నాడు. ఈ నేపథ్యంలో ప్రమాదం జరిగింది. నజీరుద్దీన్ హిమనీనదంలో పడిపోయాడు. కాతిరుద్దీన్ అదృష్టం బాగుండి తప్పించుకున్నాడు. నజీరుద్దీన్ కోసం ఎంత వెతికినా శవం కూడా దొరకలేదు. చాలా సార్లు కుటుంబసభ్యులు అతడి శవం కోసం హిమనీనదం దగ్గర వెతికారు. కానీ, లాభం లేకపోయింది. అయితే, అనుకోని విధంగా 28 ఏళ్ల తర్వాత నజీరుద్దీన్ శవం దొరికింది. మంచులో కప్పబడి ఉన్న శవాన్ని గ్రామస్తులు గుర్తించారు. చనిపోయి 28 ఏళ్లు అవుతున్నా మంచు కారణంగా అతడి శవం పాడవలేదు. శవంతోపాటు దొరికిన ఐడెంటిటీ కార్డు ద్వారా అతడి అడ్రస్ గుర్తించారు. కుటుంబానికి సమాచారం ఇచ్చారు. నజీరుద్దీన్ చనిపోయాడన్న బాధ ఉన్నా, 28 ఏళ్ల తర్వాత అతడి శవం దొరికినందుకు కుటుంబసభ్యులు సంతోషించారు. అధికారులు శవాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. బుధవారం నజీరుద్దీన్ అంత్యక్రియలు జరిగాయి. ఇక, ఈ సంఘటనపై ప్రొఫెసర్ మహమ్మద్ బిలాల్ మాట్లాడుతూ హిమనీనదంలో అతడు పడగానే విపరీతమైన చలి బాడీని గడ్డకట్టేలా చేసింది. మంచు కారణంగా బాడీ పాడవ్వలేదు. ఆక్సిజన్, తేమ లేకపోవటంతో శవం మమ్మీలాగా తయారైంది. ఇన్ని రోజులు పాడవకుండా ఉందని అన్నారు

## మహిళలకు మంత్రి పొన్నం రక్షాబంధన్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** సోదరీ సోదరుల ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల మధ్య అపారమైన ప్రేమను సూచించే పండుగ రక్షాబంధన్.. రాఖీ పండుగ భారతీయ సస్కృతి సాంప్రదాయాల్లో అనాది నుంచి కొనసాగుతున్న గొప్ప ఆచార మన్నారు. సోదరుడిని మించిన ధైర్యం.. సోదరిని మించిన స్నేహితులు ఈ భూమి మీద ఎవరూ ఉండరు.. రాఖీ పండగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ ప్రతి మహిళా జీవితంలో ఆనందం, అదృష్టం నింపాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను.. రాఖీ పండుగ సోదర భావాన్ని పెంచుతుందని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

## ముగిసిన ఎడ్‌సెట్ వెబ్‌ఆప్షన్లు

### నేడు సీట్ల కేటాయింపు

### 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారంతో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి నేడు(శనివారం) సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎడ్ సెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను జులై 14న జారీ చేయగా.. జులై 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఎడ్‌సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి జులై 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జులై 23 నుంచి 26 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కి అర్హులైన వారి జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కౌన్సెలింగ్‌కు అర్హత సాధించిన వారు సోమ, మంగళవారాల్లో రెండు రోజులు వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి బుధవారం ఎడిట్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఎడ్ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు నేడు చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది.

## నకిలీ ఎసిబి అధికారులను నమ్మవద్దు

### ఎసిబి డిజి ట్వీట్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలుచోట్ల ఎసిబి అధికారుల పేరు చెబుతూ సర్కారు ఉద్యోగుల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్న నకిలీగాళ్ల విషయంలో అప్రమత్తంగా వుండాలని ఎసిబి డిజి విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్విట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎసిబి అధికారులు ఎప్పుడూ ఫోన్‌లు చేయరని, డబ్బులు డిమాండ్ చేయరని, ఇదే సమయంలో ప్రజలను కూడా ఇబ్బందులకు గురిచేయరని ఆయన తెలిపారు. ఇలాంటి ఫోన్ కాల్స్ చేసేవారు నకిలీ ఎసిబి అధికారులని ఆయన తెలిపారు. ఈ తరహా ఫోన్ కాల్స్‌కు స్పందించ కూడదని, అదేపనిగా ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106 లేదా ఫేస్ బుక్ తెలంగాణ ఎసిబికి వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

## వంశీరాం మన్‌హట్టన్‌లో ప్లాట్ కొని మోసపోవద్దు

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** వంశీరాం మన్‌హట్టన్‌లో ప్లాట్ ఎవరు కొనుగోలు చేసి మోసపోకండి, కోర్టు అది ప్రభుత్వభూమి కాదని తేల్చేవరకు వేచి ఉం దండని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి తెలిపారు. గాంధీ భవన్‌లో శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ వంశీరాం మన్‌హట్టన్ గురించి మేము నలుగురు ఎమ్మెల్యేలం కలిసి పిల్ వేశామని, ముమ్మాటికీ అది ప్రభుత్వభూమి అని థర్డ్ పార్టీకి నోటీసులు కూడా వెళ్లాయని ఆయన వివరించారు. జడ్జి మారడం వల్ల బెంచ్ మీదకు రాలేదని చెప్పారు. ఇంకా వచ్చేవారం బెంచ్‌పైకి వస్తుందని గత ప్రభుత్వం హయంలో రంగారెడ్డి కలెక్టర్ నిరభ్యంతర ధృవీకరణ పత్రం ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు.ఇది ప్రభుత్వ భూమి గతంలో ఎన్నడూ లేని విధంగా మా ప్రభుత్వ హయంలో ప్రజాప్రతినిధుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది .గాంధీ భవన్ లో పండుగ వాతావరణంలో నెలకొంది.

ప్రజలు నా దృష్టికి తీసుకుని వచ్చిన సమస్య లను అధికారుల దృష్టికి తీసుకొని పరిష్కరించే ప్రయత్నం చేశానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు రుణమాఫీ, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇవ్వడం జరుగు తుందని చెప్పారు. గత ప్రభుత్వ హయంలో పింక్ కండువా కప్పుకుంటే ఇల్లు ఇస్తామని ఇచ్చే వారు కాదని అన్నారు. మా ప్రభుత్వం హయంలో నియోజక వర్గానికి 3500 ఇల్లు మొదటి ధపాలో ఇవ్వడం జరిగిందని అన్నారు.

# ఢిల్లీ వెళ్లిన హరీశ్‌రావు.. బనకచర్లపై న్యాయనిపుణులతో సమావేశం

## కాళేశ్వరం కమిషన్ పూర్తి నివేదిక ఇవ్వండి.. సిఎస్‌ను కలిసిన హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 8:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు కోరారు. శుక్రవారం ఆయన సచివాలయానికి వెళ్లి సిఎస్ రామకృష్ణరావును కలిశారు. జస్టిస్ ఘోష్ ఇచ్చిన 665 పేజీల నివేదిక ప్రతులను ఇవ్వాలని కోరుతూ.. కెసిఆర్, హరీశ్‌రావు పేరుతో వేర్వేరు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం వినతిపత్రాలు ఇచ్చినట్లు రశీదులు తీసుకున్నారు. హరీశ్‌రావు విజ్ఞప్తిని పరిశీలించి చెబుతామని సిఎస్ చెప్పినట్లు సమాచారం. హరీశ్‌రావు వెంట బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రతులను అందజేయాలని సీఎస్‌ను హరీశ్‌రావు కోరారు. పూర్తిస్థాయి నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకుండా.. కేవలం 60 పేజీలతో కూడిన నివేదికను విడుదల చేసింది.

ఈ నివేదికపై పలు అనుమా నాలు ఉన్నాయని, ఇది ఘోష్ రిపోర్టా.. కాంగ్రెస్ రిపోర్టా..? అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్న సంగతి తెలిసిందే. 665 పేజీల నివేదికను విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ కీలక నేత, నీటి పారుదల శాఖ మాజీ మంత్రి హరీష్ రావు ఢిల్లీ వెళ్లారు.

ఢిల్లీలో న్యాయ నిపుణులను ఆయన కలవనున్నారు.బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో న్యాయ పరంగా ఎలా ముందుకు వెళ్లాలో చర్చించనున్నారు. హరీశ్‌రావు ఇప్పటికే పలుమార్లు కేసీఆర్‌తో ఈ విషయంపై చర్చలు జరిపారు. రెండు రోజుల క్రితం హరీశ్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి గుండెకాయ అని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ కుప్పకూలిం దంటూ కాంగ్రెస్ నేతలు బోగస్ మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆ ప్రాజెక్ట్ వల్ల పోయిన సారి లక్షల ఎకరాల్లో పంటలు పండాయని తెలిపారు. కాళేశ్వరం మూడు బ్యారేజీల్లో ఒక బ్యారేజీలో రెండు పిల్లర్లు మాత్రమే కుంగాయని, అలాంటప్పుడు కాళేశ్వరం మొత్తం కూలిందని ఎలా చెప్తారని ప్రశ్నించారు

# తెలంగాణకు 511 పిజి సీట్లు మంజూరు చేశాం

### కేంద్రమంత్రి అనుప్రియాపటేల్

### పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 8:** తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య విద్య, ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించాలంటూ పార్లమెంట్‌లో వరంగల్‌ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. ప్రధానంగా గ్రామీణ మెడికల్ కళాశాలల్లో డాక్టర్లు మరియు సిబ్బంది, అధ్యాపకుల నియామకాలు, ల్యాబ్స్, లైబ్రరీలు, హాస్టళ్లు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ టూల్స్ గ్రామీణ సేవలకు ప్రోత్సాహకాలు వంటి అంశాలపై వరంగల్ ఎంపీ వివరణ కోరారు. లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి అనుప్రియా పటేల్ సమాధానం ఇచ్చారు. కొత్త మెడికల్ కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు 2023 నిబంధనల ప్రకారం తప్పనిసరి చేస్తూ అధ్యాపకుల హాజరు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. 2024-25లో ఎన్‌హెచ్ ఎం కింద తెలంగాణకు రూ.67.16 కోట్లు, ప్రధాన్‌మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ మిషన్ కింద రూ.208.82 కోట్లు కేటా యించినట్లు తెలిపారు. దూర ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు ప్రత్యేక భత్యాలు, నిపుణులకు గౌరవ వేతనాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, కేంద్ర పథకం కింద తెలంగాణలోని 9 మెడికల్ కళాశాలలకు 511 పిజి సీట్లు మంజూర య్యాయని తెలిపారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్‌కు 92 సీట్లుకు మొదటి దశ 89 సీట్లకు రూ.7.47 కోట్లు విడుదల చేయగా, రెండో దశలో 3 సీట్లకు రూ.2.15 కోట్లు విడుదల చేసినట్లు తెలియజేశారు.

ఈ సందర్భంగా గ్రామీణ మెడికల్ కళాశాలల్లో సదుపాయాలను కల్పించడంతో పాటు సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఎంపీ కోరారు. మెడికల్ కళాశాలలకు మరిన్ని ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపి డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

## గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజుతో బిసి సంఘాల భేటీ

### ఒబిసిల డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని వినతి



గవర్నర్ అశోక్‌గజపతిరాజుతో సమావేశమైన జాజుల శ్రీనివాస్‌గౌడ్, కేసన శంకర్‌రావు, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రంగౌడ్, శ్యాంకురుమ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** జాతీయ స్థాయిలో ఓబీసీల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బిసి డిమాండ్ల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని గోవా గవర్నర్ పి.అశోక్ గజపతిరాజును బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గోవా రాజ్‌భవన్‌లో గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అంద జేశారు. అనంతరం బిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గవర్నర్‌కు ఇచ్చారు. 2026 సంవత్సరం నుండి దేశవ్యాప్తం గా చేపట్టబోయే జనగణనలో సమగ్ర కులగనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణహించిందని దీనిని దేశంలోని బీసీలంతా స్వాగతిస్తున్నారని తెలిపారు. ఇదే సందర్భంలో బిసిల కు చట్టసభలో జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ల కల్పన, మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 పరిమితిని ఎత్తివేసి బీసీలకు జనాభా దామా షా ప్రకారం విద్యాఉద్యోగ రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా బిసిల సమస్యల ను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తప్పకుండా తీసుకెళ్లి, బీసీ డిమాండ్ల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన బృందంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహ అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఏపీ ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, నేతలు నరేష్ ప్రజాపతి, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బాలగుండ్ల శ్రీనివాసరావు, పూర్ణ, కాశి, హనుమంతరావు, వేముల కృష్ణ, వెంకటరావు, సతీష్ పాల్గొన్నారు

## ఐఎఎస్ శివశంకర్‌ను ఆంధ్రాకు పంపాలి

### కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** తమ ఆదేశాలను అమలు చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)పై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు ఐఎఎస్ శివశంకర్‌ను 15 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు పంపాలని స్పష్టం చేసింది. లేనిపక్షంలో డీవోపీటీ కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశాలిస్తామని కేంద్రపరిపాలన ట్రిబ్యునల్ హెచ్చరించింది. శివశంకర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు పంపాలన్న ఆదేశాలను అమలు చేయక పోవడంపై డీవోపీటీ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కాగా ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికా రులు ఆ రాష్ట్రానికి వెళ్లిపోవాలనే డీవోపీటీ ఆదేశాల నేపథ్యంలో శివ శంకర్ తెలంగాణకు వచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ ఫిబ్రవరి 28న అనుమతించింది. ఆయనను తిరిగి ఏపీకే పంపాలని ఉత్తర్వు లిచ్చింది. ఈ ఉత్తర్వులు అమలు కాకపోవడంపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేశారు. మరోవైపు ఫిబ్రవరిలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్రం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయగా హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. ఇటీ వల ఇచ్చిన ఆదేశాల అమ లుకు 2 వారాల గడువిస్తున్నామని, శివ శంకర్‌ను ఆంధ్రాకు పంపకుంటే డీవోపీటీ సెక్రటరీ జీతం నిలుపుదలకు ఆదేశాలివ్వడంతోపాటు, కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## రెండు వేర్వేరు కేసుల్లో 2 కేజీల గంజాయి స్వాధీనం

### నలుగురిపై కేసు

### నమోదు.. ఒకరు అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త** రెండు వేరువేరు కేసుల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు 2 కేజీలను గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేశారు.కార్వాన్ రహీంపురా ప్రాంతంలో ఎస్‌టిఎఫ్‌సి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ధనరాజ్ సింగ్, ఆలియాస్ ధన్‌రాజ్ అనే వ్యక్తి గంజాయి అమ్మకాలు సాగిస్తుండగా పక్కా సమాచారం మేరకు ఆయన్ని అదుపుల్లోకి తీసుకున్నారు. నింధితుడది వద్ద నుంచి 1.904 కేజీల గంజాయితో పాటు అతని వద్ద నుంచి 1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో ధన్‌రాజ్‌ను అరెస్టు చేయగా గంజాయి అమ్మకాలతో సంబంధం ఉన్న బస్సీ కావల్ సింగ్, కొమల్, ఉత్తరేష్, అలపతి అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌టిఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

నిందితుల వద్ద నుంచి స్వాధీ నం చేసుకున్న గంజాయిని ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

అదే విధంగా సైఫాబాద్ బాలాజీనగర్ సమపంలో ఎస్‌టిఎఫ్ టీమ్ సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నింది తుడు షేక్ ఖాజాపాషా అరెస్టు చేసిన మరో నిందితుడు నజీమ్ రహమాన్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడితోపాటు గంజాయిని అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగిం చినట్లు తెలిపారు.

## తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టర్ సెకండరీ హెల్త్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టివివిపి)ని డైరెక్టర్ సెకండరీ హెల్త్‌గా త్వరలోనే అప్‌గ్రేడ్ చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో 1,690 డాక్టర్ పోస్టుల భర్తీకి సానుకూలంగా ఉన్నట్టు తనను కలిసిన ప్రభుత్వ వైద్యులకు మంత్రి తెలిపారు. వైద్యుల పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

వైద్యుల భర్తీలో వయోపరిమితి పెంపుపై నిబంధనలు రూపొందించటానికి కమిటీని నియమిస్తామని మంత్రి తెలిపారు. టివివిపిలో క్యాడర్ స్ట్రెంత్ పెంపుపై కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌తో మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం చర్చించారు. అసోసి యేట్ ప్రొఫెసర్స్ నుండి ప్రొఫెసర్స్‌గా పదోన్న తులు కల్పించినందుకు మంత్రి దామోదర్ రాజ నర్సింహకు తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల సంఘం ప్రతినిధులు, డాక్టర్ల సంఘం ప్రతినిధులతో సంగారెడ్డిలోని తన నివాసంలో మంత్రి దామోదర్ రాజ నర్సింహ సమావేశమయ్యారు. డాక్టర్ల సమస్యలపై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సాను కూలంగా స్పందించారు.

సమావేశంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ (టిజిజిడిఎ) అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రె టరీ జనరల్ డాక్టర్ లాలుప్రసాద్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాహుఫ్, ప్రతినిధులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ గోపాల్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామ్‌సింగ్ పాల్గొన్నారు.

## దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో కాలేజీల్లో చేరడానికి గడువు పొడిగింపు

### 12 వరకు అవకాశం.. 13 14 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఫేజ్‌లో వెబ్ ఆప్షన్లు ఇచ్చి సీటు పొందిన విద్యార్థులు కాలేజీల్లో చేరడానికి గడువును పొడిగించారు. ఈ నెల 12 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పించినట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు వివిధ సంఘాల విజ్ఞప్తి మేరకు కాలేజీల్లో చేరడానికి గడువును పొడిగించినట్టు తెలిపారు.

స్పెషల్ ఫేజ్ దరఖాస్తు గడువును జులై 25 నుంచి ఈ నెల 2 వరకు పొడిగించారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు రాని వారు.. కొత్తవారితోపాటు ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే కాలేజీల్లో చేరిన వారు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అనుమతించ లేదు. ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారికి ఈ నెల 6న సీట్ల కేటాయింపు చేశారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 8 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించగా.. దానిని కాస్త ఈ నెల 12 వరకు పొడిగించారు. అలాగే కాలేజీల్లో చేరడానికి సైతం ఈ నెల 12 వరకు అవకాశమిచ్చారు. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలతోపాటు ఎయిడెడ్ కాలేజీల్లో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 13, 14 తేదిల్లో స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించినట్టు ప్రకటనలో తెలిపారు.

## 10న బిజెపిలోకి బాలరాజు

### మాతో ఆరుగురు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు : రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** బిజెపి సిద్ధాంతం, లక్ష్యాలు నాకు నచ్చే ఆ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 10న నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షం లో కాషాయ కండువా కప్పుకోబోతున్నానని స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. అనంతరం బిజెపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాకు వ్యతిరేకంగా అచ్చంపేటలో ఎవరెన్ని సభలు, సమావేశాలు పెట్టుకున్నా నాకు అభ్యంతరం లేదన్నారు. నన్ను ఇక ఎవరూ ఏమీ చేయలేరు. నేను ఒక్కడినే బిజెపిలో చేరుతున్నానని, నాతో పాటు ఎవరూ చేరడం లేదని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. తనను చంపుతామన్న బెదిరింపులపై కెసిఆర్ దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని గువ్వల బాలరాజు ఆవేదన చెందారు. కాంగ్రెస్ నుంచి చేరిన రాజయ్య, కడియం శ్రీహరికి మంత్రి పదువులు ఇచ్చారని అన్నారు. బిఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు మాజీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నట్టు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు చెప్పారు. ఈ నెల 10న గువ్వల బాలరాజు బిజెపిలో చేరుతారని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేసుకునే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారు. రానున్న రోజుల్లో చాలా మార్పులు ఉంటాయని, చాలా మంది పార్టీలో చేరతారని అన్నారు. చాలా మంది నాయకులు బిజెపి వైపు చూస్తున్నారని చెప్పారు. అందరు నాయకులనూ కలుపుకొని ముందుకు వెళ్తామని చెప్పారు.

## 'అవినీతి' వర్సిటీకి ప్రొఫెసర్ 'కెసిఆర్'!

### కొత్త ప్రభాకర్‌రెడ్డి.. నీ ఆస్తులు పంచే ధైర్యం ఉందా?

### బిజెపిది బ్లాక్‌మెయిల్ దందా : కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త :** 'అవినీతి' అనే యూనివర్సిటీకి కెసిఆర్ ప్రొఫెసర్ వంటివాడని రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో ఆయన ఫ్యామిలీ దిట్ట అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం లక్ష కోట్లలో 30 శాతం కమీషన్ చొప్పున 30 వేల కోట్లు తినేసి ఉంటారని ఆరోపించారు. దొరికిందల్లా అంచనాలకు లేకుండా రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం దోచుకున్నదని, కానీ వాళ్లంతా పతివ్రత లేరన్నట్టు మాట్లాడుతు న్నారని తూర్పు జయప్రకాష్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ ఫ్యామిలీ అలీబాబా 40 దొంగల ముఠా.. అందులో కొత్త ప్రభాకర్‌రెడ్డి ఓ సభ్యుడు అని అపహాస్యం చేశారు. మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తిని జనం కోసం పంపిణీ చేయడానికి మంచిగుణం నాకు వారసత్వంగా వచ్చిందని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు సంపా దించినా వాటిని ప్రజలకే పంచుతానని ఆయన స్పష్టం చేశారు. నేను ఎలాంటి వాడినో కెసిఆర్, హరీశ్‌రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్‌రెడ్డికి హితవు పలికారు. కెసిఆర్ అరాచకాలు బయటపెట్టాలని రేవంత్ ఆలోచన అని, కాంగ్రెస్ లైన్ కూఆ అదే అన్నారు. బిజెపి వాళ్ల మాటలు పట్టించుకోవద్దు, సమస్త మతాల కాపాడేది రాహుల్‌గాంధీ మాత్రమే అని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబం వెంట బిజెపి పడుతూనే ఉందని, కరెన్సీ మీద గాంధీ బొమ్మ లేకుండా చేయాలనేది బిజెపి లైన్ అని అన్నారు. బిజెపి వాళ్లది అంత బ్లాక్‌మెయిల్ దందా అని, ఎవడు ఎప్పుడూ దొరుకుతాడా అని చూస్తారని ఆయన విమర్శించారు.

## ఎంపి రఘునందన్‌రావుకు ఆరోసారి బెదరింపు కాల్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త** మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు మరోసారి బెదరింపు కాల్ వచ్చింది. శుక్రవారం 9404348431 నెంబర్ నుంచి కాల్‌వచ్చింది. తాము హైదరాబాద్‌లోనే ఉన్నామని, చంపేస్తామంటూ బెదిరించారు. ఎవరు కాపాడుతారో చూద్దామంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇలా రఘునందన్ రావుకు బెదరింపు కాల్ రావడం ఆరోసారి. బెదిరింపు కాల్ రావడంతో బిజెపి పార్టీ శ్రేణులు, కార్య కర్తలు, అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే రఘునందన్ రావు మారోసారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## ఐపిఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా డిజిపి జితేందర్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** తెలంగాణ ఐపిఎస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా డిజిపి జితేందర్ కొనసాగనుండగా ఉపాధ్యక్షుడుగా రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు, కార్యదర్శిగా హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రంసింగ్‌మాన్, జాయింట్ సెక్రటరీగా మల్టీజోన్-2 డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, కోశాధికారిగా హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, నిఘా విభాగం ఎస్‌పి భాస్కరన్, మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పి జానకి ధరావత్, నిర్మల్ జిల్లా ఎస్‌పి జానకీ షర్మిలా, హైదరాబాద్ పోలీసు విభాగంలోని దక్షిణ మండల డిసిపి స్నేహ మెహ్రా ఎన్నికయ్యారు. కాగా ఐపిఎస్ అధికారుల సంఘం ఎన్నిక కోసం ఎన్నికల అధికారిగా శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ వ్యవహరించారు.

## నన్ను ఎపికి పంపించండి..

### హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి దివంగత మంత్రి వై.ఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో నిందితుడుగా వున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి తనను ఎపికి పంపాలని తెలంగాణ హైకోర్టులో శుక్రవారం నాడు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును తెలంగాణ సిబిఐ విచారిస్తుండడం తెలి సిందే. ఇందులో భాగంగా హైకోర్టులో దీనికి సంబంధించిన కేసు విచారణలో వుండడం విదితమే. ఈ కేసులో నిందితులను చంచల్‌గూడ జైల్లోనే నిర్బంధించారు. ఇదే కేసులో నిందితుడుగా వుండి కొంతకాలం చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న కడప ఎంపి వై.ఎస్ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి షరతులతో కూడిన బెయిలుపై బయట వుండగా ఆయనను ఎపికి వెళ్లకూడదని ఇక్కడే వుండాలని తెలంగాణ హైకోర్టు ఆదేశిం చింది. అయితే తనకు పులివెందులలో పొలాలు వున్నాయని, వ్యవసాయం వుందని, తన ఆరోగ్యం కూడా సరిగ్గా లేనందున ఎపికి వెళ్లేందుకు అను మతించాలని హైకోర్టును వేడుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల సర్కిల్, ఆర్మూర్
టెండర్ నోటీసు
అర్గుల రాజారాం గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనుల దశ-1లోని పంప్ నెం.2కు స్పేర్స్ సరఫరా, బేరింగ్ మరియు సర్వీస్ కోసం మేజర్ ఇరిగేషన్-సబ్ ఎస్టిమేట్ పనుల కోసం టెండర్ నోటీసు నెం.19/SE/IC/ARMOOR/2025-26, తేది: 07.08.2025 (2వ కాల్) ద్వారా రూ.47.54 లక్షలకు టెండర్ వేయబడ్డాయి. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in లో చూడవచ్చును. సం/- పర్యవేక్షక అభియంత, నీటి పారుదల సర్కిల్, ఆర్మూర్
DIPR.No.6220-PP/CL/Advt/1/2025-26, తేది: 08.08.2025

వార్త

మానవుడి కష్టాలన్నిటికి కారణం అతని అజ్ఞానం, క్రమశిక్షణరాహిత్యం.

-కౌటిల్యుడు.

# భారత్ నెత్తిన సుంకాల పిడుగు

ట్రంప్‌కు కోపమొచ్చింది. ఒక్కసారిగా చిరిగి చాటం తయ్యింది. భారత్ ఎగుమతులపై సుంకాల శంఖం ఊదేశారు. శత్రు దేశాలతోనే కాదు మిత్ర దేశాలతో కూడా శ్వేతసౌధాధినేతది అదే తీరు. ఎదురుగానున్నది ఎవరైనా సరే తన,పర విచక్షణ ఉండదు. ఒకే వేగం, ఒకే వ్యవహారశైలి. ముందూవెనుకా చూడడు. భారత్‌ది మృత ఆర్థిక వ్యవస్థగా ఏనాడైతే చిత్రీకరించాడో ఆనాడే అర్థమైంది. భారత్‌కు ట్రంప్‌తో ఉన్న స్నేహ బంధం తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిదని ట్రంప్ వ్యాఖ్యలలో నిజంలేదని ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా జవాబిచ్చారు. ప్రపంచవృద్ధిలో భారత్ వాటా 18 శాతంగా ఉంటే, అమెరికా వాటా 11 శాతం కంటే తక్కువగా ఉందని తేల్చిచెప్పారు. ఏదో అక్కసుతో అలా అన్నారు కానీ, ట్రంప్‌కు ఈ విషయాలు తెలియవని అనుకోలేం. అమెరికాతో కయ్యానికి కాలు దువ్వే ఆలోచన భారతదేశానికి లేనేలేదు. అందుకనే 'ట్రంప్' నిర్ణయాలను ఓపికతో పరిశీలిస్తున్నారు మన పాలకులు. రష్యా నుంచి చాలా కాలంగా భారత్ ముడి చమురును చౌకగా దిగుమతి చేసుకుంటోంది. ట్రంప్ బెదిరించిన మేరకు ఆయా ఒప్పందాలను ఉల్లంఘించేందుకు భారత్‌కు సుతరామూ ఇష్టం లేదు. 'మన దేశం -మన నిర్ణయం' అనే ధోరణిలో ప్రధాని మోడీ ఆచితూచి అడుగులేస్తున్నారు. ప్రపంచంలో అత్యధికంగా చమురును వినియోగించే దేశాలలో భారత్ మూడో స్థానంలో ఉంది. పెట్రో ఉత్పత్తుల కొనుగోలు పెరిగి వాటి వినియోగం మరికొంత పెరిగే అవకాశముంది. చమురు దిగుమతుల్లో 36శాతం చమురు రష్యా నుంచే వస్తోంది. కాగా అమెరికా అదనపు సుంకాలు సహేతుకం కాదని భారత్ భావిస్తోంది. ఈ ప్రతీకార సుంకాల వల్ల భారత్ వాణిజ్యంపై 86 మిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ట్రంప్ సంతకం చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ వలన దాదాపు 24దేశాల్లో సుంకాలు పెరిగాయి. పాత 25శాతం సుంకాలు అమల్లోకి వచ్చేసాయి. ఈ నెల 27 నుంచి అదనపు ప్రతీకార సుంకాలు కూడా అమల్లోకి వస్తాయి. దీనివలన భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వారంగం, తోలు ఉత్పత్తులపై ప్రభావం పడుతుంది. చెప్పాలంటే ట్రంప్ సుంకాల బాధిత దేశంగా భారత్‌ది రెండోస్థానం. రష్యా నుంచి కొన్న చమురును బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని విపరీతమైన లాభాలు ఆర్జిస్తోందన్నది ట్రంప్ అక్కసుకు మరో కారణం. అందుకే నట అదనపు సుంకాలు. ఇంత బహిరంగంగా బరితెగించి అభివృద్ధి చెందుతున్న దేశాలపై విరుచుకుపడడం ట్రంప్‌కు ఏమాత్రం తగదని, వివిధ దేశాల అధినేతలు, కొందరు స్వపక్షంలోని వారు కూడా వారిస్తున్నారు. అయినా ఆయన ధోరణిలో మార్పులేదు. అమెరికా ఆధిపత్య ధోరణికిది పరాకాష్ఠ. భారత్‌లో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి సంక్షోభంలో పడే అవకాశాలున్నాయి. అలానే సముద్ర ఉత్పత్తులు, తోలు, సానబెట్టిన వజ్రాలు, రత్నాభరణాల వంటి ఎగుమతులపై అదనపు భారం పడుతుంది. ఎంతో అత్యవసరంగా దుష్ప్రభావం పడే వస్తువులను భారతీయ ఎగుమతుల సంస్థ అంచనా వేసింది. దాదాపు 50శాతం మేరకు ఎగుమతులు తగ్గిపోతాయి. అమెరికా తన ఇరుగు పొరుగు, మిత్ర దేశాలతో ఏ దేశాన్నీ వదల్లేదు. తనతో అంటకాగే దేశాలతో పాటు తన ప్రలోభాలకు బెదిరింపులకు లొంగని వారికి కూడా సుదీర్ఘస్థాయిలో సుంకాలు విధిస్తోంది. చైనా, కెనడాలపై కన్నా భారత్‌పైన అధికంగా సుంకాలు విధించారు. అమెరికా అత్యధికంగా బ్రెజిల్‌తోపాటు భారత్‌పైనా సుంకాలు విధించింది. ఇరుదేశాల దిగుమతులపై 50శాతమే. ఆ తర్వాత స్థాయిలో స్విట్జర్లాండ్ (39 శాతం), కెనడా, ఇరాక్ (35శాతం), చైనా 30 శాతంసుంకాల భారం పడింది. ఇంకా 69దేశాల నుంచి వచ్చే అన్ని దిగుమతులపై 10 నుంచి 41శాతం వరకు ప్రతీకార సుంకాలను విధించింది. ఈ గురువారం నుంచి అవి అమల్లోకి వస్తాయి. బ్రెజిల్‌తో ముందుగా అనుకున్న 40శాతం సుంకాలతోపాటు ప్రతీకార సుంకాలు 10 శాతం అమల్లోకి వస్తుంది. అమెరికాకు ఎగుమతి చేసే వస్తువుల్లో 48 మిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులపై అదనపు సుంకాల ప్రభావం పడుతుంది. ఫార్మా సెమీకండక్టర్లు, స్మార్ట్‌ఫోన్లు వంటి 30 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు మినహాయింపుల జాబితాలో ఉంచారు. కనుక పెద్దగా ఇబ్బందేమీ రాదు. విదేశీ ఔషధాలపై 250 శాతం వరకు సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ ఈసరికే బెదిరించారు. అదే జరిగితే భారత్‌లో ఫార్మారంగం సంక్షోభంలో పడుతుంది. అమెరికా భారత్ నుండి ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తులు సుమారు 5.6 మిలియన్ డాలర్ల మేరకు ఉంటాయి. వీటి సుంకాల విషయంలో ట్రంప్ ఆంక్షల నేపథ్యంలో భారత్ పూర్తి అభ్యంతరం పెట్టింది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలే భారతప్రభుత్వానికి అత్యంత ప్రాధమ్యాలు అయినందున ఆయారంగాలను కాపాడుకుంటామని, రాజీపడబోమని ప్రధాని నరేంద్రమోడీ ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్దిఉత్సవాల సందర్భంగా జరిగినఅంతర్జాతీయ సదస్సులో వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా చర్యల వలన ప్రభావం దీర్ఘకాలంలో ఎక్కువవుతుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వంటి ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. భారత జిడిపిలో మొత్తం ఎగుమతుల వాటా 22 శాతం కాగా, అందులో అమెరికా వాటా 17శాతం అయినందున ప్రభావం తప్పదన్నారు. అమెరికా సుంకాల వల్ల ఎకానమీ కన్నా చిన్న ఆదాయ వర్గాలపై ప్రభావం చూపిస్తుందని, వాటిని ప్రభుత్వం పరోక్షంగా ఆదుకోవాలని విజ్ఞుల మాట.



మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కి రావు.

ప్లేటో



శత్రువుని జయించిన వాడు విజేతకాదు. శత్రుత్వాన్ని జయించినవాడే నిజమైన విజేత.

స్వామి వివేకానంద

# ప్రకృతి దోషం కాదు మనిషి ద్రోహమే!

***సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంతో పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి మానవుడు బయటపడలేకపోతున్నాడు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయంతో ప్రజాజీవనమే అస్తవ్యస్తమైంది. ఆర్థికంగా, సాంకేతికపరంగా ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. చైనాయే కాదు అమెరికా లాంటి దేశాలు కూడా ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటున్నది. రోజుల తరబడి జనజీవనం స్తంభించిపోతున్నది. తుఫాన్‌ల బారి నుండి తీర ప్రాంతాలు తప్పించుకోలేకపోతున్నాయి. దివిసీమలో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాల సీమగా మార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. దేవభూమిగా భావించే ఉత్తరాఖండ్ పరిస్థితి అంచనాలకే అందదు.***

దామెర్ల సాయిబాబ

తమలపాకుతో నువ్వట్లంటే తలుపు చెక్కతో నేను ఇట్లంటా అన్నట్లుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది నిందించాల్సింది మానవుడినే. మానవాళి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడు కోలేకపోతే మానవుడి మనుగడ భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతున్నాడు. 'ముప్పుముంచు కొస్తున్నది. ఒక్కరోజు కూడా ఆలస్యం చేయడానికి వీలు లేదు. తక్షణం కార్యాచరణ ప్రారంభించాల్సిందేనంటూ' వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వాల కమిటీ (ఐపీసీసీ)ఆరో అంచనా నివేదిక నాలుగేళ్ల క్రితమే హెచ్చరించింది. రాబోయే ఇరవై యేళ్లలో పారిశ్రామిక యుగానికి ముందు (1850-1900) స్థాయి కంటే సగటు భూతాపం 1.5 డిగ్రీలు సెలియస్ పెరుగుతుందని ఇది మానవాళికి 'కోడ్ రెడ్' అని (ఐపీసీసీ) ఆ నివేదికలో వెల్లడించింది. సముద్రాల మట్టాలు పెరగడం వల్ల భారతే కాదు ప్రపంచవ్యాప్తంగా భారీ నష్టం వాటిల్లుతుందని కూడా హెచ్చరించింది. అయితే ఏడువేల ఐదు వందల కిలోమీటర్లకుపైగా పొడవైన తీరప్రాంతం ఉన్న భారతదేశం లోనే ఎక్కువ భూమి ముంపునకు గురవుతుందని ఫలితంగా వరదలు, భూమికోత వంటి విపత్తులు సంభవిస్తాయని వివరించింది. ఉద్గారాలు అదేస్థాయిలో కొనసాగితే ఈ శతాబ్దపు మధ్యకాలానికి భారత్‌లో యేటా వరదల బారినపడే వారి సంఖ్య మూడున్నర కోట్లకు చేరుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా దాదాపు మూడువందల ఎనభైకిపైగా విపత్తులు ఇప్పటికే యేటా చోటు చేసుకుంటున్నాయి. ఇవి మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. తాజాగా మొన్న మంగళవారం ఆధ్యాత్మిక ధామాలను దర్శించే పర్యాటకులతో ప్రకృతి సోయగాలతో అలలారే రమణీయమైన హిమాలయ గ్రామం 'ధారలీ'పై ప్రకృతి విరుచుకుపడింది. క్లౌడ్‌బర్స్ట్ కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకు వచ్చిన వరద బురద ఆ గ్రామంలోని ఇళ్లను, రెస్టారెంట్లు, హోటళ్లను భూస్థాపితం చేసింది. అప్పటి వరకు ప్రకృతి అందాలతో తులతూగిన ఉత్తరాఖండ్‌లోని ఆ గ్రామం ఒక్కసారిగా మరుభూమిని తలపిస్తున్నది. మెరుపు వరద ధాటికి చాలా వరకు గ్రామం ధ్వంసమైంది. పలువురిని సజీవంగా కప్పేసింది. కొందరు ఆ బురద నుంచి దూసుకుంటూ బయటకు రాగలిగారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఇలా వరదలకు గ్రామాలకు గ్రామాలే ఊడ్చుకుపోవడం, ఎందరో అసువులు బాయడం సర్వసాధారణమైపోయింది. ప్రపంచ వ్యాప్తంగా కూడా పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పరిస్థితి అదుపు తప్పుతున్నది. ఇందుకు కారణాలు, కారకులు ఎందరో ఉన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది

## ఒక్క మాట

ఎకరాల పంటపొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటే మిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం త్వరలో భారత జనాభా నూటనలభై కోట్లకుపైగా చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలోని సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద వేగంగా హారించుకుపోతుందని స్పష్టం చేసింది. భారతదేశంలో రోజూ దాదాపు మూడువందల యాభై ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని గతంలోనే ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. బొగ్గుగనులు, థర్మల్‌విద్యుత్ కేంద్రాలు, పరిశ్రములు, నదీలోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. పాలకుల అంతులేని నిర్లక్ష్యంతో అటవీ వనరులు, జీవవైవిధ్యం విధ్వంసానికి గురవుతున్నాయి. పర్యావరణ సమతుల్యం దెబ్బతింటున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములను బదలాయించడంపై ఇప్పటికే ఎన్నో విమర్శలు ఎదురవుతున్నాయి. పర్యావరణ అటవీ చట్టాలపై 2014లో అత్యున్నతస్థాయి కమిటీ సమగ్ర అధ్యయనం జరిపి ఇచ్చిన ప్రతిపాదనలు అటకెక్కించారనే చెప్పొచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న పర్యావరణ, అటవీ చట్టాలన్నిటిని ఒకేగొడుకు కిందకు తీసుకురావాలని సూచించింది. అటవీపర్యావరణ అనుమతుల ప్రక్రియలో పారదర్శకత పెంచాలని ప్రతిపాదించింది. అన్నింటికంటే మించి నిర్వహణలో పరిశ్రమలు, ప్రాజెక్టుల యాజమాన్యాలు హరిత చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్రనేరంగా పరిగణించి శిక్షలు వేసి మార్పులు తీసుకురావాలని స్పష్టంచేసింది. ఆప్రతిపాదనలు అమలు చేసే విషయంలో దృష్టి సారించకపోవడం దురదృష్టకరం. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతాఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అది కాగితాలకే పరిమితమవుతుంది. ఇక వాహన కాలుష్యం నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపుస్థాయిలో వాహన కాలుష్యంతో పాటు పరిశ్రమలు వదులుతున్న పొగ, తదితరాలన్నీ కలిపి వాయుకాలుష్యాన్ని పెంచుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీ లాంటినగరాల్లో వాయు కాలుష్యం అదుపులేని స్థాయికి పెరిగిపోయింది. చలికాలంలో ఢిల్లీపౌరులు కొందరునగరాన్ని వదిలిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటే అందుకు ప్రతిగా ప్రకృతి కూడా తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణం సమతుల్యత దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియకపోవడం, కురిస్తే ఒకేసారి, ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. దానినే 'క్లౌడ్ బర్స్ట్' అంటున్నారు. ఇప్పుడు ధరాలీ గ్రామంలో అలాంటి క్లౌడ్‌బర్స్ట్‌తోనే విలయం సృష్టించింది. గురువారం సాయంత్రం తెలంగాణా రాజధాని హైదరాబాద్ ప్రాంతాల్లోగంటపాటు కురిసిన కుంభవృష్టితో నగరప్రజలకు నరకం చూపించింది. ప్రపంచవ్యాప్తంగా యేటా లక్షలాది మంది ఈ ఉపద్రవా లతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తులనష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్నముందుజాగ్రత్తల చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విధ్వంసానికి అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంతో పురోభివృద్ధివైపు పయనించినాప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి మానవుడు బయటపడలేకపోతున్నాడు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయంతో ప్రజాజీవనమే అస్తవ్యస్తమైంది. ఆర్థికంగా, సాంకేతికపరంగా ఎన్నోరంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. చైనాయే కాదు అమెరికా లాంటి దేశాలు కూడా ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటున్నది. రోజుల తరబడి జనజీవనం స్తంభించిపోతున్నది. తుఫాన్‌ల బారినుండి తీరప్రాంతాలు తప్పించుకోలేకపోతున్నాయి. దివిసీమలో సంభవించిన తుఫాన్ సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాల సీమగా మార్చేసింది. ఇప్పటికీ ఆ బీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. దేవభూమిగా భావించే ఉత్తరాఖండ్ పరిస్థితి అంచనాలకే అందదు. ఎప్పుడు ఏ రూపంలో భూకంపాలు, వరదలు ముంచుకొస్తాయో చెప్పలేని పరిస్థితి. ఏదిఏమైనా ఈ ఉపద్రవాలను నియంత్రించేందుకు పర్యావరణ పరిరక్షణే మార్గం. అందుకు పాలకులు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇలాంటి ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లిస్తూనే ఉండాల్సిందే! •

# భారత్ ఆర్థిక స్వాతంత్ర్యం ఎవరి చేతుల్లో?

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత దేశంపై విధించిన టారిఫ్ పెంపులు, రష్యాతో వ్యాపార సంబంధాలను ఛేదించమన్న డిమాండ్లు కేవలం ఆర్థిక విధానాలే కాదు, భారత సార్వభౌమత్వంపై సవాళ్లు. ట్రంప్ ప్రభుత్వం భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించి, రష్యాతో క్రూడ్ ఆయిల్ ఒప్పందాలను నిషేధించడానికి ప్రయత్నించిన సందర్భంలో, భారత ప్రభుత్వంనిశ్శబ్దం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు ప్రచారం చేసినా, ఆయన భారత ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించలేకపోయారు. ఈ పరిస్థితి భారత ఆర్థిక విధానాలలోని దౌర్బల్యాన్ని, అమెరికాపై ఉన్న అతిగా ఆధారపడటాన్ని బహిర్గతం చేస్తుంది. రష్యా భారతదేశానికి కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు, సామరస్యపూర్వకమైన జియోపాలిటికల్ మిత్రుడు. 1971లోబంగ్లాదేశ్ యుద్ధంలో రష్యా భారతానికి అండగా నిలిచింది. కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితిలో మద్దతు ఇచ్చింది. ఇప్పటికీ భారత రక్షణ వ్యవస్థలో 60శాతం సైనిక సామగ్రి రష్యాదే. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ, భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను ప్రాధాన్యతనిచ్చి రష్యాతో క్రూడ్ ఆయిల్‌కొనుగోలు కొనసాగించింది. ఇది ట్రంప్‌కు మింగుడు పడని విషయం. ట్రంప్ ప్రకారం, 'భారత్ అమెరికా శత్రువులతో వ్యాపారం చేయకూడదు'. కానీ, అమెరికా ఎప్పుడూ భారత ప్రయోజనాలను ప్రధానంగా పరిగణించలేదు. 1960లలో భారత్‌లోని తేలికపాటి చమురు నిల్వలు లభించవు అని ప్రకటించింది. సోవియట్ యూనియన్ సహాయంతో బాంబే హైలో భారీ నిల్వలు కనుగొనబడ్డాయి. ఇది అమెరికా విశ్వసనీయతపై ప్రశ్నార్థకాలను ఎత్తుతుంది. ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థను 'మృతప్రాయం'గా వర్ణించినా, అతని సొంత సంస్థలు భారత్‌లో అపార లాభాలు ఆర్జిస్తున్నాయి. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, నోయిడాలలో ట్రంప్ ఆర్గనైజేషన్ 11 మిలియన్ చదరపు అడుగుల భవన నిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. హైదరాబాద్‌లోని 63 అంతస్తుల ట్రంప్ టవర్ ద్వారా 3,500 కోట్ల రూపాయల లాభం ఆయన కంపెనీలకు వస్తుంది. ట్రంప్ చెప్పినట్లు భారత్ 'మృతప్రాయ ఆర్థిక వ్యవస్థ' అయివుంటే ఈ లాభాలు ట్రంప్‌కు ఏలా వచ్చేవి? ట్రంప్ భారత్ నుండి ఒకవైపు లాభాలు దండుకుంటూ, మరోవైపు అదే భారత దేశాన్ని ఆర్థికంగా బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్నాడు. అతని డబుల్ స్టాండర్డ్ స్పష్టంగా కనిపిస్తుంది. "మీ దేశం పేదది, కాబట్టి నేను మీపై పన్నులు విధిస్తాను. కానీ నా కంపెనీలు మీ భూమిలో కొనసాగాలి' అనే ధోరణి ప్రమాదకరమైన పరిస్థితికి తార్కాణం. ట్రంప్ భారత్‌పై ఆర్థికదాడులు చేస్తున్నప్పుడు, ప్రధాని మోడీ ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు? అదానీ వ్యాపార సంస్థల గుట్టు అమెరికా ఫెడరేషన్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేతికి చిక్కటం వల్ల దానిని అరెస్టు చేస్తామని భయపెట్టడం, బ్లాక్ మెయిలింగ్ చేయటం కారణం కావచ్చు అనే అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. అలాగే భారత రక్షణ వ్యవస్థలో అమెరికా సామగ్రి, టెక్నాలజీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం. మోడీ ప్రభుత్వం ట్రంప్ సంస్థలకు భారత్‌లో వ్యాపార విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించింది. ఇది రాజకీయవ్యాపార ఒప్పందంగా కనిపిస్తుంది. చివరిగా భారత దేశం స్వదేశీ ఉత్పత్తులపైన, బహుళ ధృవ ప్రపంచ వైఖరి పైనా దృష్టి పెట్టటం అత్యంత కీలకమైన అవసరం. ట్రంప్ వ్యవహారాలు భారతదేశానికి ఒక ముఖ్యమైన పాఠం నేర్పాయి.' అమెరికా ఎప్పుడూ తన ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుంది'. భారతదేశం తనఆర్థిక, రక్షణ విధానాలలో బహుళధృవ వైఖరినిఅనుసరించక తప్పదు. రష్యా, ఫ్రాన్స్, చైనా, ఇజ్రాయెల్ వంటి దేశాలతో సమతుల్యమైన సంబంధాలు పెంపొందించుకోవడమే సరైన మార్గం. అలాగే, విదేశీ పెట్టుబడులను నియంత్రించే నియమాలు కఠినంగా అమలు చేయాలి. ట్రంప్ లాంటి వ్యక్తులు భారత ఆర్థికవ్యవస్థను దోచుకునే అవకాశాలను, పరిస్థితులను నియంత్రించాలి. భారత్ 'స్వదేశీ విధానం'అనేది కేవలం నినాదంకాకుండా, ఆర్థికస్వాతంత్ర్యానికి ఆయుధంగా మారాలి. భారత ప్రభుత్వం, ప్రజలు ధృఢ సంకల్పంతో స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలి. మన దేశంలో లభించని అరుదైన ఉత్పత్తులను, సైన్స్, టెక్నాలజీని మాత్రమే విదేశాలనుండి దిగుమతి చేసుకోవాలి. •

# ప్రజావాక్కు



### ట్రంప్ చర్యలను ఖండించాలి

రాను రాను అమెరికా అధ్యక్షుని పరిపాలనా విధానాలు చిన్నపిల్లవాడి మనస్తత్వం లాగా పిచ్చివాడి చేష్టలు లాగా కనబడుతున్నాయి. లేకపోతే ఏమిటీ సుంకాల గోల? ఇప్పటికే ఇండియా మీద దిగుమతుల సుంకాలు 25 శాతం పెంచి రష్యా నుండి చమురు కొనుగోలును భారత్ ఆపలేని కారణంగా ఈ నెల 27 నుంచి ఈ సుంకాన్ని 50శాతానికి పెంచుతానని భయపెడుతున్నాడు. మన ప్రధాని నరేంద్రమోడీ ఈ దుశ్చర్యలను ఖండించకమౌనం వహించడంలో ఆంతర్య మేమిటీ? ఆపరేషన్ సిందూర్‌ను తానే భారత్‌కుచెప్పి ఆపానని అహర్నిశలు జపం చేస్తున్న ట్రంప్ గోబెల్స్‌ను తలపోస్తున్నాడు. దీన్నికూడా గట్టిస్వరంతో ట్రంప్‌ను మందలించ లేదు. చైనా మీద చిన్న మాట కూడాఅనేధైర్యంలేదు ట్రంప్‌కు. ప్రపంచదేశాలన్నీ ట్రంప్ వ్యవహార శైలిని గమనిస్తున్నాయని ఆయన గ్రహించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### యువతకు అవకాశం ఇవ్వాలి

ఒక ఉద్యోగి పని చేసి చేసి అలసిపోతాడు. కొంత కాలానికి ఆ పని మీద విసుగు వచ్చేస్తుంది. దాంతో చేస్తున్న పని మీదఆసక్తి తగ్గిపోతుంది. ఈ కారణాలతో పని బాగా చేయలేడు. ఇలాంటి వారికి రిటైర్‌మెంట్ ఇచ్చి ఇంటికి పంపించేస్తుంటారు. తరువాత వారిస్థానంలో పని చేసేందుకు ఉత్సాహవంతులైన యువకులు ముందుకు వస్తారు. వయసు మీరాక ఉద్యోగస్థుల్లానే అత్యున్నత పదవుల్లో ఉన్న రాజకీయ నాయకులు కూడా రిటైర్‌మెంట్ తీసుకోవాలి. యువకులకుఅవకాశంఇవ్వాలి. కాని రాజకీయ రంగంలో అలా జరగడంలేదు. వయోవృద్ధులైన నాయకులు పదవులను వదలటం లేదు. వృద్ధుల స్థానంలో యువత రావాలి.

- శాస్త్రి, హైదరాబాద్

### రీడర్ అలవెన్సు పెంచాలి

అంధలెక్చరర్స్, టీచర్స్ గురుకులాలలో, ప్రభుత్వ విద్యా సంస్థలలో బోధన చేయడంలో, సహాయకుల అవసరత ఎక్కువగా ఉంటుంది. సూక్ష్మ అక్షరాలు, కంప్యూటర్ క్లాసులు, టీచింగ్ డైరీ రాయడం, హౌస్‌మాస్టర్ డ్యూటీలు ఇబ్బందికరంగా ఉంటుంది. సహాయకులకు ఇచ్చే ఆర్థిక సహాయం రీడర్ అలవెన్స్ పెంచాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ప్రజా సమస్యల మాటేమిటి?

నరేంద్రమోడీ పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదస్థావరాలపై దాడి చేసి విజయం సాధించాడు. విదేశాలలో పర్యటిస్తూ పురస్కారాలు, విదేశీ ప్రముఖుల ప్రశంసలు అందుకోవటంలోను విజయం సాధించారు. ఇలానే ఇందిరాగాంధీ పాలనా కాలాన్ని అధిగమించడంలోను ఆయన విజయం సాధించారు. అయితే 2014 ఎన్నికల సమయంలో ధరలు తగ్గిస్తానని యువతకు యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని పేదల బ్యాంకు ఖాతాల్లో విదేశీ బ్యాంకుల్లో నల్లకుబేరులు దాచి ఉంచిన కోట్లాది రూపాయలను వెనక్కి తెప్పించి 15 లక్షల రూపాయలు జమ చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ హామీలు నెరవేర్చటంలో దారుణంగా ఓడిపోయారు. అంతేకాదు మోడీ అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రాంతాల్లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి.

-మిథునం, హైదరాబాద్

### ట్రంప్ సుంకాల బాంబులు

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. ఇప్పటికే ప్రకటించిన 25 శాతం సుంకాలకు తోడు, పెనాల్టీరూపంలో మరో 25శాతం సుంకాలు విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండడం వల్లనే ఈ పెనాల్టీ విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. తాజా పెనాల్టీతో భారత్ నుంచి అమెరికాలోకి ప్రవేశించే వస్తువులపై విధించిన సుంకాలు 50 శాతానికి పెరిగాయి. ట్రంప్‌కావాలని ఈ సుంకాలు విధిస్తున్నారు భారత్‌పై విధించే సుంకాల విషయంలో సొంత పార్టీ నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నా ట్రంప్ ఏ మాత్రం వెనక్కి తగడం లేదు.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ఖర్చులు తగ్గించాలి

అనేక పరీక్షలు వ్రాసి కఠినమైన అలజడిని వత్తిడిని తట్టుకొని పిల్లలతోట్రాన్స్‌ఫర్లు ఎదుర్కొని దీర్ఘకాల సర్వీస్‌చేసి రిటైర్ అయ్యేటువంటి వారికి వారు జీవితాంతం చేసిన సేవల గుర్తింపుకు పెన్షన్‌లు ఇవ్వడం ఒక మహాసహాయం. అంతేగాని పార్టీ నుంచి పార్టీలు మారి 5 సంవత్సరాలు కూడాసొంత ప్రయోజనాలకే సమయం కేటాయించి కోట్ల ఆస్తులు పెంచుకోనే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు జీతాలు వరకూ బానేవుంది. ఎంత సర్వీస్ చేశారని అంతపెద్ద పెన్షన్లు సార్. ప్రభుత్వం కొంచెం ఆలోచించాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్


మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు



రామ కిష్టయ్య సంగన భట్ల

జెనివాలో ఆగస్టు 9, 1982న అటవి వనరుల హక్కులకు సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూప్‌ల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివాసీల కోసం కూడా ఒక రోజు ఉండాలని ఐక్య రాజ్య సమితిని కమిటీ కోరగా, ఆదివాసుల సంరక్షణ చట్టాలకుఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపింది. మేధావుల వర్కింగ్ కమిటీ 1992 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించింది. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించబడుతుంది. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని 1994లో ప్రకటించింది. 1994 నుండి 2014 వరకు ఆ మధ్య కాలాన్ని ఆదివాసీల అభివృద్ధి కాలంగా పరిగణించి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు అంతరించిపోతున్న తరుణంలో వారి సంరక్షణ దిశగా ఐక్యరాజ్య సమితి చర్యలు చేపట్టింది. 1997లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులను కల్పిస్తూ, ప్రపంచ దేశాల ప్రతినిధులను తీర్మానానికి ఆహ్వానించింది. 143 ఐరాస సభ్యదేశాలు ఓటింగ్‌లో పాల్గొనగా 125 దేశాల ప్రతినిధులు తీర్మానాన్ని ఆమోదించారు. 14 మంది తటస్థ వైఖరి తెలపగా, కేవలం నలుగురు వ్యతిరేకించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉన్నది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం, తద్వారా జీవించే హక్కుతోసహా ఆధునిక మానవునికి గల అన్నిహక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నదని 1994 డిసెంబర్ 23న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది. అప్పటి నుంచి గిరిజన హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించేందుకు ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బ్రతుకు పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడుతుండేవి. సాటి



మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయాదేశాలలో కనీసపు చట్టాలు కూడా లేవు. ప్రపంచంలో సుమారు ఏడు వేల భాషలు ఉంటే అందులో ఆదివాసీ తెగలు మాట్లాడే భాషలే నాలుగు వేలు ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. నేడు అత్యధికులు మాట్లాడే, వాడే ఆరు భాషలు గతంలో అంతరించిపోయిన ఆదివాసీ తెగలు వాడినవే. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించబడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయబడుతున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కులేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించిపోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారిపోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటికీ ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికీ పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. •

# గాజా స్వాధీనానికి ఇజ్రాయెల్ కేబినెట్ ఆమోదం

## మరో కీలకమలుపు తిరిగిన యుద్ధం, నెతన్యాహు వ్యాఖ్యాలపై హమాస్ తీవ్ర స్పందన



**జెరూసలెం,ఆగస్టు 8:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య దాదాపు 23 నెలలుగా కొనసాగుతున్న యుద్ధం మరో కీలక మలుపు తిరిగింది. గాజా సిటీని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకునేందుకు రూపొందించిన ప్రణాళికకు ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో గాజాలో సైనిక కార్యకలాపాలు మరింత విస్తృతం కానున్నాయి. భద్రతా కేబినెట్ సమావేశానికి ముందు మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ప్రధాని నెతన్యాహు ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మా భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు, హమాస్‌ను పూర్తిగా తొలగించేందుకు, అక్కడి ప్రజలకు స్వేచ్ఛ కల్పించేందుకు గాజా మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకోవాలని ఇజ్రాయెల్ భావిస్తోందని స్పష్టం చేశారు. అయితే, గాజాను శాశ్వతంగా అట్టిపెట్టుకునే ఉద్దేశం తమకు లేదని, అక్కడ ఒక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి, సరైన రీతిలో పాలించగల అరబ్ దళాలకు పాలనా బాధ్యతలు అప్పగిస్తామని నెతన్యాహు వివరించారు. నెతన్యాహు వ్యాఖ్యలపై హమాస్ తీవ్రంగా స్పందించింది. చర్చల ప్రక్రియను దెబ్బ తీసేందుకే ఆయన ఈ ప్రకటన చేశారని, యుద్ధం వెనుక ఉన్న ఆయన నిజమైన ఉద్దేశాలు ఇప్పుడు బయటపడ్డాయని హమాస్ ఒక ప్రకటనలో ఆరోపించింది. మరోవైపు, గాజాలో మానవతా సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతోంది. 2023 అక్టోబర్‌లో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 61,258 మందిపాలస్తీనియన్లు మరణించగా, 1,52,045 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్య అధికారులు గురువారం తెలిపారు. ఇజ్రాయెల్ దిగ్బంధనం కారణంగా గాజాలో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో యూఏఈ, జోర్డాన్, జర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్ దేశాలు బుధ వారం 107 సహాయక ప్యాకేజీలను విమానాల ద్వారా గాజాలో జారవిడిచాయి. అయితే, భూమార్గాల ద్వారా పెద్ద ఎత్తున సహాయాన్ని అనుమతిస్తే తప్ప, ఈఎయిర్‌డ్రాప్స్ వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని ఐక్యరాజ్యసమితి అధికారులు పేర్కొంటున్నారు. మానవతా సహాయం అందించేందుకు వీలుగా జులై 27నుంచి గాజాలోని కొన్ని జన సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సైనిక కార్యకలాపాలకు వ్యూహాత్మక విరామం పాటిస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. డేర్ అల్‌బలా, అల్‌మవాసి, గాజా సిటీ వంటి ప్రాంతాల్లో ఈ విరామాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపింది.



# భారత్‌తో ఎలాంటి వాణిజ్య చర్చల్లేవు

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ


**వాషింగ్టన్, ఆగస్టు 8:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాల భారాన్ని మోపారు. దీనికి భారత్ కూడా దీటుగా స్పందిస్తూ.. దేశంలోని రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొంది. ఈ క్రమంలో ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ విధించిన సుంకాల భారాన్ని చర్చలతో పరిష్కరించుకోవాలని భారత్ చూస్తోంది. అయితే, అందుకు అధ్యక్షుడు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. టారిఫ్‌ల వివాదం పరిష్కారం అయ్యేవరకు న్యూఢిల్లీతో ఎలాంటి వాణిజ్య చర్చలు ఉండవని ఓవల్ కార్యాలయంలో ఓ వార్తా సంస్థ అడిగిన ప్రశ్నకు ట్రంప్ సమాధానమిచ్చారు.

**భారత్ వ్యూహాత్మక భాగస్వామి..**

ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా అమెరికా విదేశాంగ శాఖ మరో ప్రకటన చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ విలేకరులతో మాట్లాడుతూ భారత్ అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామి అని పేర్కొన్నారు. టారిఫ్‌ల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తత కొనసాగుతున్నప్పటికీ ఆ దేశంతో పూర్తి స్థాయి చర్చల్లో పాల్గొంటామన్నారు. వాణిజ్యం, రష్యా నుంచి చమురు కొనుగోలు వంటి విషయాల్లో ట్రంప్ స్పష్టంగా ఉన్నారన్నారు. దానికి ప్రతిస్పందనగానే ట్రంప్ నేరుగా చర్యలు తీసుకున్నారన్నారు. రష్యా నుంచి చమురు కొనొద్దన్న తన హెచ్చరికలను పట్టించుకోని భారత్‌పై ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే 25శాతం సుంకాలను విధించిన ఆయన దానిని 50 శాతానికి పెంచారు. పెంచిన 25 శాతం సుంకాలు ఈ నెల 27నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, ట్రంప్ టారిఫ్‌లకు భారత్ కూడా ధీటుగా స్పందించింది. దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే తమకు ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అవసరమైతే ఆ భారాన్ని తామే మోస్తామన్నారు.

# శృంగారానికి సమ్మతి వయసును తగ్గించే ప్రశ్నేలేదు..

## సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** శృంగార కార్యకలాపాలకు చట్టపరమైన అంగీకార వయసును 18 ఏళ్ల నుంచి తగ్గించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తేల్చి చెప్పింది. కౌమార దశలో ఉండే ప్రేమ వ్యవహారాలను కారణంగా చూపి, ఈ వయసును తగ్గించాలన్న వాదనలను తీవ్రంగా వ్యతిరేకించింది. మైనర్ల రక్షణే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని, ఈ విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేసింది. ఈ వయోపరిమితిని 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించాలంటూ సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చేసిన వాదనకు స్పందనగా ప్రభుత్వం ఈ విషయాన్ని కోర్టుకు తెలిపింది. మైనర్లను లైంగిక వేధింపుల నుంచి కాపాడేందుకు 18 ఏళ్ల వయోపరిమితి చాలా కీలకమని ప్రభుత్వం తన వాదనలో పేర్కొంది. ఈ నిబంధనను కఠినంగా, దేశవ్యాప్తంగా ఒకేలా అమలు చేయాలని నొక్కి చెప్పింది. ఒకవేళ ఈ వయసును తగ్గిస్తే, బాలల పరిరక్షణ కోసం దశాబ్దాలుగా చేసిన కృషి నీరుగారిపోతుందని, పోక్సో లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ చట్టం వంటి కఠిన చట్టాలు బలహీనపడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. 18 ఏళ్ల లోపు వారికి లైంగిక అంగీకారంపై సరైన అవగాహన, పరిణతి ఉండవని, వయసు తగ్గింపు వారి సంక్షేమానికి పెను ముప్పుగా మారుతుందని కేంద్రం వివరించింది. యువతీ యువకుల మధ్య శృంగార భరిత ప్రేమ పేరుతో ఈ వయోపరిమితిని సవరించడం చట్టవ్యతిరేకమే కాక ప్రమాదకరం కూడా అని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి లిఖితపూర్వకంగా తెలియజేశారు. కౌమార వయసులో ఉన్నవారి మధ్య ఇష్టపూర్వక సంబంధాలను కూడా ప్రస్తుత చట్టం నేరంగా పరిగణిస్తోందన్న వాదనలపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టత నిచ్చింది. టీనేజ్ ప్రేమ వ్యవహారాల వల్ల యువకులు క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తోందని, దీనివల్ల సామాజికంగా నష్టం జరుగుతోందని మార్పును కోరుతున్న వారు వాదిస్తున్నారు. అయితే, ప్రేమ పేరుతో బాల్య వివాహాలను ప్రోత్సహించే ప్రమాదం ఉందని, వయసు తగ్గింపును దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.



# డయాబెటిస్‌పై భారతీయులకు అవగాహన తక్కువే!

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:**భారతీయుల్లో మధుమేహంపై అవగాహన కాస్త తక్కువేనని తాజాసర్వేలు చెపుతున్నాయి. చాలామందికి తాము మధుమేహంతో బాధపడుతున్న విషయం తెలియదని, ఫలితంగా జాగ్రత్తలు తీసుకోవడం లేదని తేలింది. 2019లో లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఐదుగురిలో ఒకరు మధుమేహంతో బాధపడుతున్నారని పేర్కొంది. ఇందులో 40 శాతం మందికి తాము మధుమేహంతో బాధపడుతున్నట్లు అసలు తెలియకపోవడం విచారకరమని తెలిపింది. ఆరోగ్య స్పృహతో ముందుజాగ్రత్త చర్యగా బ్లడ్ షుగర్ స్థాయులను తరచూ పరీక్షించుకుంటున్న వారి సంఖ్య చాలా తక్కువని ఆందోళన వ్యక్తం చేసింది. ఇక, మధుమేహం బారిన పడిన విషయం తెలిసి జాగ్రత్తలు తీసుకుంటున్న వారి సంఖ్య కూడా తక్కువేనని, కేవలం 46 శాతం మంది తమ బ్లడ్ షుగర్ స్థాయులను నియంత్రణలో ఉంచుకోగలుగుతున్నారని తెలిపింది. ఆహారంలో మార్పులు, జాగ్రత్తల ద్వారా వారు మధుమేహాన్ని నియంత్రించుకుంటున్నారని వివరించింది. దాదాపు 60 శాతం మంది విజయవంతంగా బ్లడ్ షుగర్ స్థాయులను తగ్గించుకుని జీవక్రియకు సంబంధించిన వ్యాధుల ముప్పును దూరం పెట్టగలుగుతున్నారని లాన్సెట్ నివేదిక తెలిపింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మధుమేహ బాధితులు ప్రతీ ఏడుగురిలో ఒకరు భారత్‌లోనే ఉన్నారని ఈ నివేదిక వెల్లడించింది. మధుమేహ బాధితులలో పురుషులు 19.6 శాతం, మహిళలు 20.1 శాతం ఉన్నారని లాన్సెట్ నివేదిక వెల్లడించింది. భారతీయుల్లో మధుమేహంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక తెలిపింది.

# విద్యార్థుల డేటాను ఇవ్వాల్సిందే

## భారత్‌కు ట్రంప్ సూచన




**వాషింగ్టన్, ఆగస్టు 8:** అమెరికా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలను శ్వేత జాతీయులకు అనుకూలంగా మార్చేందుకు ట్రంప్ సర్కారు మరో చర్య తీసుకొంది. తమ విద్యార్థుల జాతి, లింగ, టెస్ట్ స్కోర్, గ్రేడింగ్ పాయింట్ల సగటు వివరాలను ఇక నుంచి అక్కడి విద్యా శాఖ ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. కాలేజీలు మైనారిటీ విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయేమో గమనించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నారు. కాలేజీల్లో అడ్మిషన్ల సమయంలో జాతిని పరిగణనలోకి తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ 2023లో అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విద్యాసంస్థలు బైపాస్ చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఆ తీర్పును అమలు చేయాలంటూ ఎప్పటి నుంచో చేస్తున్న అమెరికాలోని సంప్రదాయవాదుల డిమాండ్‌కు అనుకూలంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. విద్యాసంస్థల్లో వామపక్ష భావజాల నియంత్రణకు తీసుకొంటున్న చర్యల్లో దీనిని భాగంగా చూస్తున్నారు.

జాతి ఆధారంగా అడ్మిషన్లు ఇచ్చే చాలా విశ్వవిద్యాలయాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపిస్తుందని అక్కడి న్యాయనిపుణులు చెబుతున్నారు. దీనిపై యేల్ లా స్కూల్ ప్రొఫెసర్ జస్టిస్ డ్రైవర్ మాట్లాడుతూ ట్రంప్ కార్యవర్గం విద్యావ్యవస్థపై చేస్తున్న దాడిలో ఇది మరో వినాశకర పరిణామం అని అభివర్ణించారు. అమెరికా విద్యా సంస్థల్లో బ్లాక్, బ్రౌన్ వర్ణ విద్యార్థులు చేరకుండా అణచివేసేందుకు తీసుకొంటున్న చర్యగా పేర్కొన్నారు. ఆ విద్యార్థులను చేర్చుకోకుండా యూనివర్సిటీలను బెదరించడానికి దీనిని ట్రంప్ కార్యవర్గం వాడుకొంటుందన్నారు. ఇప్పటికే అమెరికా కాలేజీలు, విశ్వవిద్యాలయాలపై ట్రంప్ తీసుకున్న చర్యలను కోర్టుల్లో సవాల్ చేశారు. హార్వర్డు విశ్వవిద్యాలయం కేసులో ఇదే జరిగింది. తాజాగా గురువారం జారీ చేసిన మార్గదర్శకాలతో అక్కడి విద్యాశాఖకు స్కూళ్లు, ఇతర విద్యా సంస్థలపై బలమైన నియంత్రణలను కట్టబెట్టినట్లయింది. ఇప్పటికే ఉన్నతవిద్య కోసం అక్కడి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ తీసుకొన్న అంతర్జాతీయ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సరికొత్త నిబంధనల కారణంగా వారికి వీసాల జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకొంది. దీంతో ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమైనా తాము తరగతులకు వెళ్లలేకపోతుండటంపై పలువురు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

# 80యేళ్ల వృద్ధుడిని వలలో వేసుకున్న సైబర్ చీటర్

## రెండేళ్లపాటు రూ.8.7కోట్లు కొల్లగొట్టిన వైనం



**ముంబయి, ఆగస్టు 8:** ఆన్‌లైన్‌లో అపరిచితుల పట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో చాటిచెప్పే దారుణ ఘటన ముంబయిలో వెలుగుచూసింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళల ప్రేమ, సానుభూతి వలలో చిక్కుకున్న 80 ఏళ్ల వృద్ధుడు ఏకంగా రూ.8.7 కోట్ల వరకు పోగొట్టుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు 734 ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా ఈ భారీ మోసం జరిగింది. చివరికి ఈ షాక్‌తో బాధితుడు ఆసు పత్రి పాలవ్వగా, ఆయనకు డిమెన్షియా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. 2023 ఏప్రిల్‌లో బాధితుడైన వృద్ధుడు ఫేస్‌బుక్‌లో షార్వి అనే మహిళకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపారు. అయితే ఆమె యాక్సెప్ట్ చేయలేదు. కొద్దిరోజుల తర్వాత ఆమె నుంచే రిక్వెస్ట్ రావడంతో ఆయన ఇంకేమీ ఆలోచించకుండా యాక్సెప్ట్ చేశారు. అక్కడి నుంచి వాట్సాప్‌లో వారి సంభాషణలు మొదలయ్యాయి. తాను భర్త నుంచి విడిపోయానని, పిల్లల ఆరోగ్యం బాగోలేదని నమ్మబలికిన షార్వి, నెమ్మదిగా డబ్బు అడగడం ప్రారంభించింది. ఆమె మాటలు నమ్మిన వృద్ధుడు డబ్బు పంపడం మొదలుపెట్టారు. కొద్ది రోజులకే, షార్వి స్నేహి తురాలినంటూ కవిత అనే మరో మహిళ రం గంలోకి దిగింది. అసభ్యకర సందేశాలు పం పుతూ ఆమె కూడా డబ్బు డిమాండ్ చేసింది. ఆ తర్వాత, షార్వి సోదరినంటూ డైనాజ్ అనే మహిళ పరిచయమైంది. షార్వి చనిపోయిందని, ఆసుపత్రి బిల్లులు కట్టాలని కోరింది. పాత వాట్సాప్ చాట్‌లను చూపించి బెదిరించి డబ్బు గుంజింది. డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. చివరగా, డైనాజ్ స్నేహితురాలి నంటూ జాస్మిన్ కూడా సహాయం పేరుతో డబ్బు వసూలు చేసింది. ఇలా 2023 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్య కాలంలో బాధితుడు మొత్తం 734 లావాదేవీల ద్వారా రూ. 8.7 కోట్లు బదిలీ చేశారు. తన ఆస్తంతా అయిపో వడంతో కోడలి దగ్గర రూ.2లక్షలు అప్పు చేశారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో తన కొడుకును రూ. 5లక్షలు అడిగారు. దాంతో ఆయనకు అనుమానం వచ్చింది. తండ్రిని నిలదీయగా అసలు విషయం బయటపడింది. తాను మోసపోయానని గ్రహించిన వృద్ధుడు తీవ్ర షాక్‌కు గురై ఆసుపత్రిలో చేరగా, వైద్యులు ఆయనకు డిమెన్షియా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై గత నెల 22న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నలుగురు మహిళల పాత్రల వెనుక ఉన్నది ఒక్కరే అయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## ప్రధాన తంత్రికే నేలమాళిగ తెరిచే నిర్ణయం..


**తిరువనంతపురం,ఆగస్టు 8:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేరళలోని శ్రీపద్మనాభస్వామి ఆలయంలో అత్యంత రహస్యమైన 'నేల మాళిగ' తెరిచే అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత తెరపైకి వచ్చిన ఈ వివాదంపై తుది నిర్ణయం తీసుకునే కీలక బాధ్యతను ఆలయ తంత్రికే (ప్రధాన పూజారి)అప్పగించారు. దీంతో ఈ మిస్టరీ వీడుతుందా లేదా అనే ఉత్కంఠ మళ్లీ మొదలైంది. తిరువనంతపురంలో ఆలయపాలక మండలి, సలహా మండలి సంయుక్త సమావేశం జరిగింది. ఈసమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధినెలమాళిగ అంశాన్ని ప్రస్తావించారు. 2020లోసుప్రీంకోర్టు దీనిపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని కమిటీలవిచక్షణకే వదిలేసినా, ఇప్పటివరకు ఎలాంటి ముందడుగుపడలేదని ఆయన గుర్తుచేశారు. అయితే, ఈ కీలక సమావేశానికి ఆలయతంత్రి గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో, కమిటీలు ఈ సున్నితమైన విషయంపై తుది నిర్ణయాన్ని తంత్రికే వదిలేశాయి.

## చేయని నేరానికి 20 యేళ్లు జైల్లో..



**మెల్‌బోర్న్, ఆగస్టు 8:** కడుపున పుట్టిన నలుగురు పిల్లలను కడతేర్చిందన్న నేరారోపణలపై 20 యేళ్లుగా జైలు జీవితం గడిపిన ఓ మహిళకు 2 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 11 కోట్లు) పరిహారంగా ఇచ్చేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ కేసులో ఆమె నిర్దోషి అని తేలడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. న్యూసౌత్ వేల్స్‌కు చెందిన కాథ్లీన్ ఫోల్బిగ్ (58)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. 1989-99 మధ్య కాలంలో ఆ నలుగురూ ఆకస్మికంగా మృతి చెందారు. కన్నతల్లే వారిని హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, పిల్లల పెంపకం, కష్టాలపై కాథ్లీన్ ఫోల్బిగ్ తన డైరీలో రాసుకున్న రాతలు, ఇతరత్రా సాక్ష్యాల ఆధారంగా 2003లో ఆమెకు 30 యేళ్ల జైలు శిక్ష విధించింది. తాను ఏ తప్పు చేయలేదని ఆమె న్యాయపోరాటం చేశారు. ఆమె పిల్లలు నలుగురూ సహజ కారణాలతోనే మరణించి ఉంటారని శాస్త్రీయ ఆధారాలు తేల్చాయి.

## కొత్త ఆదాయపు పన్ను బిల్లుపై విపక్షాల అభ్యంతరం




**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఆరు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఆదాయపు పన్ను నూతన బిల్లు 2025ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే ఈ బిల్లును తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపసం హరించుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని అప్‌డేట్ చేసి మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని నిర్ణ యించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీ నయ వర్గాలను ఉటంకిస్తూ కథనాలు వెల్లడిం చాయి. ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లును ఈ యేడాది ఫిబ్రవరి 13న కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించారు. ఈ కమిటీ దీన్ని అధ్యయనం చేసి జులై 21న తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది.

# వెనిజులా అధ్యక్షుడిని పట్టిస్తే రూ.430కోట్లు రివార్డు!




**వాషింగ్టన్, ఆగస్టు 8:** అమెరికాలో డ్రగ్స్ వ్యాప్తిని, హింసను ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోపై అగ్రరాజ్యం మండిపడుతోంది. ఈ ఆరోపణలతో మదురోను అరెస్టు చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే మదురో అరెస్టుకు సహకరిస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు 430 కోట్లు ముట్టజెబుతామంటూ సంచలన ప్రకటన చేసింది. డొనాల్డ్ ట్రంప్ ఫస్ట్ టర్మ్ లో ఈ నజరానా 15 మిలియన్ డాలర్లు ఉండగా జో బైడెన్ ప్రెసిడెంట్ అయ్యాక ఈ రివార్డును 25 మిలియన్ డాలర్లకు పెంచారు. తాజాగా ఈ మొత్తాన్ని 50 మిలియన్ డాలర్లకు పెంచుతున్నట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. 'అమెరికాలో డ్రగ్స్ వ్యాప్తికి, హింసను ప్రేరేపించేందుకు నికోలస్ మదురో ట్రెన్ డె అరాగువా, సినలో, కార్టల్ ఆఫ్ ది సన్స్ వంటి వాటిని వినియోగిస్తున్నారు' అని పామ్ బాండీ ఆరోపించారు. ఇప్పటివరకు నికోలస్ మదురోకు సంబంధించిన 7 టన్నుల కొకైన్ తో పాటు ఆయన సన్నిహితులకు సంబంధించిన 23 టన్నుల కొకైన్‌ను డ్రగ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ సీజ్ చేసిందని బాండీ వెల్లడించారు. వెనెజువెలా, మెక్సికోలలోని డ్రగ్ మాఫియాకు ఇదే ప్రధాన ఆదాయ వనరుగా మారిందన్నారు. ఫెంటెనిల్ స్మగ్లింగ్‌తో కూడా మదురోకు సంబంధాలున్నాయని బాండీ పేర్కొన్నారు. ఇప్పటికే 2020 మార్చిలో ఆయనపై దక్షిణ న్యూయార్క్ డిస్ట్రిక్ట్‌లో కేసులు నమోదైనట్లు చెప్పారు. కాగా, మదురోకు సంబంధించిన ప్రైవేట్ జెట్‌లు, తొమ్మిది వాహనాలు సహా 700మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ సీజ్ చేసింది.

# కాంగ్రెస్‌వన్నీ ఓటు బ్యాంకు రాజకీయాలే: అమిత్‌షా

**సీతామర్హి (బీహార్), ఆగస్టు 8 :** బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను వ్యతిరేకించడాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. కొన్ని పార్టీలు దేశప్రయోజనాల్ని పక్కన పెట్టి, ఓటు బ్యాంకు పాలిటిక్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఇదంతా జరుగుతోందని ఆయన విమర్శించారు. శుక్రవారం అమిత్ షా బీహార్‌లో పర్యటించారు. సీతామర్హిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ బీహార్‌లో ప్రతిపక్ష పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. చొరబాటుదారులు వారి ఓటు బ్యాంకు అని అందుకే ప్రతిపక్షపార్టీలు సర్‌ని వ్యతిరేకిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. ఈ ఎస్ఐఆర్ అనే ప్రక్రియ దేశంలో మొదటి సారి జరగడం లేదని, ఈ విధానాన్ని మాజీ ప్రధాన మంత్రి



జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారని కేంద్ర మంత్రి చెప్పారు. బీహార్‌లో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. నేను ఇక్కడికి వచ్చేముందు నన్ను విలేకర్లు సర్ గురించి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. అయితే, దీని గురించి నేను ప్రజలను అడగాలనుకుంటున్నాను. మనం ఓటర్ల జాబితా నుండి వలసదారులను తొలగించకూడదా అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ ఎవరిని రక్షించాలనుకుంటున్నారు బయటి నుండి వచ్చి బీహార్ ప్రజల ఉద్యోగాలు లాక్కునే బంగ్లాదేశీయులను మీరు రక్షించాలనుకుంటున్నారా, అంటూ అమిత్ షా ఆర్జేడీ టార్గెట్‌గా ప్రశ్నలు సంధించారు. అటు, కాంగ్రెస్ పైనా అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# తమిళనాడుకు సొంత విద్యావిధానం

## ఆవిష్కరించిన సిఎం స్టాలిన్!



**చెన్నై, ఆగస్టు 8:** కేంద్ర ప్రభుత్వం, తమిళనాడు మధ్య హిందీ వివాదం కొనసాగుతున్న వేళ ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం తమ ప్రజల కోసం సొంతంగా రాష్ట్ర విద్యా విధానాన్ని ఆవిష్కరించారు. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానానికి కౌంటర్‌గా ఆయన ఈ నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. చెన్నైలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో స్టాలిన్ ఈ రాష్ట్ర విద్యావిధానాన్ని ఆవిష్కరించారు. కేంద్రం చెబుతోన్న త్రిభాషా సూత్రాన్ని తోసిపుచ్చుతూ ద్విభాషా అజెండాతో దీన్ని రూపొందించారు. ఈ ముసాయిదా పాలసీని రూపొందించేందుకు 2022లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మురుగేశన్ నేతృత్వంలో 14 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గతేడాది తమ ప్రతిపాదనలను సిఎంకు అందించింది. దాన్ని పరిశీలించిన స్టాలిన్ సర్కార్ తాజాగా నూతన విద్యావిధా నాన్ని ఆవిష్కరించింది. మాతృభాషతో పాటు ఆంగ్లం, కృత్రిమ మేధ, సైన్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఈ స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించారు. అంతేకాదు నీట్ లాంటి ప్రవేశ పరీక్షలను తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్త విద్యావిధానంలో ప్రవేశపరీక్షకు బదులుగా మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఇవ్వాలని నిర్ణయించారు. 11, 12 తరగతుల మార్కుల ఆధారంగా ఆర్ట్స్, సైన్స్ వంటి కోర్సుల్లో యూజి ప్రవేశాలు కల్పించేలా కొత్త పాలసీలో ప్రతిపాదనలు చేశారు. త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరి చేసే జాతీయ విద్యావిధానం అమలు విషయంలో కొంతకాలంగా కేంద్రం, తమిళనాడుల మధ్య వివాదం కొనసాగుతోంది. హిందీ భాషను తమపై బలవంతంగా రుద్దాలని కేంద్రం ప్రయత్నిస్తోందని స్టాలిన్ సర్కారు ఆరోపిస్తోంది. జాతీయ విద్యావిధానాన్ని అమలుచేయడం లేదన్న కారణంతో సమగ్ర శిక్ష పథకం కింద రాష్ట్రానికి అందాల్సిన రూ.2,152 కోట్ల నిధులను కేంద్రం మంజూరుచేయడం లేదని ఆరోపణలు చేసింది.

# ట్రంప్‌ను ఎలా డీల్‌చేయాలో మోడీకి సలహా ఇస్తా: నెతన్యాహు



**జెరూసలెం,ఆగస్టు 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఎలా వ్యవహరించాలనే అంశంపై భారత ప్రధాని నరేంద్ర మోదీకి కొన్ని సూచనలు ఇవ్వగలనని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఇద్దరూ తనకు అత్యంత సన్నిహితులని పేర్కొంటూ, ఈ విషయంలో తాను సహాయపడగలనని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న భారతజర్నలిస్టుల బృందంతో మాట్లాడుతూ నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఇద్దరూ నాకు మంచి స్నేహితులు. ట్రంప్‌తో డీల్ చేసే విషయంలో మోదీకి కొన్ని సలహాలు ఇవ్వాలనుకుంటున్నాను. అయితే, ఆ విషయాలను నేను బహిరంగంగా కాకుండా పర్సనల్ గా చెబుతాను అని స్పష్టం చేశారు. త్వరలోనే తాను భారత్‌లో పర్యటించాలని ఆశిస్తున్నట్లు కూడా నెతన్యాహు తన మనసులోని మాటను బయట పెట్టారు.

# డిస్కమ్‌లకు రూ.1.75 లక్షల కోట్లు చెల్లించండి

### రాష్ట్ర డిస్కంలకు రూ.15 వేల కోట్ల బాకీ

### నాలుగేళ్లలో బకాయిలు పూర్తి చేయాలని సుప్రీం తీర్పు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల(డిస్కమ్‌ల)కు పెండింగ్ బకాయిలను చెల్లించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. విద్యుత్ సరఫరా నిమిత్తం పంపిణీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు రూ.1.75 లక్షల కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, వాటిని నాలుగేళ్లలోగా చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే 2024 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత పెండింగ్ పడిన బాకీలను మూడేళ్లలోపు కట్టాలని తేల్చిచెప్పింది. విద్యుత్ సరఫరాకు అయ్యే వ్యయంపై వార్షిక ఆదాయ అవసరాలు దాఖలు చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయి వ్యయాన్ని వినియోగదారుల నుంచి రాబట్టుకోవడానికి విద్యుత్ నియంత్రణ మండళ్లు అనుమతి ఇవ్వట్లేదని పిటీషన్లు సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేశారు. ఇందువల్ల బకాయిల వసూళ్ల నిమిత్తం విద్యుత్ అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వాలు బకాయిలు విడుదల చేయడం లేదంటూ దాఖలైన కేసును విచారించి సుప్రీం ఈమేరకు తీర్పు వెలువరించింది.

దీంతో తెలంగాణ సర్కార్‌రాష్ట్ర డిస్కంలైన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల రెండింటికి రూ.14,928 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ఇచ్చిన హామీలో భాగంగా ట్రూఅప్ చార్జీలపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో 2016-17 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకూ అంచనా వేసిన విద్యుత్ వినియోగం వ్యయం కన్నా రూ.12,550 కోట్ల వాస్తవ వ్యయం ఎక్కువగా ఉందని నియంత్రణ కమిషన్ భావించింది. ఆ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయాలని దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయించగా, గత ప్రభుత్వం జోక్యం చేసుకొని, ఐదు సమాన వాయిదాల్లో ఈ మొత్తాన్ని చెల్లిస్తామని విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు హామీ ఇచ్చింది. అయితే గత ప్రభుత్వం దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఆ బకాయిలతో పాటు, ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో మరో రూ.2,378 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం బకాయిలు రూ.14,928 కోట్లను తామే చెల్లిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా వాటిని చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచింది. ఈ వివరాలను ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడించింది.



## క్రీడా పాఠశాలలు పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలి

### క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్ష

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, అకాడమీలు పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఇక వ్యక్తిగత విభాగంలోనూ మూడు నెలలకొకసారి విద్యార్థుల ఫలితాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి ఆయన స్పోర్ట్స్ స్కూళ్లు, అకాడమీలలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లు, అకాడమీల పనితీరు, సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరగాలని, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్ స్కూళ్లలో ఆధునిక క్రీడా శిక్షణ, విద్యలో మెరుగుదల సాధించాలని శ్రీహరి పేర్కొన్నారు. ఆదేవిధంగా హకీంపేట్‌లో తక్షణ మరమ్మతులు, అన్ని స్కూళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ అథారిటీ అకాడమీల పనితీరు మెరుగుపరచి క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలిగించే కార్యక్రమాలు చేపట్టాలి. స్పోర్ట్స్ స్కూల్, అకాడమీల్లో త్రైమాసికంగా ప్రోగ్రెస్ టెస్టులు నిర్వహించి, కంప్యూటరైజ్డ్ రిపోర్టులు విద్యార్థుల తల్లిదండ్రు లకు పంపించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే వారిని ఉపేక్షి ంచమని మంత్రి శ్రీహరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌తోపాటు హకింపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టి. మమత, డిప్యూటీ డైరెక్టర్లు జి చంద్రరెడ్డి జి. రవీందర్, డా. రవిశంకర్ పల్లెల, ఎస్.ఎం. బాషా, జి. అశోక్‌కుమార్, పి.సందీప్‌కుమార్, సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులు

### 10 ఏర్పాటుకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్

### త్వరలో తుది ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** తెలంగాణలోని రైతులు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మరింత వెసులుబాటు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి త్వరలో తుది ఉత్తర్వులను జారీ చేయనుంది. ఈ కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులను రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు, పెద్దకొత్తపల్లి. వనపర్తి జిల్లాలోని పానగల్, వీపనగండ్ల, ఖిలాఘన్‌పూర్, గోపాల్‌పేట. పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి. నల్గొండ జిల్లాలోని దామరచర్ల. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని మత్కేపల్లి ఉన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 197 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 10 మార్కెట్ యార్డులు ఏర్పాటు చేస్తూ సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ కొత్త వ్యవసాయ మార్కెట్లు యార్డులు అందుబాటులోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా వాటి సంఖ్య 207కి చేరనుంది. ఈ కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో స్థలాలను సైతం గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. వీటి ఏర్పాటుకు గాను ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కానందున ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటితోపాటు మరో ఐదు మార్కెట్ యార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

## అక్కను వేధిస్తున్నాడని బావను రైలు కిందకుతోసి హత్య

**హైదరాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** మద్యం మత్తులో అక్కను వేధిస్తున్నాడని బావను రైలు కిందకు తోసేసి హత్య చేసిన ఘటన ఇది. గురువారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్లో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్ వివరాలు వెల్లడించారు. పాత మలక్పేటకు చెందిన సిరాజ్(29) యాకుత్పురకు చెందిన సానియా(23)ను నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకుని అత్తారింటో ఉంటున్నాడు. మద్యం తాగి తరచూ భార్యను కొట్టేవాడు. ఈ నెల 2న ఓల్డ్ మలక్‌పేటలోని తమ ఇంటికి సిరాజ్ దంపతులు వచ్చారు. అక్కడా వారి ద్దరూ మరోసారి గొడవపడ్డారు. అనంతరం బావ కొడుతు న్నాడంటూ.. తన తమ్ముడు సయ్యద్ జమీర్(21)కు సానియా ఫోన్ చేసింది. స్నేహితుడైన ఎండీ జునైద్(23)తో కలిసి రాత్రి అక్కడికి జమీర్ చేరుకున్నాడు. అర్ధరాత్రి ఇద్దరూ సిరాజ్ను బైక్‌పై మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ బావ, బావమరిది మధ్య ఘర్షణ జరిగింది. ఆగ్రహించిన జమీర్.. సిరాజ్‌ను అటుగా వెళ్తున్న రైలు కిందకు తోయగా.. అక్కడికక్కడే మృతి చెందాడు. స్టేషన్ ప్రాంగణంలోని నిఘా కెమెరాలతో సయ్యద్ జమీర్, అతనికి సహకరించిన జునైద్ను గురువారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఎప్‌సెట్ కౌన్సిలింగ్ అవకతవకలపై ఆందోళన వ్యక్తంచేస్తూ ప్రతులను దగ్ధం చేస్తున్న బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు

## ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో బాలికల సీట్ల కేటాయింపులో అవకతవకలు

### బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో ఉన్న విద్యా శాఖలో అవినీతి, అవకతకలు జరుగుతున్నాయని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్ర ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌లో జరిగిన సీట్ల తారుమారు, అవకతవకల జాబితాను విద్యార్థులతో కలిసి శుక్రవారం కాచిగూడలో ఆయన తగులబెట్టారు. ఇంజినీరింగ్ సీట్లలో జరిగిన అవకతవకలపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అవకతవకలను, తప్పులను సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ నుండి విద్యార్థుల సీట్ల జాబితాను తొలగించారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఎప్‌సెట్ అధికారిక వెబ్‌సైట్ నుండి కాలేజీల వారీగా అడ్మిషన్ల వివరాలు, విద్యార్థులకు కేటాయించిన సీట్ల కేటగిరీల వివరాలను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. 'ఓపెన్ గర్ల్స్ కోటా సీట్లను అబ్బాయిలకు కట్టబెట్టిన అధికారులు, ఇప్పుడు తమ తప్పులను దాచిపెట్టేందుకు సీట్ల కేటగిరీల వివరాలను మాయం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన మంత్రి సీతక్క శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని యావత్ ప్రపంచం ఆగస్టు 9న ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంగా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క రాష్ట్ర ఆదివాసీ గిరిజన సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీలు ఈ దేశంలో అత్యంత పురాతన జీవన సాంకేతికతను, విలువలతో కూడిన జీవన ధోరణిని కొనసా గిస్తున్నారన్నారు. ప్రకృతితో మమేకమైన జీవనశైలి, సమూహ జీవనం, సాంస్కృతిక వైవిధ్యం ఆదివాసీల ప్రత్యేకత అని కొనియాడారు. వారి చరిత్రను, వారసత్వాన్ని కాపాడు కోవడమే కాదు, వారిని అన్ని రంగాల్లో ముందుకు నడిపించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సవా ళ్లను పరిష్కరించేందుకు విద్య, వైద్యం, ఉపాధి, జీవనోపాధిలో సాధికారత సాధించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ, ప్రతి రంగంలో ఆదివాసీలను ముందుకు తీసుకెళ్లేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# బిసిల నోటికాడి బుక్కను కొట్టొద్దు

### మతం పేరిట రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

### వ్యవసాయ వర్సిటీలో బిసి సెల్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 8, ప్రభాతవార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేన్లు తీర్మానం చేశాం. అందులో మత పరమైన రిజర్వేషకు స్థానం లేదని రాష్ట్ర బలహీన వర్గాల సంక్షేమ, రవాణ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీల నోటి కాడి బుక్కలా రిజర్వేషన్ ఫలాలను కొట్టేయవద్దని ఆయన రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యా లయం పరిపాలన భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ సెల్‌ను రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్యలతో కలసి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభి చారు. అనంతరం న్యూఅకాడమిక్ బ్లాక్‌లో సెమినార్ హాల్‌ను మంత్రి ప్రారంభించి మంత్రి మాట్లాడుతూ... 42 శాతం బీసీలు ఒక్క గొంతుక కావాలని పిలుపునిచ్చారు.

ఇక్కడ అరవై సంవత్స రాలుగా బీసీ సెల్ లేకపోవడం బాధాకర మన్నా రు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటుకు అనుమతి వ్వాలని కోరిన గత పాలకులు మోకాల డ్డారని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3, 4 ప్రకారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభు త్వం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపిం దన్నారు. మతం పేరుతో రిజ ర్వేషన్లను అడ్డుకోవద్దని అన్ని రాకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

**దేశం పుష్పగుచ్ఛం లాంటిది: బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్**

దేశం రంగు, రంగుల పూలతో కూడిన పుష్పగుచ్చం లాంటిదని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. అదే మాదిరి కుల, మత, వర్గాలు, ప్రాతీయత మన దేశంతో ముడిపడి ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలో జనాభ పరంగా అత్యధిక శాతం ఉన్నది బీసీలు అని ఆయన చెప్పారు. జాతీయ బీసీ కమీషన్ గుర్తించి 130 కులాలలో ఇప్పటికి 40 కులాల జాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రధాని రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి : ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్**

రాష్ట్ర ప్రజలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెబినేట్ తీర్మాణించిన బిల్లుకు ఒక బీసీ బిడ్డగా ప్రధాన మంత్రి కేంద్ర ప్రభుత్వ ఆమోదం తెలపాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కోరారు. పట్టుదల గల నాయకుడిగా ఇచ్చిన మాట ప్రకారం సిఎం రేవంత్ రెడ్డి బీసీల పక్షాన నిలిచారని గుర్తు చేశారు.

## కేంద్రమంత్రి సంజయ్ ప్రకటనలు హద్దులు మీరాయి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 8:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ శుక్రవారం సిట్ ఎదుట విచారణకు హాజరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన విచారణకు వెళ్లే ముందు.. వచ్చిన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ విమర్శలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కౌంటర్ ఇచ్చారు. ఇంటెలిజెన్స్ విభాగంపై సంజయ్‌కు కనీస పరిజ్ఞానం లేదని కెటిఆర్ మండిపడ్డారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా పని చేస్తు న్నా.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంతో ఆయన చేస్తున్న ప్రకటనలు హద్దులు మీరాయని ఆరోపించారు. చౌకబారు రాజకీయాలతో ఆయన మరింత దిగజారారని రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారని ఎక్స్ వేదికగా కెటిఆర్ పోస్ట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే వెంటనే ఆధారాలతో నిరూ పించాలని.. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పాలని సవాల్ విసిరారు. లేదంటే లీగల్ నోటీసులు పంపుతామని హెచ్చరించారు.

## సిఎస్ఇఎం టిప్‌లైన్ కేసుల విచారణాధికారులకు శిక్షణ

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** బాలలపై జరిగే లైంగిక వేధింపులు, లైంగిక దాడుల కేసులతో పాటు బూతు బొమ్మలతో బాలలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలపై నమోదయ్యే కేసులను విచారించే సిఎస్ఇఎం (చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లోయిటేషన్ అండ్ అబ్యూస్ మెటీరియల్) విచారణాధికారులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) నిర్వహించిన వారం రోజుల శిక్షణ ముగిసింది. కమాండ్ కంట్రోల్‌లోని టిజిసిఎస్‌బి కార్యాలయంలో గల సైబర్ అకాడమిలో ఈ నెల ఒకటవ తేదీన మొదలైన ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ ఈ శిక్షణలో టిజిసిఎస్‌బితో పాటు ఇండియన్ చైల్డ్ ప్రొటెక్షన్ కలిసి నిర్వహించాయని, శిక్షణలో భాగంగా విచారణాధికారులకు అనేక అంశాలపై తర్ఫీదు ఇచ్చామని తెలిపారు. అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ అనే సంస్థ నుంచి వచ్చే సైబర్ టిప్‌లైన్ నివేదికల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, కేసుల క్లిష్టత దృష్ట్యా శిక్షణ నిర్వహించామని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ పోలీసు విభాగం 561 టిప్‌లైన్‌ల ఆధారంగా 510 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిందని ఆమె వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 పోలీసు విభాగాలకు చెందిన 151 మంది విచారణాధికారులు శిక్షణలో పాల్గొన్నారని, శిక్షణలో భాగంగా 204 సైబర్ టిప్‌లైన్ ఫైళ్లను సమీక్షించి కేసుల నిర్వహణపై అనుభవం పొందారని ఆమె తెలిపారు. దీంతో పాటు ఈ శిక్షణలో చట్టపరమైన మాడ్యూళ్లు. ఒసింట్, ఫోరెన్సిక్ టూల్స్, సెర్చ్ అండ్ సిజ్ పద్ధతులు, సోషల్ మీడియా ట్రేసింగ్, అసెస్‌మెంట్ అండ్ ఫీడ్ బ్యాక్ అంశాలపైనా వీరికి నిపుణులైన వారి చేత తర్ఫీదును ఇప్పించామని శిఖా గోయల్ తెలిపారు. బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణకు టిజిసిఎస్‌బి చేబడుతున్న నిరంతర కృషిలో ఇది ఒక భాగమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా ఎన్నికల కమిషన్

### సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 8, ప్రభాతవార్త:** మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా ఎన్నికల కమిషన్ (ఈసీ) పనిచేస్తున్నదని సీపీఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్ వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను వ్యతిరేకిస్తూ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన నిరసన సభలో వీరయ్య మాట్లాడుతూ బీహార్లో అక్రమంగా, అప్రజాస్వామికంగా 62లక్షల ఓటర్లను రకరకాల పేరుతో తొలగించే ప్రక్రియకు ఈసీ ఒడిగట్టిందని విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(సర్) పేరుతో ఒక్క నెలలోనే ఇన్ని ఓట్లను తొలగించిందని తెలిపారు. నిరుపేదలు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ పేదలను ఓటర్ల లిస్టులో నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి ఓట్లు పడవని భావించిన ప్రతీ చోటా ఏదో ఒక పేరుతో వాళ్ల ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఇది అప్రజాస్వామిక చర్య అనీ, అందుకే సీపీఐ(ఎం) దీన్ని వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ప్రతి పక్ష పార్టీలన్నీ కూడా వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. అయినా మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా వ్యవహరిస్తూ, ఊడిగం చేస్తున్న ఈసీ ఉలుకూ పలుకు లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇదోక కుట్ర పూరితమైన ప్రక్రియ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన మోడీ.. ప్రధాన మంత్రి స్థానంలో ఉన్నారనే విష యాన్ని అనేక ఆధారాలు బట్టబయలు చేస్తు న్నాయని వివరించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈసీ బీజేపీకి తొత్తుగా మారటం వల్ల, మోడీకి ఏజెంటుగా వ్యవహరించటం వల్ల ఐదు కోట్ల ఓట్లు పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు అదనంగా ఉన్నాయని తెలిపారు. ఇది ఎన్నికల కమిషన్ ప్రకటించిన లెక్కేనని గుర్తు చేశారు. బీజేపీ అనుసరిస్తున్న పద్దతులను పరిశీలిస్తే దేశంలో ఒక భయానక పరిస్థితులు తలెత్తుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని కేవలం బీహార్కు సంబంధించిన విషయంగానే చూడొద్దని సూచించారు. రానున్న కాలం గడ్డు కాలంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలకు, ప్రజాస్వామిక వాదులపైనా ఉందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం వెంకటేశ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, రాష్ట్రకమిటీ సభ్యులు ఎంవీ రమణ, పి.ఆశయ్య, భూపాల్, బాబూరావు, నగర నాయకులు ఎం శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ రావు, మహేందర్, ఎం. దశరథ్, ఆర్ వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా నాయకులు చంద్రమోహన్, కవిత, జగదీశ్ తదితరులు పాల్గన్నారు.




బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

## 11 నుంచి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

### రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాఖీ పండగ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా రాఖీ పండగను సంతోషంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. కష్టసుఖాల్లో తోడుండాలని రాఖీ ద్వారా ఆడబిడ్డలు తమ సోదరులను కోరుతారని, కుటుంబ బంధాలకు తోబుట్టువుల ప్రేమ, అప్యాయతలకు సాక్ష్యంగా నిలిచే ఈ పండుగ ఎంతో విశిష్టమైనదన్నారు. రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి ప్రత్యేకం గా ఒక విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న రాష్ట్రవ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయ బోతున్నామని, ఈ విషయాన్ని రాఖీ కట్టే సమయంలో తమ అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు తెలియజేయాలన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఈ మాత్రలు వేయించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్నారుల పేగుల్లో ఉండే నులిపురుగులను నివారించి, రక్తహీనత ను అధగమించేందుకు, రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు ఈ మాత్రలు ఉపయోగపడుతాయని మంత్రి వివరించారు.

## సర్కార్ రుణాల రీషెడ్యూల్

### రిజర్వు బ్యాంక్ గ్రీన్‌సిగ్నల్

### ప్రభుత్వానికి రూ. 2 వేల కోట్లు ఆదా

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వాలు తీసుకున్న వడ్డీ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ అంగీకరించింది. గత ప్రభుత్వంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ హయంలో తీసుకున్న సుమారు రూ. 25 వేల కోట్ల కొత్త అప్పును కూడా తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల్లో చెల్లించేందుకు రిజర్వు బ్యాంక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్ర సర్కార్‌కు ఏటా దాదాపు రూ. 2 వేల కోట్లు ఆదా కానున్నాయని ఆర్థిక శాఖ అధికవర్గాలు వెల్లడించాయి. గత ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల పేరుతో ప్రైవేటు ఫైనాన్సింగ్ సంస్థల ద్వారా అధిక వడ్డీలకు రుణాలు తీసుకొచ్చింది. వీటన్నింటిని పదేళ్ల కాలపరిమితిలో చెల్లించే ప్రాతిపదికన రుణాలు సేకరించింది.

సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ ద్వారా తీసుకునే రుణాలకు 7 నుంచి 7.5 శాతం లోపే ఉంటాయి. వాటిని 25 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు చెల్లించవచ్చు. కానీ ప్రైవేటు ఫైనాన్సింగ్ సంస్థల దగ్గర చేసిన అప్పులకు 11 శాతం వడ్డీ, 10 ఏళ్లలో కచ్చితంగా చెల్లించాల్సి ఉంది. ఇది సర్కారుకు పెద్ద భారంగా మారింది. అందుకే వీటిని రీ షెడ్యూల్ చేయాలని తెలంగాణ సర్కార్ పలుసార్లు రిజర్వ్ బ్యాంక్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధ్యయనం చేసిన సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ పాత అప్పులను రీ షెడ్యూల్ చేసేందుకు అంగీకారం తెలిపింది.




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు, మధుసూదన్‌రావు, సత్యనారాయణ తదితరులు

## జూబ్లీహిల్స్ టికెట్ 'కమ్మ' సామాజిక వర్గానికే కేటాయించాలి

### కమ్మ రాజకీయ ఐక్యవేదిక అధ్యక్షుడు గోపాలం విద్యాసాగర్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికే జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని తెలంగాణ కమ్మ రాజకీయ ఐక్యవేదిక అధ్యక్షులు గోపాలం విద్యా సాగర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కమ్మ సామాజికవర్గం 60వేలకు పైగా ఉంటుందని కమ్మసామాజిక వర్గం ఎటువైపు ఉంటే ఆపార్టీనే విజయం సాధిస్తుందన్నారు. ఎన్టీఆర్ టిడిపి పార్టీ పెట్టాక అందరిని ఆదారించారని ఎస్సీ, ఎస్టీ, బీసీలను ప్రోత్సహించారన్నారు. కానీ తెలంగాణ ఏర్పడిన తరువాత కమ్మలకు తగిన ప్రాధాన్యత దక్కలేదన్నారు. దాదాపు 35 నియోజకర్గాల్లో తమ సామాజిక వర్గం ప్రభావం ఉంటుందని ఇంతకు ముందు ఇక్కడ ఎమ్మెల్యేగా చేసిన మాగంటి గోపినాథ్ కూడా తమ సామాజిక వర్గమేనని తెలిపారు. జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే టికెట్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇచ్చినట్లయితే గెలిపించుకునే బాధ్యత తమదని.. కావున కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు కమ్మసామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు అన్నే సత్యనారాయణ, రామకృష్ణ, వివిఎస్ఎన్ చౌదరి, బోడేపూడి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రోకలిబండతో తండ్రిని చంపిన తనయుడు

**నవాబుపేట, ఆగస్టు 8, ప్రభాతవార్త :** క్షణికావేశంలో రోకలిబండతో కన్నతండ్రిని హత్య చేసిన ఘటన మండల పరిధిలోని కామారంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని కామారం గ్రామానికి చెందిన చిలుక కృష్ణయ్య (50) కొన్ని నెలల క్రితం తన భార్యను హత్యచేసి జైలు జీవితం గడిపి ఇటీవలే గ్రామానికి తిరిగివచ్చాడు. కృష్ణయ్య తన కుమారుడు చిలుక వెంకటేష్ పేరు మీదున్న 30 గుంటల భూమిని తన పేరుపై చేయించాలని తరచూ కొడుకుతో గొడవ పెట్టుకునేవాడు. శుక్రవారం కూడా భూమి విషయంలో తండ్రి కృష్ణయ్య కొడుకు వెంకటేష్‌తో గొడవ పెట్టుకుని కొడుకుపై ఆవేశంతో చేయిచేసుకోగా ఆవేశంతో నిందితుడు అందుబాటులో ఉన్న రోకలిబండను తీసుకొని కొట్టగా తలకు తీవ్రగాయాలై కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు వెంకటేష్ తన పెద్దనాన్నలైన చెన్నయ్య, సత్యనారాయణలకు తాను నాన్నను హత్య చేశానని చెప్పి అక్కడి నుండి పరారయ్యారు. మృతుడి సోదరుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎం.విక్రమ్ తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఆధార్ ఆధారిత చెల్లింపులు

### హౌజింగ్ కార్పొరేషన్ ఎండి గౌతం

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు విడుదల చేసే బిల్లుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇకపై ఈ చెల్లింపులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను (ఆధార్ పేమెంట్ బిల్ సిస్టం) ద్వారా నిర్వహించనున్నామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. విడతల వారీగా విడుదల చేస్తున్న బిల్లులు సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూడటంలో ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ నిర్ణయంతో లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరగడం లేదన్న ఫిర్యాదులు గణనీయంగా తగ్గిపోతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు,వారి ఇళ్ల నిర్మాణపు దశనుబట్టి ఆన్ లైన్ ద్వారానే విడతల వారీగా బిల్లుల రూపంలో మొత్తంగా రూ.5 లక్షలను అందచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఇంతవరకు సుమారు 590 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు అందచేశారు. ఇటీవలి కాలంలో లబ్ధిదారుల నుంచి తమకు విడుదలైన బిల్లుల మొత్తాలు ఖాతాల్లో జమ కావడం లేదన్న ఫిర్యాదులు రావడంతో ఈ అంశంపై లోతుగా పరిశీలించారు.

లబ్ధిదారుల బ్యాంకు ఎక్కౌంట్ల వివరాల నమోదులో పొరపాట్లు, ఐఎఫ్ సి కోడ్ లలో తప్పులు, వినియోగంలో లేని అక్కౌంట్ నంబర్లు, మొదలైన కారణాలతో ఇబ్బందులు వస్తున్నాయన్న అంశాన్ని గమనించారు. ఈ సమస్యను పరిష్క రించడంతో పాటు, ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్న లక్ష్యంతోఆధార్ ఆధారితంగా చెల్లింపులు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇందులో భాగంగా సుమారు 9100 మంది లబ్ధిదారులకు ఆధార్ నెంబర్ ఆధారంగా చెల్లింపులు చేయగా, వాటిలో సుమారు 9000 వరకు ఎటువంటి సమస్య లేకుండా జరిగినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగవంతంగానూ, సమస్యలులేకుండాను కొనసాగేలా చూడటానికి ఇకపై అన్న చెల్లింపులను ఆధార్ అనుసంధాన ప్రక్రియ ద్వారానే చెప్పట్టనున్నామని మేనేజింగ్ డైరక్టర్ వి.పి. గౌతం పేర్కొన్నారు.

# ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు రూ.30వేల కోట్ల సాయం

### ఉజ్వల లబ్ధిదారుల సబ్సిడీ కింద రూ.12 వేల కోట్లు కేటాయింపు

### మరక్కణం నుంచి పుదుచ్చేరి హైవేరోడ్డు విస్తరణకు రూ.2,157కోట్లు

### ప్రధాని మోడీ అధ్యక్షతన కేబినెట్ కమిటీ నిర్ణయాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన వినియోగదారులకు సబ్సిడీరూపంలో మరో ఏడాదిపాటు ఇచ్చేందుకుగాను రూ.12వేల కోట్లు కేటాయించేందుకు కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు, ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజిలకింద అస్సాం, త్రిపుర రాష్ట్రాలకుగాను రూ.4250 కోట్లరూపాయల ప్రత్యేక ప్యాకేజికి ఆమోదం లభించింది. సాంకేతిక విద్యలో కొత్తగా ప్రవేశపెట్టిన మెరిట్ స్కీంకు రూ.4,200 కోట్లు కేటాయించే ప్రతిపాదనలకు మోడీ కేబినెట్ ఆమోదం తెలిపిందూచ అదేవిధంగా ప్రభుత్వ రంగంలోని ఆయిల్మార్కెటింగ్కంపెనీలకు దేశీయ ఎల్పీజీ సిలిండర్లసరఫరా పరంగా ఎదురవుతున్న నష్టాలు సబ్సిడీ భరించేందుకు రూ.30వేల కోట్లు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదించింది. అదేవిధంగా హైబ్రిడ్ యాన్యుయిటీ మోడ్లో తమిళనాడులోని మరక్కణం, పుదుచ్చేరి ఎన్హెచ్332ఏ రోడ్డును నాలుగులేన్ల రహదారిగా వృద్ధిచేసేందుకు రూ.2157 కోట్ల ప్రతిపాదనలకు కూడా కేబినెట్ గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. అస్సాంలోని ఆదివాసి గ్రూపులతో జరిగిన ఒప్పందాలమేరకు వారి సంక్షేమం అభివృద్ధికి 500 కోట్లు కేటాయించారు. నార్త్కేచర్హిల్స్ స్వయం ప్రతిపత్తి మండలికి కూడా రూ.500 కోట్లు కేటా యింపులు జరిపారు. ఉల్ఫా గ్రూపులతో జరిగిన ఒప్పందం మేరకు మౌలికవసరుల అభివృద్ధికోసం రూ.3వేల కోట్లు కేబినెట్లో ప్రతిపాదించారు. త్రిపుర లోని గిరిజనులకోసం 250 కోట్లు నిధులు వెచ్చిం చేందుకు నిర్ణయించారు. అలాగేసాంకేతిక విద్యా శాఖ పరిధిలోని మెరిట్ స్కీంను 275 విద్యాసంస్థల్లో అమలు చేయాలని నిర్ణయిం చారు. 175 ఇంజినీరింగ్, 100 పాలి టెక్నిక్లలో ఈ స్కీం అమలవుతోంది. ఇందుకోసం కేంద్రం ఐదేళ్లకాలానికిగాను 4200 కోట్లు కేటాయించింది. బయటినుంచి వచ్చే నిధులు అంటే ప్రపంచబ్యాంకు రుణం కింద రూ.2100 కోట్లు కూడా ఈ మొత్తంలో ఉంది. ప్రభుత్వరంగంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకెదురయ్యే నష్టాలన భర్తీచేసేందుకుగాను మూడు కంపెనీలకుగాను మొత్తం 30 వేలకోట్లు కేటాయించాలనినిర్ణయించారు. అలాగేఉజ్వల సీనకం కింద 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్లకు తొమ్మిది రీఫిల్స్ వరకూ సిలిండర్కు 300 చొప్పున సబ్సిడీ కల్పిస్తోంది.

ఉజ్వల కింద ఈ పథకం అమలవుతోంది. దేశంలో మొత్తం 10.33 కోట్లు కనెక్షన్లు ఉన్నట్లు తేలింది. ఇందుకోసం డిపాజిట్ రహిత ఎల్పీజీ కనెక్షన్లు ఉజ్వలకింద కల్పిస్తోంది.

# స్థానిక ఎన్నికల ఏర్పాట్లు షురూ

### గుజరాత్, మహారాష్ట్ర నుంచి బ్యాలట్బాక్స్లు

### బ్యాలట్ పత్రాలపై నోటా ముద్ర

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే తేదీలు ప్రకటించకపోయినప్పటికీ అధికార యంత్రాంగం ఏర్పాట్ల విషయంలో కసరత్తు చేస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అవసరమైన సామగ్రిని ఇతర రాష్ట్రాల నుంచి సమకూర్చే కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ,ఎంపీటీసీ,జడ్పీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు గుజరాత్, మహారాష్ట్రల నుంచి బ్యాలెట్ బాక్సులు తెప్పిస్తున్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈసీ దశలవారీగా బ్యాలెట్ బ్యాక్స్లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని 32 జిల్లాలకు 37,530 బ్యాలెట్ బ్యాక్స్లను ఆయా రాష్ట్రాల నుంచి అధికారులు దిగుమతి చేసుకున్నారు. ఆదిలాబాద్కు 1030 బ్యాలెట్ బాక్స్లు,నల్గొండకు 4120,హనుమకొండకు 1380,జగిత్యాలకు 1060, జయశంకర్ భూపాలపల్లికి 600, కామారెడ్డి 1830,కరీంనగర్ 730,ఖమ్మం 2320, కొమ్రంబీమ్ ఆసిఫాబాద్కు 950, మహ బూబాద్కు 970, మంచిర్యాలకు 970,మెదక్ 1110, ములుగు 650,నాగర్కర్నూల్ 1310,నారాయణపేట, 840,నిర్మల్, 830, నిజామాబాద్ 3440, పెద్దపల్లి 1650,రాజన్న సిరిసిల్ల 1470,రంగారెడ్డి,1730,సంగారెడ్డి, 1590,సిద్దిపేట,1420, సూర్యాపేట 1700,వికారాబాద్, 1460,వరంగల్ 1110,యాదాద్రి భువనగిరి 1260 బ్యాలెట్ బాక్స్లను అధికారులు దిగుమతి చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే తేదీలు ప్రకటించకపోయినప్పటికీ అధికార యంత్రాంగం ఏర్పాట్ల విషయంలో కసరత్తు చేస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అవసరమైన సామగ్రిని ఇతర రాష్ట్రాల నుంచి సమకూర్చే కార్యక్రమం కొనసాగుతోంది. గుజరాత్, మహారాష్ట్రల నుంచి జిల్లాలకు వస్తున్న బ్యాలెట్ బాక్స్లను భద్రపరిచేందుకు ఇప్పటికే ఆయా జిల్లాల అధికారులు స్ట్రాంగ్ రూమ్లను ఏర్పాటు చేస్తున్నారు.

**బ్యాలెట్ పేపర్పై నోటా ముద్రణ అవకాశం**

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులెవరూ నచ్చకపోతే ఓటర్లు నోటాకు ఓటు వేసే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఈవీఎంలలో మాత్రమే ఉన్న ఈ సదుపాయం ఇకపై బ్యాలెట్ పేపర్లలోనూ అందుబాటులోకి రానుంది. త్వరలో తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలపై నోటాను ముద్రించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తుండగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో మనకు ఎవరూ నచ్చకపోతే.. నోటాకు ఓటు వేసే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు ఈవీఎంలలో మాత్రమే నోటాకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. కానీ ఇకపై బ్యాలెట్ పేపర్ల మీద కూడా నోటాను ముద్రించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. త్వరలోనే తెలంగాణలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బ్యాలెట్ పత్రాల్లో నోటా అందుబాటులోకి రానుందగా ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో నిర్వహించబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను బ్యాలెట్ ద్వారానే నిర్వహిస్తుండగా.. దీనిలో నోటాను ముద్రించేలా ఎన్నికలు సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బాక్సులు,సిబ్బంది నియామకం వంటి అంశాలు ఓ కొలిక్కి వచ్చాయి. ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఈ సారి రెండు ఒకేసారి నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో జడ్పీటీసీ కోసం తెలుపురంగులో, ఎంపీటీసీల కోసం గులాబీ రంగులోసభ్యుల బ్యాలెట్ ఉండేలా ప్రింటింగ్ ఏర్పాట్లు చేశారు.

### నీటిపారుదల, దేవాదాయ శాఖల మధ్య సమన్వయంతో

# పుష్కర పనుల్లో వేగం

### 2027 జూలై 23 నుంచి గోదావరి పుష్కరాలు షురూ

### కాళేశ్వరంలో రూ.200 కోట్లతో సుందరీకరణకు సిఎం హామీ

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** దక్షిణ గంగ గోదావరికి పుష్కరాలు 2027 జూలై 23న ప్రారంభం కాబోతుండటంతో నీటిపారుదల, దేవాదాయ శాఖల మధ్య సమన్వయంతో పనులు గుర్తిస్తే పుష్కరాలకు వచ్చే భక్తులకు మౌలిక వసతలు కల్పించేందుకు పనులలో వేగం పెరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఇప్పటికే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతీ పుష్కరాలను ప్రారంభించి రూ.35 కోట్లను కేటాయించారు. ఒక్క కాళేశ్వరం వద్ద రూ.200 కోట్లతో పర్యాటక పనులు చేపట్టి 2027 పుష్కరాల నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమైన సవత్సరకాలంలో 2015జూన్ 14న గోదావరి పుష్కరాలు రావడంతో ఆనాటి ప్రభుత్వం రూ.900కోట్లు వ్యయం చేసి నిజామాబాద్ జిల్లా కందకుర్తి నుంచి మొదలు కొని ఖమ్మం జిల్లా వరకు స్నానఘాట్లు ఏర్పాటు చేసి భక్తులకు వసతులు కల్పించారు.

దక్షిణ భారతదేశంలో అతి పెద్ద నది గోదావరి తెలంగాణా రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్ల కందకుర్తివద్ద ప్రవేశిస్తుంది. మంజీరా, హరిద్రా నదులు గోదావరిలో కలుస్తుండటంతో త్రివేణిసంగమంగా స్థానికులు అత్యంత పవిత్రతతో ఆప్రాంతానికి ప్రాధాన్యత ఇస్తారు. నిర్మల్,మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి,ములుగు,భద్రాద్రికొత్త గూడెం మీదుగా ప్రవహిస్తూ ఆంధ్రప్రదేశ్కు గోదావరి నది తరలిపోతుంది. నాసిక్లో పుట్టిన గోదావరి నదికి 2027, జులై 23 నుంచి ఆగస్టు 3 వరకు పుష్కరాలు నిర్వహించేందుకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకూడా సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఉన్న స్నానఘాట్లకు మరమ్మతులు పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని నిర్ణయించారు. 2015లో రెండు రాష్ట్రాల్లో 316కు పైగా ఘాట్లు ఉండగా 8.75కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ప్రభుత్వగణాంకాలు వివరిస్తు న్నాయి.

బాసరలో 70లక్షల మంది, ధర్మపురిలో 65లక్షలమంది, కాళేశ్వరంలో కోటి మంది, కోటిలింగాల 30లక్షల మంది, మంథనిలో 45లక్షల మంది, భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, బూర్గంపాడు, దుమ్ముగూడెం. అశ్వాపురం మండలాల్లోని గోదారి తీరంలో యాభైలక్షల మంది పుణ్యస్నానాలు చేశారని ప్రభుత్వ గణాంకాలు వివరిస్తున్నాయి. 15వందల సాదువుల స్నానం ఆచరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కోటి యాభైలక్షల రూపాయలు బడ్జెట్ పెట్టారు. ఇటీవల కుంభమేళా, సరస్వతీ పుష్కరాలకు భక్తులు పోటెత్తారు. దీన్నిబట్టి చూస్తే ఈసారి పుష్కరాలకు భక్తుల వెల్లువ తప్పదని భావిస్తున్నారు. కాళేశ్వరం, బాసర,ధర్మపురి భద్రాచలంకు పొరుగు రాష్ట్రాల నుంచి,విదేశాలలో ఉండే ఎన్ఆర్ఐలు కూడా వచ్చి స్నానం చేసే అవకాశం ఉంది. క్షేత్ర స్థాయిలో పనులు మాత్రం చేయడం లేదు. దేశ విదేశాలకు చెందిన భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలివచ్చే వీలున్నందున ఆ స్థాయిలో నిధులు వరదలా రావాలి.

రాజమండ్రిలో గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే పనులను వేగంగా చేస్తున్నది. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్లో 202 ఘాట్ల సుందరీకరించేందుకు తొలి విడతగా రూ.150 కోట్లు అవసరమని అంచనా వేశారు. కార్యాచరణ రూపొందిస్తున్నారు. తెలంగాణలోను కందకుర్తి నుంచి భద్రాచలం వరకు 102 ఘాట్లు ఉండగా వీటిని బాగు చేయించడంతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణానికి రూ.50 కోట్లు కేటాయించాలని దేవాదాయ శాఖ ప్రతిపాదించింది. భక్తుల సంఖ్యకు తగ్గట్టు గోదావరి పుష్కరాలకు భారీగానే నిధులు వస్తామని అంచనాలు కడుతున్నారు.

# మహిళా కండక్టర్ను దూషించిన మణుగూరు డిఎంపై చర్యలు తీసుకోవాలి

### ఆర్టిసి ఎంప్లాయిూస్ యూనియన్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్ను దూషించిన మణుగూరు డిఎంపై యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని టిజిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. విధి నిర్వహణలో ప్రయాణికులకు సిబ్బందికి జరిగిన గొడవ కేవలం ఎక్స్ప్రెస్ బస్స్టేజి లేని దగ్గర ఆపమని ప్రయాణికులు అడిగినందుకు.. సిబ్బంది నిరాకరించినందుకు జరిగిన సంఘటనలో మహిళా కండకర్టర్ను దూషించడం సరైంది కాదని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. ఎక్స్ప్రెస్ సర్వీసు రిక్వెస్ట్ స్టేజ్లో ఆపవద్దు అని సంస్థ ఎండి ఆదేశాలు ఉండగా ఆ ఆదేశాలు విస్మరించిన మణుగూరుడిపో మేనేజర్ వాస్తవాలు తెలుసుకోకుండానే కండక్టర్ తేజస్వినిది ఈ సంఘటనలో ఎలాంటి ప్రమేయం లేకపోయినా డిఎం ఇష్టం వచ్చినట్లు దూషించి ప్రయాణికుల సమక్షంలో మనోభావాలు దెబ్బతినేవిధంగా మానసిక వేదనకు గురిచేసే విధంగా మాట్లాడిన తీరును ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మణుగూరు డిపో మేనేజర్గా గత కొంత కాలంగా పనిచేస్తున్నప్పటి నుండి డిపోలో పనిచేస్తున్న సిబ్బందిని కించపరుచే విధంగా మాట్లాడుతూ వారిని నిత్యం అవమానిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని డిపో కార్మికులు తెలియజేశారని అన్నారు. ఈ నెల 7న ఏడిసిగా డిపోలో టైర్ సెక్షన్లో డ్యూటీ చేస్తున్న ఎన్ అనిల్ ఈ825652 ఫోను చార్జింగ్ పెట్టి తన పని తాను చేసుకుంటున్నా ఎడిసి దగ్గరికి డిఎం వొచ్చి ఆ ఏడిసి ఫోన్ గుంజుకొని కోపంతో తిట్టి ఫోన్ చాలా సేపటి వరకు తన వద్దే ఉంచుకోవడం జరిగిందన్నారు. ఇలాంటి చర్యలకు డిపో మేనేజర్ పాల్పడడం దుర్మార్గమని విమర్శించారు.



## బస్సులో విదేశీ యువతిపై అత్యాచారం!

**పాట్నా, ఆగస్టు 8:** బీహార్ రాజధాని పాట్నాలో నేపాల్కు చెందిన యువతిపై ఓ ప్రైవేట్ బస్సులో అత్యాచారం జరిగింది. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. బాధితురాలికి తెలిసిన నేపాలీ భాష మాట్లాడి నమ్మకాన్ని చూరగొన్న ప్రధాన నిందితుడు, ఆమె నిస్సహాయతను ఆసరాగా తీసుకుని ఈ దారుణానికి పాల్పడ్డాడు. పాట్నా సెంట్రల్ ఎస్పీ దీక్ష వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రధాన నిందితుడైన కార్తీక్ రాయ్, అతడికి సహకరించిన సునీల్ కుమార్ను అరెస్ట్ చేశారు. ఆగస్టు 4న ఈ దారుణం జరిగిన తర్వాత నిందితులు నగరం విడిచి పారిపోయారు. ప్రధాన నిందితుడు కార్తీక్ రాయ్ పశ్చిమ బెంగాల్కు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, బరౌనీ సమీపంలో ఒక రైల్లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బాధితురాలి గుర్తింపు కార్డు, నేపాలీ సిమ్ కార్డు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కార్తీక్ ఇచ్చిన సమాచారంతో, అతనికి సహకరించిన సునీల్ కుమార్ను ఔరంగాబాద్లో అరెస్ట్ చేశారు. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ముజఫర్పూర్కు చెందిన బస్సు డ్రైవర్ కార్తీక్ రాయ్కి నేపాలీ భాషతెలుసు. అతనికి అప్పటికే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఒత్తిడితో డబ్బు సంపాదించేందుకు నేపాల్ నుంచి వచ్చిన బాధితురాలు, ఆగస్టు 3న సిలిగురి మీదుగా పాట్నాకు చేరుకుంది. పాటలీపుత్ర రైల్వే స్టేషన్లో ఆమెకు కార్తీక్ పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, సునీల్ కుమార్ ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆమెను బస్సులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని ఎస్పీ దీక్ష తెలిపారు. నేరం జరిగిన తర్వాత సాక్ష్యాలను నాశనం చేసేందుకు నిందితులు బస్సును శుభ్రం చేశారు. బాధితురాలి వస్తువులను దోచుకున్న కార్తీక్, వాటిలో కొన్నింటిని కోల్కతాలో అమ్మి, తిరిగి ముజఫర్పూర్కు వచ్చాడు. మళ్లీ కోల్కతాకు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు చిక్కాడు. గాంధీ మైదాన్ సమీపంలో బాధితురాలు ఏడుస్తూ కనిపించడంతో స్థానిక దుకాణదారులు, గోర్ఖా రెజిమెంట్ జవాన్లు గమనించారు. వారు గోర్ఖా సమాజ్ సమితి అధ్యక్షుడు సూరజ్ థాపాకు సమాచారం అందించగా, ఆయన బాధితురాలిని చేరదీసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సహాయం చేశారు. ఈ ఘటనలో ఉపయోగించిన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# హిమాయత్సాగర్ గేట్లు ఎత్తివేత

### మూసీ పరీవాహకప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

**హైదరాబాద్ (నార్సింగి), ఆగస్టు 8, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహా నగర శివారుల్లోని చారిత్రక హిమాయత్ సాగర్ జలాశయం నాలుగు గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని విడుదల చేశారు. గురువారం రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్గౌడ్ బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్గౌడ్, జల మండలి అధికారులతో కలిసి ఒక గేటును ఒక ఫీటు మేర ఎత్తి దిగువకు 500.క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం ఉదయం వరకు పైనుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండడంను గమనించిన అధికారులు మరో మూడు గేట్లు ఒక ఫీటు మేర ఎత్తి దిగువన ఉన్న ఈసీ నదిలోకి 1400.క్యూసెక్కుల నీటిని వదిలి పెడట్టారు. జలాశయం నుంచి గేట్ల ద్వారి దిగువకు దూకుతున్న వరద నీటిని చూసేందుకు పెద్ద ఎత్తున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తరళి వచ్చారు. నాలుగు గేట్ల నుంచి కిందకు దూకుతున్న నీటిని చూసి సందర్శకులు ఆనందపరవశులయ్యారు. వరద నీటి ప్రవాహంతో ఈసీ వాగు పరవళ్ళ తొక్కుతూ కిస్మత్పూర్ దర్గా, కిస్మత్పూర్, బండ్లగూడల మీదుగా పారి లంగర్హౌస్ సంఘం వద్ద మూసీ నదిలో కలిసింది. గేట్లు ఎత్తడానికి ముందు ప్రజలు అప్రమత్తం కావాలని సైరన్ను వినిపించారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరుగకుండా ఉండేందుకు బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్చంద్ర తమ సిబ్బంది ద్వారా చాటింపు వేయించి, ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్గౌడ్ మాట్లా డుతూ ఈ వారంలో వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా జలాశయాలన్నీ నిండు తున్నా యని తెలిపారు. హైదరాబాద్ నగర శివా రుల్లోని చారిత్రక హిమా యత్ సాగర్ జలాశయం తొలకరి వర్షాలకే నిండడం ఆనందంగా ఉందన్నారు. జంట జలాశయాలైన గండిపేట్, హిమాయత్ సాగర్లు జలకళతో కనిపిస్తుండడం సంతో షంగా ఉందన్నారు. హిమాయత్ సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టంతో నిండిపోవడంతో నీటిని ముందస్తుగా దిగువకు వదలడం జరిగిందన్నారు.



హిమాయత్సాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్గౌడ్.

**లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్**

హిమాయత్ సాగర్ జలాశయంను శుక్రవారం మధ్యాహ్నం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారా యణరెడ్డి జల మండలి అధికారులతో కలిసి సందర్శించారు. చెరువు కట్టపై నిలబడి చెరువులోని నీటిని, చెరువుకున్న గేట్లను, దిగువన వదిలిన నీటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు నిండుతున్నాయని, నీటిని దిగువకు వదిలి పెట్టడం జరుగుతుందని, ఈ నీటి ప్రవాహం వలన లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

**1400 కూసెక్కుల నీటిని వదులుతున్నా : జలమండలి డిజిఎం**

హిమాయత్సాగర్ జలాశయంలోకి మొయినాబాద్ మండలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడం వలన నాలుగు గేట్లు ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి పెడుతున్నా మని జల మండలి డిజిఎం గోవింద్గౌడ్ తెలిపారు. హిమాయత్ సాగర్ జలాశయం పూర్తి సామర్థ్యం 1763.50అడుగులని, ఇప్పుడు 1763కు చేరుకుందని, వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో ముందస్తుగా నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందన్నారు. వరద ప్రవాహం తగ్గితే గేట్లను మూసి వేస్తామని, వర్షాలు కరిసి వరద ప్రవాహం మరింత పెరిగితే మరిన్ని గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని గోవింద్గౌతడ్ వివరించారు.

### కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్

### కెసిఆర్ కుటుంబం వేల కోట్లు దోచుకుందని వెల్లడి

### ఆ కుటుంబంపై ఆధారాలున్నా ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్న

# ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసును వెంటనే సిబిఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్తో ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు స ంబంధించి శుక్రవాకం నాడు బండి సంజయ్ సిట్ అధికారుల ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. రాజ్భవన్ మార్గంలో గల దిల్కుషా గెస్ట్ హౌస్ లో గంటకు పైగా విచారణలో బండి సంజయ్తో పాటు ఆయన సహాయకులు మధు, ప్రవీణ్ రావు, తిరుపతిలను వేరు వేరుగా విచారించి వారి వాంగ్మూలం కూడా తీసుకున్నారు. కాగా విచారణ అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్కు సంబంధించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో మొదట మాట్లాడింది తానేనని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ బారినపడని వారు అతికొ ద్ది మంది మాత్రమే వున్నారని ఆయన అన్నారు. కెసిఆర్, కెటిఆర్, సంతోష్ కుమార్ల ఫోన్లు తప్ప హరీష్ రావు, కవిత సహ బిఆర్ఎస్ మంత్రు లు, ఎంఎల్ఎలు, ఎంపిలు, ఇతర నాయకుల ఫోన్లను విచ్చల విడిగా ట్యాపింగ్ చేశారని ఆయన విమర్శిం చారు. ఫోన్ ట్యాపింగ్ అప్పట్లో కెసిఆర్ కుటుం బానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చిందని బండి సంజయ్ ఆరోపించారు. వాస్తవానికి మావోయిస్టుల ఫోన్లను ట్యాపింగ్ చే యడానికి ఉద్దేశించిన ఎస్ఐబి నక్సలైట్ల ముసుగులో ప్రతిపక్ష నాయకులతో పాటు స్వపక్షంలోని అసంతృప్తి నేతల ఫోన్లను నాటి సర్కారు ఇష్టాను సారం ట్యాపింగ్ చేసిందని ఆయన తెలిపారు. అప్పట్లోనే తాను ఫోన్ ట్యాపింగ్పై గళమెత్తానని, మునుగోడు ఉప ఎన్నిక సమయంలో తన ఫోన్ను ట్యాప్ చేశారని, తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని బండి సంజయ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్పై గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై సిట్ అధికారులు విచారణకు పిలిస్తే వచ్చానని, తన వద్ద వున్న ఆధారాలు ఇచ్చానని ఆయన తెలిపారు. అప్పట్లో ఫోన్ టా ్యపింగ్కు భయపడి సాధారణ కాల్స్ కు బదులు వాట్సా ప్ కాల్స్ లో మాట్లాడేవారిమని ఆయన తెలిపారు. నక్సలైట్ల కార్యకలాపాలపై నిఘా వుంచేం దుకు ఏర్పాటయిన ఎస్ఐబిని అక్రమ ఫోన్ ట్యాపింగ్కు కేరాఫ్గా మార్చిన కెసిఆర్ కుటుంబం దీనిని పైసా వసూల్ కేంద్రంగా మార్చుకుందని ఆయన ధ్వజమెత్తారు. అప్పట్లో గ్రూప్ వన్ పరీక్షల ప్రశ్నా పత్రాలు లీక్ అయితే తాను ధర్నా చేసేందుకు వెళ్లానని, అయితే మార్గమధ్యలోనే తనను అరె స్టు చేశారని, ఇది కూడా ట్యాపింగ్ కారణంగానే జరిగిందని ఆయన వెల్లడించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పట్టుబడ్డ వందల కోట్ల రూపాయలు ఎక్కడికి వెళ్లాయో? ఎవరికి తెలియదని ఆయన తెలిపారు. అప్పట్లో వంద కోట్ల రూపాయలు పట్టుబడితే పది కోట్ల రూపాయలుగా చెప్పేవారని, ఈ డబ్బులన్నీ కెసిఆర్ కుటుంబం చేతుల్లో వెళ్లిందని ఆయన వెల్లడించారు.

**సిట్ విచారణతో లాభం లేదు: సిబిఐకి అప్పగిస్తే అన్నీ వెల్లడవుతాయి**

ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారణ చేస్తున్నా ఇప్పటి వరకు ఏమీ జరగలేదని బండి సంజయ్ తెలిపారు. ట్యాపింగ్లో కెసిఆర్ కుటుంబం పా త్ర వుందని ఆధారాలు వున్నా ఎవరినీ అరెస్టు చేయలేదని ఆయన తెలిపారు. సిట్ అధికారుల నిజాయితీపై తమకు అనుమానం లేదని, ప్రభుత్వ నిజాయితీపై నే అనుమానం వుందని ఆయన చెప్పారు. ఫోన్ ట్యాపింగ్పై జరుగుతున్న విచారణ తీరును చూస్తుంటే కెసిఆర్తో రేవంత్ రెడ్డి సర్కారు కుమ్మక్కైనట్లు తెలుస్తోందని బండి సంజయ్ వెల్లడించారు.

# నేడు మాదిరి గరుడసేవ

### శ్రావణపౌర్ణమి రోజు బ్రహ్మోత్సవ తరహాలో నిర్వహణ

**తిరుమల,ఆగస్ట్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఏటా సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజురాత్రి జరిగే గరుడవాహనసేవకు అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. ఆరోజు నిర్వహించే గరుడసేవ మాదిరి ప్రయోగాత్మకంగా శ్రావణ మాస పౌర్ణమి గరుడసేవ జరిపించడం తిరుమలలో ఆనవాయితీ. శనివారం (నేడు)ఎంతో పవిత్రమైన విశిష్టమైన శ్రావణపౌర్ణమి సంద ర్భం గా రాత్రి 7గంటలకు మాదిరి గరుడసేవ నిర్వహిస్తారు. ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తి మలయప్ప స్వామికి సాయంత్రం నిత్యకైంకర్యాలు అనంతరం వాహనంమండపం వద్దకు వేంచేపుచేస్తారు. స్వామివారు లక్ష్మీకాసులహారం, పచ్చలహారం, మరిన్ని అమూల్యమైన ఆభరణాలు ధరిస్తారు.



# 25 థియేటర్లలో 'అఖండ2 :తాండవం' రిలీజ్



బాలకృష్ణ నందమూరి, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను, రామ్ ఆచంట, గోపీ ఆచంట, 14 రీల్స్ ప్లస్, ఎం తేజస్విని ప్రెజెంట్స్ 'అఖండ 2: తాండవమ్ణ డబ్బింగ్ పూర్తి చేసిన బాలకృష్ణ సెప్టెంబర్ 25న థియేటర్లలో రిలీజ్ 'గాడ్ ఆఫ్ ది మాసెస్ణ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను డైనమిక్ అండ్ పవర్ ఫుల్ ఫోర్త్ కొలాబరేషన్ లో మోస్ట్ అవైటెడ్ హైఆక్టేన్ సీక్వెల్ 'అఖండ 2: తాండవమ్ణ తో రాబోతున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం హై బడ్జెట్, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్ తో భారీ స్థాయిలో నిర్మించబడుతోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌ను ఎం తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. థియేట్రికల్ రిలీజ్ సమీపిస్తున్నందున, మిగిలిన అన్ని పోస్ట్‌ప్రొడక్షన్ పనులను షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేయడానికి టీం అవిశ్రాంతంగా కృషి చేస్తోంది.

తాజాగా 'అఖండ 2: తాండవమ్ణ కోసం బాలకృష్ణ డబ్బింగ్ పూర్తిచేశారు. ఇది సినిమా పనుల్లో ఒక ముఖ్యమైన మైల్ స్టోన్. మిగతా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా ఫుల్ స్పీడ్‌లో జరుగుతున్నాయి. సీజీ వర్క్, రీరికార్డింగ్, ఇంకా మిగతా టెక్నికల్ పనులన్నీ ఒకేసారి చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా పెండింగ్ పనులు మొత్తం పూర్తవుతాయి. మరో మూడు వారాల్లో ఫస్ట్ కాపీ రెడీ అవుతుంది. ఈ దసరాకు, అంటే సెప్టెంబర్ 25న సినిమా థియేటర్లలోకి వస్తుందని మేకర్స్ మరోసారి తెలియజేశారు. ఈ సినిమా టీజర్ ఇప్పటికే ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించింది. నందమూరి బాలకృష్ణను మునుపెన్నడూ లేని విధంగా ఫెరోషియస్ అవతారంలో కనిపిస్తూ అభిమానులనిప్రేక్షకులని కట్టిపడేశారు. ఈభారీ ప్రాజెక్ట్‌లో టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ముఖ్యపాత్రలోనటిస్తున్నారు. ఆమెతో పాటు ఎప్పుడూ వెర్సటైల్‌గా ఉండే ఆది పినిశెట్టి, ఇంటెన్సిటీ, డెప్త్ ఉన్నఒ కీలక పాత్రలో కనిపించ నున్నారు.

హర్షాలి మల్హోత్రా ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుె ఎడుతున్నారు. ఆమె కూడా స్టోరీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈసినిమాకోసంఅద్భుతమైన టెక్నికల్ టీం పని చేస్తోంది. ఎస్. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించగా, సి.రాంప్రసాద్ డీవోపీగా వర్క్‌చేస్తు న్నారు. ఎడిటింగ్‌ను తమ్మిరాజు నిర్వహిస్తుండగా, ఏఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రానికి వరుస అప్‌డేట్స్‌తో ప్రమోషన్లు ముమ్మరం చేయడానికి మేకర్స్ సిద్ధమవు తున్నారు. నటీనటులు: గాడ్‌ఆఫ్‌మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీనునిర్మాతలు: రామ్ ఆచంట, గోపి, ఆచంట, బ్యానర్: 14 రీల్స్ ప్లస్ సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: థమన్ ఎస్ డిఓపి: సి.రాంప్రసాద్, సంతోష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, పిఆర్ఓ : వంశీ శేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.



# కనకావతిగా రుక్మిణి వసంత్ ఫస్ట్ లుక్

వరమహాలక్ష్మీ పండుగ శుభ సందర్భంగా సినిమాటిక్ ఎపిక్ కాంతార చాప్టర్ 1నుంచి కనకావతి పాత్రలో హీరోయిన్ రుక్మిణి వసంత్ పాత్ర ఫస్ట్ లుక్‌ను హోంబాలే ఫిల్మ్స్ లాంచ్ చేసింది. రిషబ్ శెట్టి రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2022 బ్లాక్‌బస్టర్ కాంతారకు ప్రీక్వెల్. ఈ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు, విమర్శకుల నుండి ప్రశంసలు పొందింది. మేకర్స్ రిషబ్ శెట్టి పుట్టినరోజున అతని ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు,. ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో భారీ సంచలనం సృష్టించింది. ఇటీవల విడుదలైన మేకింగ్ వీడియో కూడా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు, కనకావతిగా రుక్మిణి వసంత్ పాత్రలో కనిపించిన ఫస్ట్ లుక్ సినిమా చుట్టూ ఉన్న ఉత్సాహాన్ని మరింత పెంచింది. ఈ చిత్రం కాంతార యూనివర్స్‌లో మరో అద్భుతమైన అధ్యాయం కానుంది. అర్వింద్ ఎస్. కాశ్యప్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ, బి.అజనీష్ లోకనాథ్ అందించిన సంగీతం, హోంబలే ఫిలిమ్స్ విజయ్ కిరగందూర్ వరల్డ్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమా విజువల్ వండర్‌గా ఉండబోతుంది. కాంతార చాప్టర్ 1 ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 2, 2025న కన్నడ, తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషలలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'దిప్యారడైజ్ణ స్టైలిష్ అవతార్‌లో నాని



నేచురల్‌స్టార్ నాని ,శ్రీకాంత్ ఓదెల, సుధాకర్ చెరు కూరి, ఎస్ఎల్‌వి సినిమాస్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్ణ నుంచి మునుె ఎన్నడూ చూడని రగ్గడ్, స్టైలిష్ అవతార్‌లో జడల్‌గా నాని ఫస్ట్ లుక్ రిలీజ్‌నేచురల్‌స్టార్‌నాని మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్ణ లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. ది ప్యారడైజ్ నుండి నేచురల్ స్టార్ నాని ఫస్ట్ లుక్ విడుదలై అభిమానులు, ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంది. నాని నెవర్ బిఫోర్ లుక్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. రగ్గడ్ మీసం, గెడ్డం, రెండు జడలతో కనిపించిన నాని అదిరిపోయే ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేశారు మేకర్స్. ఆ రెండు జడలే ఆయనకు పేరుగా మారాయి. ఇందులో ఆయన పాత్ర పేరు "జడల్ణ పేరు చాలా యూనిక్‌గా వుంది. పోస్టర్ కంపోజిషన్ మరింత ఫైర్ పెంచింది. ఆయన వెనక, కత్తులుబుల్లెట్లతో తయారైన ఒక భారీ రౌండ్ వీల్ ఒక రకమైన డేంజర్‌ని చూస్తోంది. పొగమంచులో ఎగిరే కాకులు ప్రతి ఎలిమెంట్‌లోనూ సింబాలిజం కట్టిపడేస్తోంది. అనే క్యాప్షన్ మరింత క్యురియాసిటీ పెంచింది. ప్రస్తుతం ఈ ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇటీవల వచ్చిన "రా స్టేట్మెంట్ణ గ్లింప్స్ తర్వాత ఈ సినిమా నుండి వచ్చే ప్రతి అప్‌డేట్‌కి అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఇప్పుడు నాని ఫస్ట్ లుక్‌తో, ఆ అంచనాలను మేకర్స్ నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లారు. డైరెక్టర్ శ్రీకాంత్ విజన్, డీటైలింగ్ గురించి దేశం మొత్తం మాట్లాడుతోంది. కేవలం పోస్టర్ కంటెంట్‌తోనే హైప్ మల్టీఫోల్డ్‌గా పెరిగిపోయింది. దసరా తర్వాత నానిశ్రీకాంత్ ఓదెల మరోసారి కలిసి చేస్తున్న ఈ సినిమా, హైదరాబాద్‌సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామాగా రాబోతోంది. ఈ చిత్రంలో రాఘవ జూయాల్ ఒక కీలక పాత్రలో కనిపించనుండగా, రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీని సి. సాయి, ఎడిటింగ్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్ అవినాష్ కొల్లా చేస్తున్నారు. ది ప్యారడైస్ 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ మొత్తం ఎనిమిది భాషల్లో రిలీజ్ అవుతూ, కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేయబోతోంది. యూనివర్సల్ కంటెంట్‌తో పాన్‌వరల్డ్ రిలీజ్ అవుతూ భారతీయ సినిమాను గ్లోబల్ మ్యాప్‌లో మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది.

# ఎస్‌కె ఎంటర్టైన్మెంట్ 'జటాధర్ణ ఎపిక్ టీజర్



రెబల్ స్టార్ ప్రభాస్ లాంచ్ చేసిన సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా, జీస్టూడియోస్, ప్రేరణఅరోరా, ఎస్ కే ఎంటర్టైన్మెంట్ 'జటాధర్ణ ఎపిక్ టీజర్ నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షిసిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్‌థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శ కత్వవహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతి వృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమా టిక్ ఎక్స్ పీరియన్స్ అందించ బోతుంది.

రెబల్ స్టార్ ప్రభాస్ ఈ చిత్రం టీజర్‌ను లాంచ్ చేశారు. టీజర్ విజువల్ వండర్ గా వుంది. లోభం త్యాగం, చీకటి దైవత్యం మధ్య జరిగే పోరాటంని అద్భుతంగా ఆవిష్కరించారు. ఆకాశమంత ఆరాధన కలిగించేలా శివుని సాక్షాత్కారం టీజర్‌లో స్పిరిచువల్ హైపాయింట్. టీజర్ మిస్టరీ, పవర్, హైస్టేక్స్ మైథాలజీతో నిండిన ప్రపంచాన్ని పరిచయం చేసింది. సుధీర్ బాబు ప్రజెన్స్ డివైన్ వైబ్స్ కలిగించింది. త్యాగంతో పుట్టిన రక్షకుడిగా కనిపించిన పాత్రలో ఆయన లుక్ అదిరిపోయింది. సోనాక్షి కలకలం సృష్టించే శక్తిగా కనిపించింది. ఈ మైథాలజికల్ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ హై ఆక్టేన్ స్టోరీటెల్లింగ్, మైండ్‌బ్లోయింగ్ విజువల్స్ అదరగొట్టింది. స్కేల్, మేకింగ్, బ్యాక్‌గ్రౌండ్‌స్కోర్, ఎక్జిక్యూషన్ అన్నింట్లో నూ ఈ టీజర్ ఒక అద్భుతమైన మైథాల జికల్ స్పెక్టకిల్ రాబోతుందనే హింట్ ఇచ్చింది. 'జటాధర్ణ లో ఇండియన్ హెరిటేజ్‌ని కటింగ్‌ఎడ్జ్ గ్రాఫిక్స్, హై కాన్సెప్ట్ నేరేటివ్‌తో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిపంచబోతుంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ గ్రాండియర్ కనిపించింది. రిచ్ సెట్స్, అద్భుతమైన సినిమాటోగ్రఫీ, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, ఎపిక్ స్టోరీటెల్లింగ్‌తో'జటాధర్ణ బిగ్ సినిమాటిక్ ఈవెంట్ కానుంది.

జీ స్టూడియోస్, ప్రెర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమాను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రెర్ణా అరోరా ప్రొడ్యూస్ చేస్తున్నారు. మ్యూజిక్ జీ మ్యూజిక్ కో., క్రియేటివ్ డైరెక్షన్ దివ్య విజయ్. జీ స్టూడియోస్ స్ట్రాటజిక్ విజనరీ ఉమేష్ కుమార్ బన్సాల్ మద్దతుతో, ప్రొడ్యూసర్స్ శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్ప సింగాల్, కోప్రొడ్యూసర్స్ అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుం అరోరా ఈ ప్రాజెక్ట్ కు మద్దత్తు ఇస్తున్నారు. టాయిలెట్: ఎక్ ప్రేమ్ కథ, ప్యాడ్‌మాన్, పరి వంటి హిట్స్ ఇచ్చిన ప్రెర్ణా అరోరా మళ్లీ హైకాన్సెప్ట్ సినిమాను రూపొందిస్తున్నారు. జానర్ బౌండరీలు చెరిపేసే కాన్సెప్ట్‌తో, 'జటాధర్ణ ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ థియేట్రికల్ రిలీజ్‌లలో ఒకటిగా వస్తోంది. దేశవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న 'జటాధర్ణ ఇండియా సినిమాలో నెక్స్ట్ మైథాలజికల్ ఎపిక్‌గా మారబోతోంది.

# 'పులిచర్ల కాంబో్ణ మూవీ లాంచ్



హీరోయిన్ అంజలి, 9క్రియేషన్స్, డైరెక్టర్‌రాజశేఖర్‌రెడ్డిపులిచర్లకాంబోమూవీ గ్రాండ్ లాంఛ్ బ్యూటిఫుల్, టాలెంటెడ్ హీరోయిన్ అంజలి లీడ్ రోల్‌లో 9 క్రియేషన్స్ నిర్మాణంలో డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి పులిచెర్ల రూపొందిస్తున్న కొత్త మూవీ హైదరాబాద్ లోని మూవీ ఆఫీస్‌లో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ చిత్రానికి రాజచంద్రశేఖర్ రెడ్డి కందుల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి పులిచర్ల గతంలో సుడిగాలి సుధీర్‌తో "సాఫ్ట్ వేర్ సుధీర్ణ, "గాలోడ్ణ అనే కమర్షియల్‌గా సక్సెస్‌ఫుల చిత్రాలు రూపొందించి దర్శకుడిగాతన ప్రతిభ నిరూపించు కున్నారు. అంజలితో చేస్తున్న ఈ లేడీ ఓరియెంటెడ్ ఫిలిం ఆయన కెరీర్‌లో మరో స్పెషల్ మూవీ కానుంది .డిఫరెంట్ కాన్సెప్ట్‌తో లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభించనున్నారు. ఈసినిమాకు ప్రముఖసినిమాటోగ్రాఫర్‌సి. రాంప్రసాద్ కలర్ ఫుల్ విజువల్స్ అందించనున్నారు. ఈ చిత్రానికి పనిచేసే ఇతర నటీనటుల, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. నటీనటులు : అంజలి, తదితరులు. డీవోపీ : సి.రాంప్రసాద్, బ్యానర్: 9 క్రియేషన్స్, పిఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), ప్రొడ్యూసర్: రాజచంద్రశేఖర్ రెడ్డి కందుల, రచన, దర్శకత్వం: రాజశేఖర్ రెడ్డి పులిచర్ల.



# 'బ్యాడ్ బాయ్' నుంచి సాంగ్ రిలీజ్

నాగశౌర్య, రామ్ దేశినా, శ్రీనివాసరావు చింతలపూడి, శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ ప్రొడక్షన్ నంబర్ 1'బ్యాడ్ బాయ్ కార్తీక్ణ కలర్ ఫుల్ ఫస్ట్ సింగిల్ నా మావ పిల్లనిత్తానన్నాడే రిలీజ్ హీరో నాగశౌర్య అప్ కమింగ్ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్ బాయ్ కార్తీక్. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. నాగశౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్ ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ నా మావ పిల్లనిత్తానన్నాడే సాంగ్ రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేశారు. ఈ సాంగ్‌ని మెలోడీ మాస్టర్ హారిస్ జయరాజ్ వైబ్రెంట్ అండ్ ఫుట్ టాపింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ మాస్ ని ఆకట్టుకునేలా వున్నాయి. కారుణ్య, హరి ప్రియ తమ ఎనర్జిటిక్ వోకల్స్ తో మెస్మరైజ్ చేశారు. ఈ సాంగ్‌లో నాగశౌర్య, విధి కెమిస్ట్రీ కలర్ ఫుల్ గా వుంది. నాగశౌర్య డ్యాన్స్ మూమెంట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సాంగ్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# మ్యూజికల్ లవ్ స్టోరీ కపుల్ ఫ్రెండ్లీ



యూవీ కాన్సెప్ట్స్, సంతోష్ శోభన్ మూవీ "కపుల్ ఫ్రెండ్లీ్ణ టీజర్ రిలీజ్, త్వరలో తెలుగు, తమిళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న సినిమాసంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ్ణ. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈచిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్‌కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈచిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీగా "కపుల్ ఫ్రెండ్లీ్ణ సినిమా తెరకెక్కుతోంది. నేడు ఈ సినిమా తెలుగుతో పాటు తమిళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ మేకర్స్. సాయంత్రం 4.24 నిమిషాలకు "కపుల్ ఫ్రెండ్లీ్ణ సినిమా టీజర్ రిలీజైంది. చెన్నై నగరం బ్యాక్ డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు ఒక కొత్త ఫీల్ ఇవ్వనుంది. నటీనటులు: సంతోష్ శోభన్, మానస వారణాసి, తదితరులు. టెక్నికల్ టీమ్: ఆర్ట్ మైఖేల్ బీఎఫ్‌ఏ, ఎడిటర్: గణేష్ శివ, డీవోపీ: దినేష్‌పురుషోత్తమన్, మ్యూజిక్: ఆదిత్య రవీంద్రన్, ఎగ్జిక్యూటివ్‌ప్రొడ్యూసర్: ఎస్ఎస్‌వర్మసమర్పణ: యూవీ క్రియేషన్స్, నిర్మాణం : యూవీ కాన్సెప్ట్స్, అజయ్‌కుమార్ రాజు పి, పీఆర్‌ఓ : జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్)రచన, దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్ .

# గౌరీ ఫిలింస్ ప్రొడక్షన్ నం1 'పెళ్లిలో పెళ్లి్ణ

సుఖకర్త ఫిలింస్, గౌరీ ఫిలింస్ ప్రొడక్షన్ నెం.1 మూవీ "పెళ్లిలో పెళ్లి్ణ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్, త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న సినిమా గౌరి ఫిలింస్ తో కలిసి సుఖకర్త ఫిలింస్ ప్రొడక్షన్ నెం.1గా "పెళ్లిలో పెళ్లి్ణ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రంలో శివ సాయిరిషి, సంస్కృతి గోరే, విష్ణు ప్రియ, ఉమా మహేశ్వరరావు, తనికెళ్ల భరణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గణేష్ కోలి నిర్మిస్తున్న "పెళ్లిలో పెళ్లి్ణ సినిమాకు శ్రీకాంత్ సంబరం దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ తో పాటు బ్యానర్ లాంఛ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ, "పెళ్లిలో పెళ్లి్ణ లో సినిమా ఈవెంట్ జరుగు తుంటే బయట కుండపోత వర్షం కురుస్తోంది. ఆ పరమే శ్వరుడు గంగ రూపంలో ఆశీర్వాదం పంపించాడు అనిపిస్తోంది. ఆయన "పెళ్లిలో పెళ్లి్ణ సినిమాతో హిట్ అందుకుని బాలీవుడ్ లో సినిమాలు చేసేంతగా ఎదగాలని కోరుకుంటున్నా. డైరెక్టర్ శ్రీకాంత్ సంబరం ప్రతిభావంతుడు. హైదరాబాద్ లో సినిమా చేయడం సులువే కానీ షోలాపూర్ కు 24 క్రాఫ్టుల వాళ్లను తీసుకెళ్లి చాలా స్పీడ్ గా సినిమా రూపొందించాడు. అతనికి కూడా మంచి ఫ్యూచర్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎల్ రాజా మాట్లాడుతూ, "పెళ్లిలో పెళ్లి" సినిమా ఈవెంట్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఈ సినిమాకు మంచి కథ కథనాలతో పాటు పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కుదిరాయి. ఈ సినిమాకు పనిచేసే అవకాశం ఇచ్చిన మా ప్రొడ్యూసర్ గణేష్ కోలికి థ్యాంక్స్. కంప్లీట్ ఎంటర్ టైనింగ్ మూవీ ఇది. ఈ సినిమాలో తనికెళ్ల భరణి ఒక ఇంపార్టెంట్ రోల్ చేశారు. నెక్స్ట్ రాబోయే ఈవెంట్స్ లో ఈ చిత్రం గురించి మరింతగా మాట్లాడుతా. అన్నారు. హీరోయిన్ సంస్కృతి గోరే మాట్లాడుతూ, "పెళ్లిలో పెళ్లి్ణ సినిమా మా అందరికీ ఎంతో ఇంపార్టెంట్. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాతకు థ్యాంక్స్ చెబుతున్నానన్నారు. నటి దివిజ మాట్లాడుతూ, "పెళ్లిలో పెళ్లి్ణ సినిమాలో నటించే అవకాశం రావడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా మా ప్రొడ్యూసర్ గణేష్ కోలి లేకుంటే ఇంత గ్రాండ్‌గా రెడీ అయ్యేది కాదు. ఈ టీమ్ తో కలిసి వర్క్ చేసిన ఎక్స్‌పీరియన్స్ మర్చిపోలేను.



"పెళ్లిలో పెళ్లి" అనే మంచి మూవీతో మీ ముందుకు త్వరలోనే రాబోతున్నాం. అన్నారు. హీరో శివ సాయిరిషి మాట్లాడుతూ, మా మూవీ ఈవెంట్ కు వచ్చి సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. భరణికి, ఆకాష్ జగన్నాథ్ అన్నకు థ్యాంక్స్. ఎంఎల్ రాజా మంచి సాంగ్స్ ఇచ్చారు. మా మూవీ గురించి నెక్స్ట్ ప్రెస్ మీట్స్‌లో మాట్లాడుతా, త్వరలోనే రిలీజ్ కు వస్తున్న మా "పెళ్లిలో పెళ్లి్ణ సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు. ప్రొడ్యూసర్ గణేష్ కోలి మాట్లాడుతూ, సినిమా మేకింగ్ మీద అభిరుచితో "పెళ్లిలో పెళ్లి్ణ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశాను. నేనూ మీతో పాటే థియేటర్స్ లో చూడబోతున్నా. ు. డైరెక్టర్ శ్రీకాంత్ సంబరం మాట్లాడుతూ, మా ఈవెంట్ కు పిలవగానే వచ్చిన ఆకాష్ జగన్నాథ్‌కి థ్యాంక్స్. ఆయనను ఇన్వైట్ చేసేప్పుడు నేను దేవుడిలా భావించే పూరి జగన్నాథ్‌ని కలిశాను. షోలాపూర్‌కు తెలుగు వాళ్లు వెళ్లి వందేళ్లవుతోంది. భరణి మా మూవీలోకీ రోల్ చేశారు. ఈ చిత్రం మా అందరికీ ఒక ఎమోషనల్ జర్నీ. ఆ ఎమోషన్ ప్రేక్షకులకు కూడా రీచ్ అవుతుందని నమ్ముతున్నాం. ఎంఎల్ రాజా ఇచ్చిన మ్యూజిక్ మా మూవీకి సోల్ లాంటిది. మాలాంటి కొత్త వాళ్లకు సపోర్ట్ ఇచ్చి నిలబెట్టాల్సింది మీరే. అన్నారు. యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ, ఇది పోస్టర్ లాంఛ్‌లా లేదు ప్రీ రిలీజ్ ఈవెంట్ లా గ్రాండ్ గా చేశారు. ఈ సినిమా టీమ్ చూస్తుంటే అంతా యంగ్ స్టర్స్ ఉన్నారు. ఎంకరేజ్ చేస్తున్న ప్రొడ్యూసర్ గణేష్ కోలికి, డైరెక్టర్ శ్రీకాంత్‌కి నా అభినందనలు. ఈ సినిమాలో కీ రోల్ చేసి ఈ టీమ్ కు సపోర్ట్‌గా ఉన్న భరణికి కూడా థ్యాంక్స్. సినిమా కూడా మంచి కంటెంట్‌తో ఆకట్టుకుంటుందనే నమ్ముతున్నా. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. అన్నారు.

# రాఘవ లారెన్స్ హీరోగా 'బుల్లెట్టు బండి'



యువ సామ్రాట్ నాగచైతన్య లాంచ్ చేసిన రాఘవ లారెన్స్ 'బుల్లెట్టు బండ్ణి థ్రిల్లింగ్ టీజర్ డైరీ సినిమాతో సక్సెస్ సాధించిన నిర్మాత ఫైవ్ స్టార్ క్రియేషన్స్ కతిరేసన్ మళ్లీ దర్శకుడు ఇన్నాసి పాండియన్‌తో జట్టుకట్టారు. రాఘవ లారెన్స్ హీరోగా సూపర్‌నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ 'బుల్లెట్టు బండ్ణి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకోస్తున్నారు. రాఘవ లారెన్స్‌తో పాటు ఆయన తమ్ముడు ఎల్విన్ కూడా లీడ్ రోల్ చేస్తున్నారు. ఫాస్ట్ పేస్‌తో సాగే ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కుతోంది. యువసామ్రాట్ నాగచైతన్య ఈరోజు బుల్లెట్టు బండి టీజర్‌ను లాంచ్ చేశారు. 80, 90ల్లో అభిమానుల డ్రీమ్ గర్ల్‌గా వెలుగొందిన డిస్కో శాంతి శ్రీహరి ఈ సినిమా ద్వారా 28 ఏళ్ల తర్వాత సినీ రంగంలోకి తిరిగి అడుగుపెడుతున్నారు. 1997 తర్వాత ఆమె సినిమాల్లో నటించలేదు. ఈ సినిమాలో ఆమె ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు. చెన్నై, తేంకాసి, కేరళతో పాటు పలు అద్భుతమైన లొకేషన్లలో షూట్ జరిగింది. వైశాలి రాజ్, సునీల్, అరవింద్ ఆకాష్, కాలీ వెంకట్, రంగరాజ్ పాండే, ఆర్. సుందరరాజన్, చామ్స్, శివ శరా, కేపీవై వినోత్, విజే థనిక్రై, సెంద్రాయన్ వంటి పలువురు నటులు ముఖ్య పాత్రల్లో నటించారు. దర్శకుడు ఇన్నాసి పాండియన్ మాట్లాడుతూ, ఇది ఫుల్ లెంగ్త్ సూపర్‌నేచురల్ యాక్షన్ థ్రిల్లర్. ఈ జానర్‌ను ఆడియన్స్‌కు టీజర్ అద్భుతంగా కన్వే చేస్తోంది. మొదట ఈ కథను నా డెబ్యూ ఫిల్మ్‌గా డైరెక్ట్ చేయాలనుకున్నా, కొన్ని కారణాల వల్ల సాధ్యపడలేదు. కాబట్టి ఇప్పుడు రెండో సినిమాగా చేశాను. నన్ను ఎంతగానో సపోర్ట్ చేసిన నిర్మాతలకి థ్యాంక్స్." అన్నారు.

# జొన్న పొట్టుతో బొమ్మలు



మనసు పెట్టాలే కానీ... మన చుట్టూ ఉన్న వ్యర్థాలతోనూ అద్భుతాలు చేయొచ్చు. అలాంటి ప్రయత్నంలోనే వెళ్లి చాచేయా... మొక్కజొన్న పొట్టుతో అందమైన బొమ్మల్ని రూపొందించారు. దీంతో తాను ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. మరి ఈ పర్యావరణహిత ప్రయాణాన్ని మనమూ తెలుసుకుందామా! వెల్లి చాచేయాది మణిపూర్‌లోని సేనాపతి ఏర్పాటు ఓ మారుమూల గ్రామం. ఆమె జీవనోపాధికోసం పూలను సేకరించిన అమ్మేది అయితే, ఓ రోజు కూరగాయల వ్యర్థాలు పారేస్తున్నప్పుడు... మెత్తగా ఉండే మొక్కజొన్న పొట్టు ఆమెను ఆకర్షించింది. చక్కటి టెక్స్చర్, ఆకృతితో ఉన్న దానితో ఏదైనా చేయొచ్చా అన్న ఆలోచన చేసిందట. వాటిని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రయోగలెన్నో చేసింది. చివరికి పీచు, పొట్టు, పొత్తు... అన్నీ ఉపయోగించి అందమైన అమ్మాయి బొమ్మను రూపొందించింది. దానికి అక్కడక్కడా రంగులద్దింది. ఆపై ఆ బొమ్మను తన పూల దుకాణంలో పెట్టిందట. మొదట్లో ఎవరూ అది వ్యర్థాలతో చేసిందని అనుకోలేదట. ఖాతాదారుడు ఒకరు దాన్ని కొలుగోలు చేయడానికి ముందుకు రావడంతో.. దాన్ని వ్యాపారంగా మలచుకోవాలి. మొక్కజొన్న పొట్టు, సేకరించి ఎండబెట్టి వాటిని బొమ్మల్లా మార్చడం ఆరంభిం చింది. వాటికి సహజ రంగులద్ది. సహజపదార్థాలతో చేసిన ఈ బొమ్మ బయోడిగ్రేడబుల్ కూడా కావడంతో అమ్మకాలు పెరిగాయి. లక్షల రూపాయల ఆదాయమూ అందుతోంది. అంతా చేత్తోనే చేయడం, దీనికి ఎక్కువ సమయం పట్టడం



వంటి కారణాలతో మరికొంతమంది మహిళలకూ ఈ కళను నేర్పించింది. వారూ దీన్ని వ్యాపారంగా మలచుకుని ఇంటి నుంచే స్వయం ఉపాధిని అందుకుంటున్నారు. మంచి ఆలోచన కదూ! □

# ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి



**శ్రావణమాసం రాగానే అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఓ గొప్ప పండుగ రాఖీ పండుగ. అన్నదమ్ములకు రాఖీ కట్టాలని అక్కాచెల్లెళ్ళు ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటారు. అలాగే అన్నదమ్ములు కూడా రక్షాబంధన్ వేడుక కోసం ఎదురు చూస్తుంటారు. ఈ పండుగని రక్షాబంధన్ అని, రాఖీ పౌర్ణమి అని, జంధ్యాల పౌర్ణమి అని పిలుస్తారు. రక్షాబంధన్ పవిత్రమైన బంధం. అన్నా చెల్లెళ్ళ మధ్య అక్క తమ్ముళ్ళ మధ్య స్వచ్ఛమైన, నిష్కల్మషమైన ప్రేమకు నిదర్శనమే ఈ రాఖీ పండుగ.**

శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి తిథినాడు ఈ పండుగని జరుపుకుంటారు సోదరి కట్టే రాఖి సోదరునిపై గల అమితమైన ప్రేమకు ఓ తీపి గుర్తు. అంతేకాదు సోదరుల చేతికి రాఖీ కట్టి వారు పది కాలాలపాటు చల్లగా ఉండాలంటూ మనసారా కోరుకునే వ్యక్తి సోదరి. సోదరుడు రాఖీ కట్టిన సోదరిని అనుక్షణం కంటికి రెప్పలా కాపాడు కుంటానని హామీ ఇస్తాడు. సోదరీమణుల ఆప్యాయత, సోదరుల అనురాగం అమ్మా నాన్నల్లో సగమై తోడు నీడై ఉండే అన్నల పండుగ రాఖీ. ఒకే అమ్మ కడుపున పుట్టిన ఈ రక్తసంబంధం జీవితాంతం ఆనందంగా కొనసాగాలని, ఒకరికొకరు రక్షణగా ఉండాలని ఓ చిన్ని రంగుపూల తాడు సాక్షిగా కోరుకుంటారు. సోదరుడు కూడా తనకు రాఖీ కట్టిన సోదరిని జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకుంటూ కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని రాఖీ పండుగ గుర్తు చేస్తుంది.





రక్షాబంధన్‌లో "రక్ష" అంటే రక్షించడం అని అర్థం. అందుకే ప్రతి ఒక్క సోదరి తమ సోదరులకు రక్షా సూత్రం కడతారు. ఈ రక్షాబంధన్ కి సంబంధించిన అనేక పురాణ కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ పురాణ గాధల గురించి మనం మన పిల్లలకి, తరువాతి తరాల వారికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. అందులో మనం ఒక కథ గురించి తెలుసుకుందాం. ఇంద్రుని ఇంటిపై ఓ రాక్షసి దాడి చేసి ఆక్రమించుకుంటుంది. అప్పుడు ఇంద్రుని సతీమణి రాక్షసి గురించి చెప్పి తనకు సహాయం చేయమని శ్రీ మహా విష్ణువు వద్దకు వెళ్ళి వేడుకుంటుంది. అప్పుడు ఇంద్రుని కాపాడటానికి విష్ణువు తన మణికట్టు చుట్టూ ఒత్తితో తయారు చేసిన ఓ పవిత్రమైన దారాన్ని కట్టాలని సూచిస్తాడు సచీదేవికి. అప్పుడు సచీదేవి ఆ విధంగానే విష్ణుమూర్తి చేతికి పవిత్రమైన దారాన్ని కడుతుంది. సోదరి కోరిక మేరకు విష్ణు దేవుడు ఆ రాక్షసిని నాశనం చేస్తాడు. అప్పటి నుంచి రాఖీ పౌర్ణమి వెలుగులోకి వచ్చింది. ఈ పండుగకి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యంలో ఉంది. పురాణాల ప్రకారం శ్రీకృష్ణుడు శిశుపాలుని రక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించినప్పుడు శ్రీకృష్ణుని చూపుడు వెలికి గాయం అవుతుంది. అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగును చింపి శ్రీకృష్ణుడి చేతికి కడుతుంది. అప్పుడు శ్రీకృష్ణుడు ద్రౌపదికి ఒక హామీ ఇస్తాడు. ఎల్లవేళలా నీకు నేను ఓ అన్నగా అండగా ఉంటానని భరోసానిస్తాడు. ఇదిలా ఉండగా ఒకసారి దుశ్శాసనుడు నిండు సభలో ద్రౌపదికి వస్త్రాపహరణ చేసి అవమానిస్తున్న సమయంలో శ్రీకృష్ణుడు ఓ అన్నగా ఆమెను కాపాడే క్రమంలో రక్షణగా నిలిచాడు అని మన పురాణాలు చెబుతున్నాయి. ఈ రెండు పురాణ గాధలు కూడా శ్రావణమాసంలో పౌర్ణమి రోజున జరగడం గొప్ప విశేషం. అందుకే ఈ రోజున సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు గుర్తుగా రాఖీ పండుగని మనమంతా జరుపుకుంటున్నాము. చాలామందికి రాఖీ ఎప్పుడు కట్టాలి అనే సందేహం ఉంటుంది. రాఖీ భద్రా ముహూర్తంలో కట్టాలి. దీనిని గురించి తెలుసుకుందాం. పురాణాల ప్రకారం సూర్యుని కుమార్తె భద్రమాత. సూర్య భగవానుడికి, ఛాయాదేవికి జన్మించినటువంటి భద్ర శనిదేవుని సోదరి. ఈమె లోకాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలనే సంకల్పంతో అందరిని ఇబ్బంది పెడుతుంటుంది. అప్పుడు బ్రహ్మదేవుడు భద్రకు బుద్ధి చెప్పాలనుకొంటాడు. ఆమె నిత్యం అంతటా సంచరిస్తూ ఉంటుంది. ఆమె ఎక్కడ ఉంటే అక్కడ మంచిది కాదు అని చెప్తారు. కాబట్టి మనం ప్రతిరోజు కూడా కరణమని, నక్షత్రమని, యోగమని, దుర్ముహూర్తమని ఇవన్నీ మనకి తటస్త పడుతుంటాయి. ముఖ్యంగా ఈ రాఖీ పండుగ రోజున రాఖీ కట్టేటప్పుడు ఈ భద్రా ముహూర్తం అనేది చూసుకోవాలి. భద్ర ఉన్నచోట మంచిది కాదు కాబట్టి భద్రా ముహూర్తం చూసుకొని రాఖీ కట్టాలి. అయితే ఈ 2025వ సంవత్సరంలో ఆగస్టు 9వ తేదీ శ్రావణ పౌర్ణమి రోజున ఉదయం సూర్యోదయం లోపలే భద్ర ముహూర్తం వెళ్లిపోతుంది. కాబట్టి సూర్యోదయం తర్వాత ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట 30 నిమిషాలలోపు రక్షాబంధన్‌ని కట్టుకోవచ్చు.



ఈ రాఖీ కట్టే ముందు తలస్నానం చేసి కొత్త బట్టలు ధరించి రాఖిని దేవుడి మందిరంలో పెట్టి దీపారాధన చేయాలి. ఆపై తిపి పదార్థాన్ని నివేదన చేయాలి. సోదరుని నుదుట కుంకుమ పెట్టి హారతి ఇచ్చి మంత్రం పటించి రాఖీ కట్టాలి. ఈ రాఖీ కట్టేటప్పుడు పట్టించాల్సిన మంత్రం **"యేన బద్ధో బలిరాజా/ దానవేంద్రో మహాబలః/ తేన త్వమభి బధ్నామి/ రక్ష మాచల మాచల"** (దీని అర్థం ఓ రక్షా బంధమా మహా బలవంతుడు రాక్షస రాజు అయిన బలి చక్రవర్తిని బంధించాము కాబట్టి నేను నిన్ను రక్షిస్తున్నాను) అంటూ ఈ మంత్రాన్ని జపించి రాఖీ కట్టాలి కట్టిన తర్వాత అన్న దగ్గర ఆశీర్వాదం తీసుకొని తీపి పదార్థం తినిపించాలి. సోదరుడు సోదరికి ఓ చక్కని బహుమతిని ఇస్తాడు. ఈ రాఖీ పౌర్ణమిని "జంధ్యాల పౌర్ణమి" అని అంటారని అనుకున్నాం కదా. దాని గురించి కూడా తెలుసుకుందాం. వివాహాది శుభకార్యాలలో ఉపనయనానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. మొదటిసారి ఉపనయనం(ఒడుగు) చేసుకున్నటువంటి వటువు శ్రావణ పౌర్ణమి వరకు ఆ జంధ్యాన్ని ధరిస్తాడు. ఈ శ్రావణ పౌర్ణమి రోజున ఉపనయనయనం రోజున కట్టిన జంధ్యాన్ని తీసివేసి పూజ చేసుకుని కొత్త జంధ్యాన్ని ధరిస్తాడు. ఇలా మొదటిసారి ఉపనయనం అయిన వటువు ఈ రోజునే జందాన్ని మారుస్తాడు కాబట్టి ఈ రాఖీ పౌర్ణమిని 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా అంటారు. అలాగే ఇంతకుముందు ఉపనయన చేసుకున్న వారు కూడా ఉన్న జంధ్యం మార్చి కొత్త జంధ్యం ధరిస్తారు శుభాలు కలగాలని. ఇంతటి విశిష్టతలు సంతరించుకున్న ఈ రాఖీ పౌర్ణమిని సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు, అనురాగాలకి, అభిమానానికి చిహ్నంగా పురాణ కాలం నుంచి మనమంతా జరుపుకుంటున్నాము. ఇలా మనమంతా వసుదైక కుటుంబంలోని వ్యక్తులు లాగా ఆ చంద్రార్కం ఈ భూమి ఆకాశాలు ఉన్నంతవరకు చిరంజీవిలుగా వెలిగిపోవాలని కోరుకుంటూ సోదరులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు, జేజేలు, వందనాలు.

**- పింగళి భాగ్యలక్ష్మి**

# సంప్రదాయ 'కటాన్' చీరెలు

ఫ్యాషన్ ఫ్యాషన్



అన్ని మాసాల్లో మగువలు మనసు పారేసుకునేది ఏదంటే శ్రావణం అని కచ్చితంగా చెప్పేస్తాం కదూ! ఇది కేవలం పూజలు, వ్రతాలకే కాదు... మోడరన్ నెట్‌వర్కింగ్‌కో నెలవే అదనంగా పెళ్లి సందడి: ప్రతిఒక్కరూ సంప్రదాయానికి ప్రతిరూపం సిద్ధమవుతారు. బీరువాలోని పట్టుచీరలూ బయటికి వచ్చేస్తాయి. వరలక్ష్మీ వ్రతానికి అయితే ఓ కొత్త పట్టుచీర మన కలెక్షన్లలో చేరిపోతుడా అన్నట్టు ఈ వ్రతానికి ఏ చీర కొన్నారు? ఏం కొనాలని ఆలోచిస్తోంటే 'కటాన్'కి ఓటేయొచ్చు బనారసీ పట్టుచీర తెలుసుగా! దానిలో ఓ రకమే ఈ కటాన్, మొగలుల కాలం నాటినుంచీ ఉందట. ఫ్యాషన్ ప్రపంచంలో దీని గురించిన పేరేంటో తెలుసా? 'ఎవర్‌గ్రీన్' అనే! కట్టుకున్నవారికి ఎలిజెంట్ లుక్‌ని తెస్తుంది. ఈ చీర తయారీకి స్వచ్ఛమైన మల్బరీ సిల్క్ దారాల్ని మెలితిప్పి నేస్తారట. దీనివల్ల చీర దృఢంగానే కాదు... మెత్తగా, మృదువుగానూ ఉంటుందట. కాబట్టే, ప్రపంచవ్యాప్తంగా ఈ చీరలకు ఆదరణ ఎక్కువ. జరీవర్క్, గంటలు, నెమళ్లు, మోటిఫ్లతో కూ వాటిని సంప్రదాయ కటాన్లనీ... ముదురు రంగుల్లో ఆధునిక డిజైన్లను అద్దుకున్న వాటిని మోడరన్ కటాన్ చీరలనీ పిలుస్తారు. నిజానికి ఎక్కువగా తయారయ్యేది వారణాసిలోనే కానీ పుట్టుక జరిగింది మాత్రం పర్షియాలో అని చెబుతారు











# ఆరోగ్య భాగ్యం

✦ చింతగింజలను తేనెతో గంధముతీసి పచ్చకూర్పరమును చేర్చి కంటిలో వేసుకొనిన కన్నులు నిర్మలముగా వుండును. ✦ మజ్జిగలో సుద్ద (సున్నము) కలిపి రాసిన కాలిన పుండ్లు మానును. □

# పొన్నగంటి కూర ప్రయోజనం-2

చెలి చిట్కా



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి


**ఆరోగ్య ప్రయోజనాలు:** అధిక పోషక విలువలున్న పొననగంటికూర అనేక ఆరోగ్యప్రయోజనాల్ని కల్గిస్తుంది. **కన్ను :** కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేసేవారికి, వీడియెగేమ్స్, సెల్, టివిలు ఎక్కువగా చూసేవారికి, ఎండలో ఎక్కువగా తిరిగేవారికి, ఎండలో పనిచేసేవారికి, యు.వి.లైట్ ప్రభావాన్ని తగ్గించి అనేక కంటిసమస్యల్ని రాకుండా ఆరికడుతుంది. పిల్లల్లో రేచీకటి, దృష్టి లోపాలు రాకుండా కళ్ళజోడు అవసరం లేకుండా చేస్తుంది. అలాగే వృద్ధాప్యంలో వచ్చే కంటి సమస్యలు శుక్లాలు, అంధ్యత్వం ఆప్తాల్మియా, కంటికలక, కంటికురుపులు కంటిచూపుకి, కంటి క్రింద నల్లని వలయాలు వంగి దాదాపు 100 రకాల కంటిసమస్యల్ని రాకుండా, తగ్గించే అద్భుతమైన ఆకుకూర. **స్థూలకాయం :** బరువు తొగ్గాలనుకునేవారు దీన్ని తీసుకుండే మంచిది. పిల్లలు బరువు పెరగాలనుకునేవారు పప్పు, నెయ్యితో తింటే బరువు పెరుగుతారు. గోధుమ, బియ్యం, ఓట్స్‌లో కంటే 30% అధిక ప్రోటీన్స్ ఉండడం వల్ల పిల్లలు, స్త్రీలు, వృద్ధులకి మంచిది. **బి.పి/గుండె ఆరోగ్యం :** దీనిలోని పోషకాలు రక్తం గడ్డకట్టడాన్ని మెరుగుపరు స్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ మోతాదు, పరిమణాన్ని కాపాడుతుంది. రక్తప్రసరణని మెరుగుపరిచి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.గుండెకి బలాన్ని చేకూర్చి గుండె పోటు, గుండెజాబ్బులు రాకుండా కాపడుతుంది. **ఇమ్యూనిటీ :** ఆకుకూరలోని విటమిన్ సి, ఆంటి ఆక్సిడెంట్స్ వల్ల బాక్టీరియల్, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వర్షాకాలంలో రాకుండా రోగనిరోధకతని పెంపొందిస్తుంది. వర్షా కాలంలో ఎక్కువగా వచ్చే జలుబు, దగ్గు, గొంతునొప్పి, క్షయ, ఆస్థా, బ్రాంకైటిస్, ఇంటర్ మిటెంట్ జ్వరాలు, కఫ సంబంధమైన, దీర్ఘకాలిక వ్యాధులకి ఇది మంచి ఆహారం, కరోనా, హెచ్ఐవి, సార్స్ వంటి క్రొత్త వైరస్ వ్యాధులకి మంచి ఔషధం, **లివర్‌స్ప్లీన్ :** త్రాగుబోతుల్లో, డ్రగ్స్ వాడేవారిలో, దీర్ఘకాలిక అనారోగ్యాల వల్ల లివర్ మందకొడిగా పనిచేయడం వల్ల వచ్చే అనేక అనారోగ్యకర కాలేయ వ్యాధులకి మంచి ఆహారంగా ఔషధంగా పనిచేస్తుంది. కాలేయ కణజాలాన్ని, దాని తీరుని మెరుగుపరుస్తుంది. స్ప్లీన్‌వ్యాధులకిది మంచిది. లివర్‌ని డీటాక్స్ చేస్తుంది. **ఎముకలు :** దీనిలోని అధిక కాల్షియం, ఫాస్పరస్ మెగ్నీషియం వంటి పోషకాల వల్ల పిల్లలు ఎత్తు పెరుగుతారు. పిప్పిపళ్ళు, చిగుళ్ళ సమస్యలురావు. శాశ్వత దంతాలు త్వరగా వస్తాయి. ఎముకల ఎదుగుదలకి, దృఢత్వానికి చాలా మంచిది. దీనివల్ల నడుంనొప్పి, తుంటి నొప్పి, ఆస్టియోఫోరోసిస్, మెడనొప్పి, కీళ్లనొప్పులు, మెకాళ్ళనొప్పులు, కండరాల, నరాల నొప్పులు తగ్గుతాయి. **జీర్ణక్రియ :** ఆకలిని కల్గించి, శరీరంలో వేడిని తగ్గించి చలువ చేస్తుంది. అజీర్ణం, ఎసిడిటీ, మొలలు, వాంతులు విరేచనాలు మల బద్దకం, అరుచి, నోరుదుర్వాసన, నోటి అల్సర్‌ని తగ్గిస్తుంది. కడుపులో నులిపురుగుల్ని లేకుండా జీర్ణక్రియని మెరుగుపరుస్తుంది. **సౌందర్య పోషణ: జుట్టు:** వెంట్రుకలకి పోషణనిచ్చే బయోటిన్ సమృద్ధిగా ఉండడం వల్ల జుట్టు రాలడం, తెల్లబడడం వంటి కేశ సమస్యలు తగ్గి జుట్టు వత్తుగా, నల్లగా ఉంటుంది. **చర్మం:** దీనిలోని సహజసిద్ధమైన నూనెలు, పోషకాలు చర్మం సహజ సౌదర్యాన్ని కల్గిస్తుంది. చర్మంకాంతితో, మృదువుగా ఉంటుంది. మొటిమలు, నల్లని మచ్చలు, మంగు మచ్చలు, అధిక పుటు మచ్చలు, బ్లాక్‌హెడ్స్, దురదలు, మంటలు, అరిచేయి, అరికాళ్ల పగుళ్ళు, రక్త స్రావాలు, పుండ్లు, గాయాలు వంటి చర్మవ్యాధుల్ని తగ్గిస్తుంది. □

# నిమిత్తమాత్రులం!

కలియుగంలో న్యాయం ధర్మాలను, నీతి నిజాయితీలను పరిరక్షించే బాధ్యతను ఏడుకొండలవాడు తీసుకున్నాడు. ఎవరైనాసరే తిరుమల పవిత్రకు భంగం కలిగిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇది చాలా విషయాలలో చాలా సార్లు రుజువైంది కూడా. భక్తవశంకరుడై, కోరిన కోరికలు తీర్చే కలియుగ దైవమై భాసిల్లుతున్నాడు శ్రీనివాసుడు. భక్తులందరికీ వారివారి మనోసంకల్పాను సారంగా వరాలిచ్చి, వరాల దేవుడన్న బిరుదును గ్రహించాడు. వేంకటాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి అత్యంత ప్రభావం కలవారనే విషయం మనకందరికీ తెలిసిందే! వేంకటేశ్వరుడు యొక్క దివ్యమంగళ విగ్రహంలో కనిపించే తేజస్సు, ఆయన సన్నిధానంలో ఎంత సేపయినా అలాగే నిలిచిపోదామా అనే కోరికను కలిగిస్తుంది. కానీ, ఆయన దివ్యరూపాన్ని ఒక్క నిమిషానికి మించి చూడలేము. కారణం 'క్యూ' వరుసలో నిలబడే భక్తుల రద్దీయే! స్వామివారిని దర్శించి, అర్చించిన ప్రతివారి హృదయం అత్యంత ఆనందంతో నిండిపోతుంది. మొక్కుబడులు తీసుకోవడంలో ఆయనకు ప్రత్యేక ఆనందం ఉన్నట్టుంది. ఎన్ని జన్మలెత్తినా ఆయన రూపం నిత్యం మన మనస్సులో నిలబడి పోతుందంటే అతిశయోక్తికాదు. నిత్యకల్యాణం, పచ్చతోరణమై విలసిల్లే తిరుమల క్షేత్రాన్ని కలియుగ వైకుంఠం అంటారు. ఆయన మహిమలు అనంతం. నిత్యం స్వామివారికి జరిగే దీప దూప నైవేద్య అర్చన కార్యక్రమాన్ని, ఆయనకు జరుపబడే ఉత్సవాలను కోటానుకోట్ల భక్తులు చూసి తరిస్తున్నారు. □


ఆధ్యాత్మికం

# పరిమళంతో జ్ఞాపకశక్తి మెరుగు..



పరిమళద్రవ్యాల వాసనలతో బయటకి తేవొచ్చని పిట్స్ బర్గ్‌స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధన బృందం తాజాగా ఓ అధ్యయనంలో తేల్చింది. జ్ఞాపకం తెచ్చుకోవడం కోసం తీవ్రంగా ఆలోచించేటప్పుడు మెదడు వెంటనే స్పందించాల్సి ఉంటుంది. అయితే తీవ్ర ఒత్తిడివల్ల మెదడులోని అక్కడి భాగం నియంత్రణకు గురవుతుంది. ఈ సమస్య ఉన్న కొందరికి కాఫీ గింజలు, లవంగ మొగ్గలు, నారింజ ఎసెన్షియల్ ఆయిల్ వంటివాటితో చేసిన కొన్నిరకాల పరిమళనద్రవ్యాల వాసనలను చూపించారు. దాంతో దూరమైన వారి జ్ఞాపకాలు క్రమేపీ తిరిగి రావడం మొదలయ్యాయి. చిన్న చిన్న విషయాలను అమ్మకిస్తే జాగ్రత్తగా దాస్తుందని, పిల్లలు వస్తువులను మనకిస్తారు. తీరా తిరిగి వాళ్లడిగినప్పుడే చిక్కంతా. జాగ్రత్తగా దాచిపెట్టామని మాత్రమే గుర్తుంటుంది. అయితే.. ఎంతకూ జ్ఞాపకం రాదు. పని ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి ఎదురైనప్పు జ్ఞాపకశక్తి దూరమవుతుంది. అలాగే మెనోపాజ్ సమయంలోనూ ఇది తగ్గుతుంటుంది. దీన్ని తిరిగి తీసుకురావడంలో పరిమళద్రవ్యాలు సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడులో మరుగున పడే జ్ఞాపకాలను తిరిగి కూడా ఒత్తిడి మర్చిపోయేలా చేస్తోంది. అందుకే ఉదయం ఇంటిపని మొదలుెఎట్టేటప్పుడు లేదా రాత్రి నిద్రపోయే ముందు గదిని సహజసిద్ధమైన పరిమళాలతో నింపితే చాలు. జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. మరిగించిన ముప్పావుకప్పు నీటిలో నాలుగు టేబుల్‌స్పూన్ల తులసి ఆకులు వేసి రెండు నిమిషాలు మరగనిచ్చి చల్లార్చాలి. దీన్ని వడకట్టి స్ప్రే సీసాలో నింపాలి. ఇందులో ముప్పావు కప్పు డిస్టిల్డ్ వాటర్, అయిదు చుక్కల నిమ్మ ఎసెన్షియల్ ఆయిల్ వేసిబాగా కలపాలి.ఈ మిశ్రమాన్ని ఇల్లంతా స్ప్రే చేస్తే చాలు. అలాగే చిన్న గిన్నె లేదా మట్టికుండలో గుప్పెడు నారింజపండు ముక్కలు ఏడెనిమిది లవంగాలు, చిన్నచిన్నగా కట్ చేసిన అయిదారు దాల్చినచెక్క ముక్కలను వేయాలి. ఇవి మునిగేలా నీటిని పోసి బాగామరిగిస్తే చాలు.ఇల్లంతా సువాసనతో నిండుతుంది. కుండీలో విరిసిన గులాబీలు నాలుగింటిని వాజ్‌లో ఉంచి భోజనబల్ల లేదా టీపాయిపై సర్దాలి. గులాబీల పరిమళం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తూనే ఉల్లాసంగానూ ఉంచుతుంది. □

# జలుబుకు శొంఠి



వర్షాలు పడుతున్నాయి. ఈ ముసురుకి జలుబు, దగ్గు, జ్వరం.. ఇట్టే వచ్చేస్తుంటాయి. వీటితో పాటు అజీర్తి, వికారం వంటి వాటిని త్వరగా తగ్గించడానికి శొంఠి చక్కటి పరిష్కారం. ఇది మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. అవేంటో? ఇంతకీ దీన్ని ఎలా వాడాలో చూద్దామా.. ఆగని తుమ్ములు, జ్వరం వచ్చిన భావన.. ఏపనీ చేయనివ్వవు. ఇలాంటప్పుడు శొంఠిపొడికి చిటికెడు బెల్లం ముక్క కలిపి రోజూ తిని చూడండి. జలుబు పరారవుతుంది. లేదంటే చిన్న శొంఠి ముక్క, రెండు లవగంగాలు, కాస్త పసుపు, ఉప్పు నీళ్లల్లో వేసి మురిగించి, గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగితే సరి. గొంతు గరగర తగ్గుతుంది. ఈ కాలంలో అన్నం తినేటప్పుడు మొదటి ముద్దలో కాస్త శొంఠి పొడి, ఆవునెయ్యి కలిపి తినండి ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అజీర్తిని పోగొట్టి, ఆకలిని పుట్టిస్తుంది. వేడి నీళ్లల్లో శొంఠి పొడిని కలిపి మరగించి, అరచెంచా తేనె కలిపి తాగితే, ఇది శరీరంలోని కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. □

# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్..
# టీమిండియాకు అగ్ని పరీక్ష



## 5 మ్యాచ్‌ల్లో 2 గెలుపు
## మరో ఐదు సిరీస్‌లను గెలవాల్సిందే

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో పాల్గొనడం టీమిండియాకు పెద్ద అగ్ని పరీక్ష అయింది. ఇప్పటికే ఇంగ్లాండ్‌తో సిరీస్ ఆడిన తర్వాత, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లు ఆడాల్సి ఉంది. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను టీమిండియా ఆడింది. ఈ రెండు జట్ల మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ 2-2తో డ్రాగా ముగిసింది. ఈవిధంగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో టీమ్ ఇండియా ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడింది. వాటిలో రెండు గెలిచి, మరో రెండింటిలో ఓడిపోయి, ఒకటి డ్రాగా ముగిసింది. ఫలితంగా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం టీమిండియా మూడవ స్థానంలో ఉంది. ఇప్పుడు ఈ సైకిల్‌లో టీమ్ ఇండియా మరో ఐదు జట్లతో టెస్ట్ సిరీస్‌లు ఆడాల్సి ఉంది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాలంటే వీటన్నింటినీ గెలవడం టీమిండియాకు చాలాముఖ్యం. ఇందులో భాగంగా టెస్ట్ సిరీస్‌ల షెడ్యూల్ సెప్టెంబర్ 9 నుండి ప్రారంభమయ్యే 2025 ఆసియా కప్‌లో టీం ఇండియా ఆడాల్సి ఉంది. ఆ టోర్నీ చివరి మ్యాచ్ సెప్టెంబర్ 29న జరుగుతుంది. ఇది ముగిసినతర్వాత, భారత జట్టు అక్టోబర్ 2025లో స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ అక్టోబర్ 2 నుండి అహ్మదాబాద్‌లో, రెండవ మ్యాచ్ అక్టోబర్ 10 నుండి ఢిల్లీలో జరుగుతుంది. ఈ టెస్ట్ సిరీస్ తర్వాత, శుభ్‌మాన్ గిల్ అతని, బృందం నవంబర్ నెలలో స్వదేశంలో దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. మొదటి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 14 నుండి, రెండవ టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22 నుండి ప్రారంభం అవుతాయి. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఆడిన తర్వాత, భారత జట్టు ఆగస్టు 2026లో శ్రీలంకలో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో రెండు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతుంది.

ఈ మధ్యలో టీం ఇండియా టి20 ప్రపంచ కప్ 2026, ఒవిడి టి20 మ్యాచ్‌లు ఆడాలి. భారత దేశం నవంబర్ 2026లో న్యూజిలాండ్‌లో రెండు టెస్ట్ మ్యాచ్‌లు, మూడు వన్డేలు, ఐదు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో టీమ్ ఇండియా తన చివరి టెస్ట్ సిరీస్‌ను 2027 జనవరిలో ఆస్ట్రేలియాతో ఆడనుంది. ఈ టెస్టును టీమ్ ఇండియా స్వదేశంలో ఆడనుంది. టీమిండియా మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లో ఎంత వరకూ ఆధిక్యం సాధించి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌కు అర్హత సాధిస్తుందనేది ప్రశ్నార్థకమవుతోంది.




### బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
## సెమీ ఫైనల్‌కు భారత్ బాక్సర్లు
### దేశానికి 14 పతకాలు ఖరారు

**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2025, అండర్ 19లో ఐదుగురు భారతీయ పురుష బాక్సర్లు సెమీఫైనల్‌కు చేరుకున్నారు. దీంతో యువత విభాగంలో భారత్‌కు మొత్తం 14 పతకాలు ఖాయం అయ్యాయి. థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ సెమీ ఫైనల్స్‌లో ఐదుగురు భారతీయ పురుషుల బాక్సర్లు, తొమ్మిది మంది మహిళా బాక్సర్లు తమ తమ వెయిట్ కేటగిరీలలో సెమీఫైనల్‌కు చేరుకుని పతకాలను ఖాయం చేసుకున్నారు. శివం (55 కిలోలు), మోసమ్ సుహాగ్ (65 కిలోలు), రాహుల్ కుందు (75 కిలోలు), గౌరవ్ (85 కిలోలు), హేమంత్ సంగ్వాన్ (90 కిలోలు) తమ ప్రత్యర్థులను అద్భుతంగా ఓడించి, అండర్ 19 విభాగంలో భారత్ 12 పతకాలతో తిరిగి వచ్చేలా చూసుకున్నారు. ఉదయం సెషన్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అబ్దులాజీజ్ అబ్దునజరోవ్‌పై పూర్తిగా ఆధిపత్యం చెలాయించిన శివం 5:0 తేడాతో విజయం సాధించి భారత విజయ యాత్రను ప్రారంభించాడు. ఆ తర్వాత మోసమ్ సుహాగ్ 65 కిలోల క్వార్టర్ ఫైనల్స్‌లో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ముఖమ్మద్ అలింబెకోవ్‌పై 3:2 తేడాతో విజయం కొనసాగించాడు. ఆ తర్వాత రాహుల్ కుందు దక్షిణ కొరియాకు చెందిన యుంజో జియోంగ్‌పై విరుచుకుపడ్డాడు. రిఫరీ చివరికి 75 కిలోల పోటీని ఆపవలసి వచ్చింది. గౌరవ్ చివరి నాలుగు దశల్లో 85 కిలోల విభాగంలో చైనీస్ తైపీకి చెందిన కువాంగ్ యావో చెంగ్‌పై, 90 కిలోల బరువు విభాగంలో హేమంత్ సంగ్వాన్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముహమ్మద్రిజో సిద్దికోవ్‌పై విజయం సాధించారు. అయితే, 90+ కిలోల బరువు విభాగంలో ఇరాన్‌కు చెందిన అబ్బాస్ ఘర్షస్బీపై విజయం సాధించడంలో క్రిష్ విఫలమయ్యాడు.

## హాండ్రెడ్ లీగ్‌లో..
## సూపర్ ఛార్జర్స్ విక్టరీ
### 8 వికెట్ల తేడాతో వెల్ష్‌ఫైర్ ఓటమి

**న్యూఢిల్లీ:** ద హండ్రెడ్ లీగ్-2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కావ్యామారన్ ఓనర్‌షిప్‌లోని నార్త్రన్ సూపర్ ఛార్జర్స్ తొలి విజయం సాధించింది. వెల్షఫైర్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్లు తేడాతో గెలు పొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెల్ష్‌ఫైర్ నిర్ణీత 100 బంతుల్లో 9 వికెట్లు నష్టానికి 143 పరుగులు చేసింది. వెల్ష్‌ఫైర్ ఇన్నింగ్స్‌లో జానీ బెయిర్‌స్టో (42), స్టీవ్ స్మిత్ (29) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. కెప్టెన్ టామ్ ఏబెల్ 18, లూక్ వెల్స్ 0, టామ్ కోహ్లర్ కాడ్‌మోర్ 10, సైఫ్ జైబ్ 13, పాల్ వాల్టర్ 15, క్రిస్ గ్రీన్ 3, డేవిడ్ షేన్ 0, జోష్ హల్ 3 (నాటౌట్), రిలే మెరిడిత్ 7 (నాటౌట్) పరుగులు చేశారు. సూపర్ ఛార్జర్స్ బౌలర్లలో ఇమాద్ వసీం, మాథ్యూ పాట్స్, ఆదిల్ రషీద్ తలో 2 వికెట్లు తీయరగా, మొహ్మాద్ అమిర్, టామ్ లాస్ చెరో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బరిలోకి దిగిన సూపర్ ఛార్జర్స్ మరో 11 బంతులు మిగిలి ఉండగానే కేవలం 2 వికెట్లు కోల్పోయి 144 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. జాక్ క్రాలే (38 బంతుల్లో 67, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హ్యారీ బ్రూక్ (15 బంతుల్లో 25 నాటౌట్, ఫోర్, 2 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడి సూపర్ ఛార్జర్స్‌ను విజయతీరాలకు చేర్చారు. డేవిడ్ మలాన్ (29 బంతుల్లో 41, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు. వెల్ష్‌ఫైర్ బౌలర్లలో రిలే మెరిడిత్‌కు 2 వికెట్లు దక్కాయి. కాగా ఈ సీజనుకు ముందే కావ్యా నేతృత్వంలోని సన్ గ్రూప్ నార్త్రన్ సూపర్ ఛార్జర్స్‌లోని మొత్తం వాటాను కొనుగోలు చేసింది.

## హాకీ ఛాంపియన్‌గా పంజాబ్




**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా సబ్ జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో హాకీ పంజాబ్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. డివిజన్ ఎ ఫైనల్‌లో హాకీ జార్ఖండ్‌ను 4-3 తేడాతో ఓడించి పంజాబ్ జట్టు విజేతగా నిలిచింది. జార్ఖండ్, పంజాబ్ మధ్య శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఈ పోరులో రెండు జట్లు చివరి విజిల్ వరకు పోరాడాయి. జార్ఖండ్ రెండో క్వార్టర్‌ను ఘనంగా ప్రారంభించిన ఆశిష్ తని పూర్తి (21వ నిముషం) మరియు అనిష్ డంగ్‌డంగ్ (24వ నిముషం) వరుసగా రెండు గోల్స్ చేశారు. అయితే, అక్షిత్ సలారియా (29), వరీందర్ సింగ్ (30) వరుసగా గోల్స్ చేయడంతో హాకీ పంజాబ్ త్వరగా స్కోరును సమం చేసింది. జార్ఖండ్‌కు చెందిన సుఖు గురియా (42) ఆటను తన జట్టుకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నించాడు, కానీ పంజాబ్‌కు చెందిన మన్దీప్ సింగ్ (45, 53) డబుల్ గోల్స్ చేయడంతో పంజాబ్ జట్టు 15వ హాకీ ఇండియా సబ్ జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్ 2025 ఛాంపియన్‌గా నిలిచింది. ఇక కాంస్య పతక పోరులో ఉత్తరప్రదేశ్ హాకీ జట్టు చేతిలో హాకీ మధ్యప్రదేశ్ ఓటమి చెందడంతో టోర్నమెంట్‌లో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఈవెంట్ చివరి రోజున, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్ మొదటి అర్ధభాగంలో రెండు గోల్స్ ఆధిక్యంలో ఉంది. అయితే, చివరి రెండు క్వార్టర్లలో ఉత్తర ప్రదేశ్ మధ్యప్రదేశ్ జట్టును ఓడించింది,

### ప్రపంచ క్రీడల్లో.. టాప్ సీడ్
## అభిషేక్, మధుర నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రీడలు-2025లో టాప్ సీడ్ భారత కాంపౌండ్ మిక్స్‌డ్ జట్టు క్వార్టర్స్‌లో నిష్క్రమించింది. అయితే వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్లలో నలుగురు భారతీయ ఆర్చర్లు ర్యాంకింగ్ రౌండ్‌కు చేరుకున్నారు. శుక్రవారం చైనాలోని చెంగ్డులో జరిగిన క్రీడల్లో అభిషేక్ వర్మ-మధుర ధమన్ గోంకర్‌లతో కూడిన టాప్ సీడ్ భారత కాంపౌండ్ మిక్స్‌డ్ జట్టు క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించింది. ఈ జంట క్వార్టర్ ఫైనల్లో (151-154) దక్షిణ కొరియా మిక్స్‌డ్ టీమ్ జోడీ యీయున్ మూన్-యున్వో లీ చేతిలో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నారు. అభిషేక్ 80/80తో పరిపూర్ణ స్కోరు సాధించినప్పటికీ పతకం లేకుండానే పోటీ నుండి నిష్క్రమించారు. షాంఘై ప్రపంచ కప్ ఛాంపియన్ మధుర దారుణంగా ఆడింది. 8వ రింగ్‌లో మూడు షాట్లు కొట్టి 71/80 స్కోర్ చేసింది. ఇక నలుగురు ఆర్చర్లు అభిషేక్, మధుర, పర్నీత్ కౌర్, రిషబ్ యాదవ్ క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకోవడంతో పతక ఆశలు సజీవంగానిలిచాయి. అభిషేక్, రిషబ్ వరుసగా ప్యూర్టో రికన్, గ్వాటెమాలన్ ఆర్చర్లపై సునాయాస విజయాలు సాధించి పురుషుల కాంపౌండ్ ఈవెంట్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు. షూటాఫ్‌లో పర్నీత్ ఐదవ సీడ్ మెక్సికన్ ఆర్చర్ మరియానా బెర్నాల్‌పై విజయం సాధించింది.

# వాణిజ్యం

## సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలు తెచ్చిన ట్రంప్ కామెంట్స్

**ముంబయి, ఆగస్టు 8:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల్లో నష్టాలు కొనసాగుతున్నాయి. రష్యా చమురు పరంగా సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండబోవంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించాయి. దీనికితోడు ఎఫ్‌ఐఐల అమ్మకాలు, తొలిత్రైమాసిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయాయి. దీనితోసూచీలు వరుసగా ఆరోవారంలోకూడా నష్టాల్లోనే ముగిసాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎయిర్‌టెల్ వంటి కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని చవిచూసాయి. 24,400ను నిఫ్టీ తాకలేకపోయింది. మూడునెలల కనిష్టానికి చేరింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బిఎస్‌ఇలో నమోదిత కంపెనీల మొత్తం విలువలు రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.440లక్షలకోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 80,478.01 పాయింట్లవద్ద ప్రారంభం అయి రోజంతా నష్టాల్లోనే కదలింది. ఇంట్రాడేలో 79,775.84 వద్దకనిష్టాన్ని తాకింది. చివరికి 765.47 పాయింట్ల నష్టంతో 79,857.79వద్ద ముగిసింది. నిఫ్టీసైతం 232 పాయింట్లనష్టంతో 24,363.30 వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువలు 87.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతి ఎయిర్‌టెల్, టాటామోటార్స్, కోటక్ మహీంద్ర మహీంద్ర అండ్ మహీంద్ర, యాక్సిస్ బ్యాంకు షేర్లునష్టాల్లోముగిసాయి.

### ఐపిఒ నుంచే దూసుకుపోతున్న
## ఎన్ఎస్డీఎల్ షేర్లు..!

**ముంబయి, ఆగస్టు 8:** అంతర్జాతీయంగా పేరు పొందిన డిపాజిటరీ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్నెస్‌డిఎల్) సంస్థ షేర్లు దూసుకుపోతున్నాయి. మూడురోజుల క్రితమే మార్కెట్‌లోకి వచ్చిన సంస్థ వరుసగా లాభాల్లో కొనసాగుతోంది.

ఐపిఒ ఇష్యూధర రూ.800 కాగా ప్రస్తుతం రూ.1324 వద్ద ట్రేడ్ అవు తోంది. తొలి పబ్లిక్ ఇష్యూలో భాగంగాషేర్లు దక్కించుకున్నవారికి 60శాతానికి పైగా ప్రతిఫ లాన్ని అందించింది. అంటే ఐపిఒలో ఎవరైనా రూ.లక్ష ఇన్వెస్ట్‌చేసి ఉంటే వారిసొమ్ము మూడు రోజుల్లోనే రూ.1.60 లక్షలు దాటిందని అంచనా వేస్తున్నారు ఈ ఐపిఒలో క్యూఐబి కోటా 103 రెట్లు కొనుగోళ్లు జరిగింది.

# కృత్రిమమేధలో జిపిటి5తో జాగ్రత్త



## మైక్రోసాఫ్ట్ సిఇఒకు ఎలాన్ మస్క్ అలర్ట్!

**న్యూయార్క్, ఆగస్టు 8:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచంలో మరో పెను సంచలనం నమోదైంది. టెక్ దిగ్గజం ఓపెన్ ఎఐ తన సరికొత్త, అత్యంత శక్తిమంతమైన ఎఐ మోడల్ జిపిటి5ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. ఈ అత్యాధునిక టెక్నాలజీని వినియోగదారులందరికీ ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించడం టెక్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్, మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్లను ఉద్దేశించి చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎలాన్ మస్క్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ఓపెన్ఎఐ మైక్రోసాఫ్ట్‌ను బతికుండగానే మింగేస్తుందంటూ సత్య నాదెళ్లకు సూటి హెచ్చరిక జారీ చేశారు. ఎఐ రంగంలో ఓపెన్ఎఐకి మైక్రోసాఫ్ట్ ప్రధాన భాగస్వామిగా ఉన్న తరుణంలో మస్క్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓపెన్ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ, ఇది ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఎజిఐ) దిశగా వేసిన అతిపెద్ద ముందడుగు అని అభివర్ణించారు. జిపిటి3ని ఒక హైస్కూల్ విద్యార్థితో, జిపిటి4ని కాలేజీ విద్యార్థితో పోల్చిన ఆయన, జిపిటి5 ఒక పిహెచ్‌డీ స్థాయి నిపుణుడితో సమానమని అన్నారు. దీని సామర్థ్యం చూసి తాను భయపడ్డానన్నారు.

తాను పరిష్కరించలేకపోయిన ఒక క్లిష్టమైన సమస్యను జిపిటి5 సునాయాసంగా పరిష్కరించినప్పుడు, తాను పనికిరానివాడినని అనిపించిందని ఆల్ట్‌మన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎలాన్ మస్క్ హెచ్చరికపై మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల హుందాగా స్పందించారు. గత 50 ఏళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకోవడం, భాగస్వామ్యాలు, పోటీ అన్నీ ఉంటాయి. మా అజూర్ ప్లాట్‌ఫామ్‌పై గ్రాక్ 4 కోసం ఎదురుచూస్తున్నాం, గ్రాక్ 5 కోసం కూడా ఆసక్తిగా ఉన్నామని నాదెళ్ల బదులిచ్చారు. మైక్రోసాఫ్ట్ తన 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, అజూర్ ఎఐ ఫౌండ్రీ వంటి అన్ని ప్రధాన ఉత్పత్తులలో జిపిటి 5ను అనుసంధానించినట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, తన సొంత ఎఐ ప్లాట్‌ఫామ్ గ్రాక్‌ను వెనకేసుకొచ్చిన మస్క్, ఇప్పటికీ గ్రాక్ 4 హెవీ మోడలే అత్యంత శక్తిమంతమైనదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రముఖ ఎఐ కోడింగ్ ఎడిటర్ కర్సర్ ఎఐ కూడా తమ ప్లాట్‌ఫామ్‌లో జిపిటి5ను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించింది. తాము పరీక్షించిన వాటిలో ఇదే అత్యంత తెలివైన కోడింగ్ మోడల్ అని తెలిపింది. జీపీటీ5 ఉచితంగా అందుబాటులోకి రావడంతో ఏఐ రంగంలో పోటీ మరింత తీవ్రరూపం దాల్చింది.



## నాకు బోర్డు సంపూర్ణ మద్దతు
### - ఇంటెల్ సిఇఒ

**సియాటెల్, ఆగస్టు8:** కంప్యూటర్ చిప్ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ సిఇఒ లిప్ బు టాన్ తనకు కంపెనీ బోర్డుసభ్యుల మద్దతు పూర్తిగా ఉందని తెలిపారు. తనపై తప్పుడు ప్రచారానికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు శ్వేతసౌధాన్ని సంప్రదించామన్నారు. అమెరికా, ఆర్థిక జాతీయభద్రతను మెరుగుపరిచేలా ఉన్న అధ్యక్షుడి లక్ష్యాలను పంచు కుంటానన్నారు. గతంలో తాను పనిచేసిన వాల్డన్ ఇంటర్నేషనల్; కాడెన్స్ డిజైన్ సిస్టమ్స్ గురించి తప్పుడు సమాచారం వ్యాప్తిచేసార న్నారు. ఎల్లవేళలా తాను అత్యున్నత స్థాయి న్యాయనైతిక విలువలకే కట్టుబడి ఉన్నానని ఆయన ఉద్యోగులకు రాసిన లేఖలో తెలిపారు. ప్రస్తుత కీలక స్థితిలో ఇంటెల్‌కార్పొరేషన్‌కు నాయకత్వం వహించడం కేవలం ఉద్యోగం కాదని అదొక గౌరవమని, నాపేరుప్రతిష్టలు కేవలం విశ్వాసంతోనే సాధించుకున్నట్లు చెప్పారు. మలేసియాలో పుట్టిపెరిగిన లిప్‌బుటాన్ వివాదాస్పద వ్యక్తంగా పేరుపడ్డారు. రాజీనామా చేయాలని అంటూ అమెరికా అధ్యక్షుడు తన ట్రూత్ మీడియా పోసు పెట్టడంతో అగ్గిరాజుకుంది. టాన్ తాను సొంతంగా వెంచర్‌ఫండ్లు స్థాపించి వందలాదిచైనా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం జరిగింది. వాటిలోకొన్ని చైనా మిలిటరీ సంస్థలుకూడా ఉన్నట్లు ఒక అంతర్జాతీయ వార్తాసంస్థ వెల్లడించడంతో అగ్గిరాజేసుకుంది.

## ట్యారిఫ్ ఎఫెక్ట్! ఆర్డర్లు నిలిపివేసిన వాల్‌మార్ట్, అమెజాన్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారత వస్త్ర పరిశ్రమను పెను సంక్షోభంలోకి నెట్టింది. భారత వస్తువులపై ఏకంగా 50 శాతం సుంకం విధిస్తున్నట్లు ఆయన ప్రకటించడంతో వాల్‌మార్ట్, అమెజాన్, టార్గెట్, గ్యాప్ వంటి దిగ్గజ రిటైల్ సంస్థలు భారత్ నుంచి ఆర్డర్లను తక్షణమే నిలిపివేశాయి. ఈ మేరకు భారత ఎగుమతి దారులకు శుక్రవారం సమాచారం అందినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.




అమెరికాలోని కొనుగోలుదారులు తమకు లేఖలు, ఈమెయిళ్ల ద్వారా ఈ విషయం తెలియజేశారని, తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వస్త్రాలు, టెక్స్‌టైల్స్ రవాణాను నిలిపివేయాలని కోరినట్లు ఎగుమతిదారులు చెబుతున్నారు. పెరిగిన సుంకాల భారాన్ని పంచుకోవడానికి అమెరికన్ కంపెనీలు అంగీకరించడం లేదు. మొత్తం భారాన్ని భారత ఎగుమతిదారులే భరించాలని స్పష్టం చేస్తున్నాయి. ఈ కొత్త సుంకాల వల్ల ఎగుమతి ఖర్చులు 30 నుంచి 35 శాతం వరకు పెరిగే అవకాశం ఉండటంతో ఈ భారాన్ని మోయడం అసాధ్యమని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఈ పరిణామం ఫలితంగా అమెరికాకు వెళ్లే ఆర్డర్లు 40 నుంచి 50 శాతం వరకు పడిపోవచ్చని, తద్వారా భారత పరిశ్రమకు ఏటా 4 నుంచి 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 35 వేల కోట్లకు పైగా) నష్టం వాటిల్లుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వెల్‌స్పన్ లివింగ్, గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్, ఇండో కౌంట్, ట్రైడెంట్ వంటి ప్రధాన భారతీయ ఎగుమతి సంస్థలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ కంపెనీలు తమ మొత్తం అమ్మకాల్లో 40 నుంచి 70 శాతం వరకు అమెరికా మార్కెట్‌పైనే ఆధారపడి ఉన్నాయి. ఈ పరిస్థితి మన పోటీ దేశాలైన బంగ్లాదేశ్, వియత్నాంలకు వరంగా మారే ప్రమాదం ఉంది. ఆ దేశాలపై అమెరికా కేవలం 20 శాతం సుంకాన్నే విధిస్తోంది. దీంతో భారత ఎగుమతిదారులు తమ మార్కెట్ వాటాను కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. ఇది భారత పరిశ్రమకు పెద్ద ఎదురుదెబ్బ అని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ అభిప్రాయపడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 36.61 బిలియన్ డాలర్ల విలువైన భారత టెక్స్‌టైల్స్, వస్త్రాల ఎగుమతుల్లో అమెరికా వాటానే 28 శాతంగా ఉంది. తాజా పరిణామాలతో భారత ఎగుమతిదారులు తీవ్ర గందరగోళంలో పడిపోయారు.




## 12.5% పెరిగిన ఎస్‌బిఐ నికరలాభం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అద్భుతమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను రూ. 19,160 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు శుక్రవారం వెల్లడించింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 12.5 శాతం అధికం. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంకు నికర లాభం రూ. 17,035 కోట్లుగా ఉంది. బ్యాంకు నిర్వహణ లాభం కూడా గణనీయంగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే 15.49 శాతం వృద్ధితో రూ. 30,544 కోట్లకు చేరినట్టు ఎస్‌బిఐ తెలిపింది. అయితే, రుణాలపై వచ్చే వడ్డీకి, డిపాజిట్లపై చెల్లించే వడ్డీకి మధ్య వ్యత్యాసమైన నికర వడ్డీ ఆదాయం మాత్రం దాదాపు స్థిరంగా రూ. 41,072.4 కోట్ల వద్ద నిలిచింది. ఈ త్రైమాసికంలో ఎస్‌బిఐ ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడటం విశేషం. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 1.83 శాతానికి తగ్గగా, నికర నిరర్థక ఆస్తులు 0.47 శాతానికి పరిమితమయ్యాయి. మంచి రుణాలు మొండి బకాయిలుగా మారే రేటును సూచించే స్లిప్పేజ్ రేషియో కూడా 0.75 శాతానికి తగ్గింది. ఇది బ్యాంకు ఆర్థిక పటిష్ఠతకు సంకేతంగా నిలుస్తోంది. వివిధ రంగాలకు అందించే రుణాల్లోనూ బ్యాంకు బలమైన వృద్ధిని నమోదు చేసింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఇ)కు ఇచ్చే రుణాలు వార్షిక ప్రాతిపదికన 19.10 శాతం పెరిగాయి. వ్యవసాయ రుణాలు 12.67 శాతం, రిటైల్ రుణాలు 12.56 శాతం చొప్పున వృద్ధి చెందాయి. కార్పొరేట్ రుణాలు 5.7 శాతం పెరిగాయి. మరోవైపు, బ్యాంకు వద్ద కరెంట్, సేవింగ్స్ ఖాతాల్లోని (కాసా) డిపాజిట్లు 8 శాతం పెరిగాయి. బ్యాంకు మొత్తం అడ్వాన్సులు రూ. 42.5 లక్షల కోట్లకు చేరాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.